# వైదిక విజ్ఞానం

రచయిత

డా॥ చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2025

# VAIDIKA VIGNANAM

**By**
**Dr. Chirravuri Sivarama Krishna Sarma**

**Editor**
**Dr. Akella Vibhishana Sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No. 1514

© All Rights Reserved

First Edition : 2025

Copies : 250

*Published by*
**Sri J. Syamala Rao,** I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati - 517 507.

***DTP***
Publications Division
T.T.D, Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.





# ముందుమాట

భారతీయ సంస్కృతికి, తత్త్వజ్ఞానానికి మూలమే వేదాలు. సమాజంలోని ప్రతి వ్యక్తి మన ప్రాచీన భారతీయుల విజ్ఞాన వైభవాన్ని, విశాల దృక్పథాన్ని అర్థం చేసుకున్నప్పుడే ఆర్షవాఙ్మయానికి ఆదరణ లభిస్తుంది.

ప్రస్తుత అంశం వైదిక విజ్ఞానమనే వ్యాససంపుటి. ఇందులో శ్రీమద్భాగవత వైశిష్ట్యం, కల్పసూత్రాలు, బ్రహ్మచర్య ప్రాశస్త్యం, వాయూత్పత్తి - ప్రాణం, జీవితలక్ష్యాలు, ధన్యోపాఖ్యాన గాంభీర్యం, ప్రాచీన భారతీయ యంత్రవిజ్ఞానం, వైమానిక శాస్త్ర పరిచయం, మహావీరుడు - మహావీరం, హరప్పా అవశేషాలలో శివావతారాలు, ఆరాధన - అనుభూతి, మృత్యువు, దయానంద సరస్వతి - ఆయన వ్యాఖ్యాన పద్ధతి- అనే శీర్షికలతో వైదిక విజ్ఞానాన్ని తెలియజేశారు.

శ్రీమద్భాగవత వైశిష్ట్యంలో భాగవతం అష్టాదశ పురాణాలలో ఒకటి అని, దీని పఠన పాఠన శ్రవణలతో భక్తులు భవసాగరాన్ని దాటుతారని, ఇది భగవద్విభూతి అని, భాగవతం శ్రీకృష్ణ శరీరమని, విశిష్టమైన విషయాలకోసం అన్వేషిస్తే భాగవతం వల్ల సమాజానికి పూర్ణ ప్రయోజనం కలుగుతుందని వివరించారు.

కల్పసూత్రాలనే శీర్షికలో కల్పసూత్రాలు వేదపురుషునికి చేతుల వంటివని, వాటిలో శ్రౌత, గృహ్య, ధర్మ, సూత్రాలుంటాయని, సీమంతం మొదలు మరణం వరకు ఉండే కర్మలను ప్రతిపాదించేవి గృహ్యసూత్రాలని, ధర్మసూత్రాలు ధార్మికనియమాలను బోధిస్తాయని, యజ్ఞాలకు సంబంధించిన విధివిధానాలను బోధించేవి శ్రౌతసూత్రాలని వివరింపబడింది.

జీవితలక్ష్యాలు అనే శీర్షికలో మానవుడు ధర్మవిరుద్ధమైన అర్థకామాలను వదలాలని, వేదంలో చెప్పినట్లు ధర్మమార్గంలో పుత్రులను పొంది, మూడు ఋణాలను తీర్చిన తరువాతనే మోక్షాన్ని పొందాలని పేర్కొన్నారు.

ధన్యోపాఖ్యానంలో దక్షిణతో కూడిన యజ్ఞపురుషుడే ధన్యుడని, ప్రాచీన భారతీయ యంత్ర విజ్ఞానం శీర్షికలో సూర్యసిద్ధాంతం గురించి, నరయంత్రం, భూ భగోళ యంత్రం, సిద్ధాంత శిరోమణి, సమరాంగణ సూత్రధారం అనే వాస్తుశాస్త్రం గురించి, భరద్వాజమహర్షి వ్రాసిన వైమానిక శాస్త్రంలో విమానాల తయారీ గురించి విస్తృతంగా వివరించడమైనది. మహావీరుడు–మహావీరం అనే శీర్షిక క్రింద భవభూతి రచనలలో శ్రీరాముని గురించి వివరముంది. హరప్పా అవశేషాలలో శివావతారం గురించి వివరణ, మృత్యువు అనే శీర్షిక క్రింద మృత్యువు వచ్చే సూచనలు గురించి వివరించారు.

'వైదిక విజ్ఞానం' అనే ఈ చిరుపుస్తకము సామాన్య పాఠకులకు ఎంతో ఉపయోగకరమైంది. దీనిద్వారా భారతీయ విజ్ఞాన వైభవం గురించి, బ్రహ్మచర్యాశ్రమ నియమాలను గురించి, భారతీయ వైమానికశాస్త్రం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవచ్చు. ఈ శీర్షికలతో 'వైదిక విజ్ఞాన'మనే ఈ పుస్తకాన్ని అందించిన డా॥ చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మ గారికి ధన్యవాదాలను తెలుపుతూ, వారికి అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీనివాసుని అనుగ్రహం కలగాలని ప్రార్థిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో...

ఐ. శ్యామల రావు

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# నివేదన

సనాతన సంప్రదాయానికి వేదాలు ప్రధానాధారాలు. అందుకే ఈ ధర్మాన్ని వేద ధర్మమని, వైదిక మతం అని వైదిక సంప్రదాయమని పిలుస్తారు. ప్రపంచ నాగరికతలు పుట్టి కన్నులు తెరవకమునుపే సనాతన భారతీయ సంప్రదాయం ఉచ్ఛస్థాయిలో ఉన్నది. నేడు భారతీయ విజ్ఞనం సైన్స్ అని ఏదైతే చెబుతున్నదో అవన్నీ మన వేదాలలోను, శాస్త్రాలలోను పురాణాలలోను ఎప్పుడో చెప్పబడ్డాయి.

నిజానికి మన సనాతన భారతీయ సాహిత్యం ఒక విజ్ఞాన భాండాగారం. ఇందులో లేనిది మరే పాశ్చాత్య సంప్రదాయాల్లోను లేదన్నదని అతిశయోక్తికాదు. వ్యవసాయం మొదలుపెట్టి వైద్యం, ఖగోళ, భూగోళ, గణిత, అంతరిక్ష, జలార్గళాది శాస్త్రాలను మనభారతీయులు ఎప్పుడో అవపోశనపట్టి గ్రంథస్థం చేశారు. నేడు వైద్యరంగంలో అత్యాధునిక సృష్టిగా చెప్పుకుంటున్న 'టెస్ట్‌ట్యూబ్ బేబీ' ప్రక్రియ మనకు మన మహాభారతంలోనే కనిపిస్తుంది. నేడు ఆధునికసమజాంలో చూస్తున్న క్షిపణులు, అణుబాంబులు మున్నగు యుద్ధ, ఆయుధ, వ్యూహ, ప్రతివ్యూహాది ప్రక్రియలను తలదన్నే ప్రక్రియలు మన రామాయణ భారత, గ్రంథాలలో ఏనాడో ఉపయోగించారు. మహాభారత యుద్ధాన్ని ఒకసారి గమనిస్తే సూర్యుడినికూడా కొంతసేపు అడ్డుకున్న విధానం మనకు కనిపిస్తుంది. సమ్మోహనాస్త్రాలు, నాగాస్త్రాలు, బ్రహ్మాస్త్రాలు, వారుణాస్త్రాలు, ఆగ్నేయాస్త్రాలు, పాశుపతాస్త్రాలు ఈ కోవలోకి చెందినవే.

ఇక నేడు కృత్రిమ వర్షాల విషయానికి వస్తే మన వైదిక సంప్రదాయంలో వరుణహెూమాలు వరుణ జపాలు, ఇష్టి చేయడంద్వారా వర్షాలను కురిపించేవారు. అయోధ్యానగరంలో వర్షాభావం ఏర్పడినపుడు ఋష్యశృంగ మహర్షిని పిలిపించి చేయించిన యాగం ఫలితాన్నిచ్చి రాజ్యాన్ని సస్యశ్యామలం చేసిందని మనకు రామాయణం చెబుతున్నది.

ఇక వైమానికి శాస్త్రాన్ని ఒకసారి పరిశీలిస్తే ఆధునిక సమాజంలో 'రైట్ సోదరులు' కనుగొన్నట్లు చెప్పబడుతున్న విమానాలను తలదన్నే వైమానిక శాస్త్రం మనకు మన పురాణేతిహాసాలలో కనిపిస్తున్నది. ఇందుకు పుష్పక విమానం ఒక చక్కటి ఉదాహరణ. ఈ పుష్పక విమానం గురించి రామాయణంలోను, ఇతర పురాణాలలోను కనిపిస్తుంది. రావణాసురుడు కుబేరునివద్దనుండి హస్తగతం చేసుకున్నది, సీతాదేవిని అపహరించుకు తీసుకుపోయినది, రావణవధానంతరం సీతారాములు అయోధ్యానగరానికి చేరుకున్నది ఈ పుష్పక విమానంలోనే. ఈ విమానం యొక్క మరో విశేషమేమంటే ఇందులో ఎంతమంది ఎక్కిన మరికొంతమందికి స్థలం ఉండడం.

ఇలా చెబుతూపోతే ఈ పీఠికే ఒక బృహద్గ్రంథం అవుతుంది. ప్రస్తుత గ్రంథం "వైదిక విజ్ఞానం" ఇటువంటి ఆసక్తిదాయకమైన అంశాలను కలిగి పాఠకులకు మంచి విజ్ఞానాన్ని అందిస్తుంది. ఈ గ్రంథాన్ని రచించినవారు ప్రముఖ వేదపండితులు, భాగ్యనగర వాస్తవ్యులు, విశ్రాంత ఆచార్యులు అయిన ఆచార్య చిర్రావూరి శివరామకృష్ణశర్మగారు.

తెలుగు రాష్ట్రాలలో వేదపరిచయం ఉన్నవాళ్ళలో శ్రీ చిర్రావూరి వారిని ఎరుగనివారంటూ ఉండరు. ఎందుకంటే వారు కేవలం వేదపండితులేకాక వైదిక సాహిత్యానికి సంబంధించి అనేక గ్రంథాలను రచించినవారు, పరిశోధకులు కూడాను. ఇటువంటి అమూల్యమైన గ్రంథాన్ని అందించిన శ్రీ చిర్రావూరి వారికి శ్రీనివాసుని అనుగ్రహం నిరంతరం ఉండాలని ప్రార్థిస్తూ 'తినబోతూ రుచులెందుకు' అన్నట్లు ఇంకా ఈ గ్రంథాన్ని గురించి నేను చెప్పడంకన్నా పాఠకులు చదివితేనే అందం, ఆనందం, విజ్ఞానదాయకం.

**– డా|| ఆకెళ్ళ విభీషణశర్మ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | శ్రీమద్భాగవత వైశిష్ట్యం | 1–10 |
| 2. | కల్పసూత్రాలు | 11–34 |
| 3. | ఋగ్వేదభాష్యాలు – భాష్యకారులు | 35–40 |
| 4. | శ్రీ దయానంద సరస్వతీస్వామి | 41–45 |
| 5. | బ్రహ్మచర్య ప్రాశస్త్యం | 46–53 |
| 6. | వాయూత్పత్తి – ప్రాణం | 54–58 |
| 7. | జీవిత లక్ష్యాలు | 59–60 |
| 8. | సూక్తులు | 61–68 |
| 9. | ధన్యోపాఖ్యాన గాంభీర్యం | 69–71 |
| 10. | ప్రాచీన భారతీయ యన్త్రవిజ్ఞానం | 72–93 |
| 11. | వైమానిక శాస్త్ర పరిచయం | 94–111 |
| 12. | మహావీరుడు – మహావీరం | 112–117 |
| 13. | హరప్పా అవశేషాలలో శివావతారాలు | 118–120 |
| 14. | ఆరాధన – అనుభూతి | 121–123 |
| 15. | మృత్యువు | 124–134 |
| 16. | శ్రీ దయానంద సరస్వతీ స్వామి – ఆయన వ్యాఖ్యాన పద్ధతి | 135–140 |

# శ్రీమద్భాగవత వైశిష్ట్యం

శ్రీమద్భాగవతం వేదాంత రహస్య శుద్ధాంతం. ఐహికాముష్మిక చతుర్విధ పురుషార్థ సాధన ధురీణం. భక్తజనులు ఆ గ్రంథరాజాన్ని అందులో భాగాలను పారాయణం చేస్తారు. దీని పఠన పాఠన శ్రవణ సమర్చలచే భక్తులు సంసారసముద్రం దాటుతారు.

శ్రీమద్భగవద్గీతతో పాటు శ్రీమద్భాగవతం కూడా పలు దేశాలలో వ్యాప్తిని పొందింది.

భాగవతం అష్టాదశ మహాపురాణాలలో ఒకటి. ఇతర మహాపురాణాలు కూడా శ్రీమద్భాగవతాన్ని ప్రశంసించాయి. ఆ ప్రశంస దేవీభాగవతానికి సంబంధించినదని అనుకోకుండా భాగవతంలో సారాన్ని పేర్కొంది 'నారదపురాణం'.

**శ్లో॥ అర్థోయం బ్రహ్మసూత్రాణాం భారతార్థవినిర్ణయః**
**గాయత్రీభాష్యభూతోఽసౌ వేదార్థపరిబృంహితః ॥**
**పఠనా త్పాఠనా ద్ధ్యానా త్స్పర్శనాదర్చనాద్గురో**
**సర్వపాపహరః కృష్ణరూపీ చైవ న సంశయః – గరుడ పురాణము**

తాత్పర్యనిర్ణయ గ్రంథము. ఇది గాయత్రీమహామంత్రానికి భాష్యగ్రంథం. వేదార్థమునుపబృంహణం చేస్తుంది. దీన్ని చదువుట వల్ల, చదివించుట వల్ల, విషయాలను ధ్యానం చేయుట వల్ల, చివరకు తాకుట వల్ల, అర్చించుట వల్ల అన్ని పాపాలు పోగొడుతుంది. భాగవతం శ్రీకృష్ణ రూపం, సందేహం లేదు.

బ్రహ్మవైవర్తములో భగవద్విభూతులను చెబుతూ 'పురాణేషు భాగవతమ్' పురాణాలలో భాగవతం భగవద్విభూతి అని చెప్పారు.

భాగవతమహిమ స్కాందపురాణంలో ఉంది. పద్మపురాణం కూడా భాగవతమహత్త్వం కొనియాడింది. కౌశికసంహితలో కూడా భాగవత

మాహాత్మ్యం ఉంది. ఇలా అనేక గ్రంథాలు భాగవతాన్ని ప్రశంసించినట్లే భాగవతానికి టీకలు కూడా చాలమంది రాశారు.

శ్రీధరాచార్యులవారి భావార్థదీపిక అద్వైతవ్యాఖ్య ప్రసిద్ధమైనది. దీనికే మహాపండితుడు వంశీధరశర్మ భావార్థ దీపికాప్రకాశటీక అనే బృహద్వ్యాఖ్యను రచించారు. ఈ వ్యాఖ్యాత అసామాన్యుడు. వేద, వేదాంగ, న్యాయవేదాంత, సాహిత్యానేక శాస్త్ర పారదృశ్వుడు, శ్రీమద్భాగవతాద్య పద్య శతక వ్యాఖ్యాత, శ్రీమద్భాగవతలీలాకల్పద్రుమ, శ్రీమద్భాగవత సప్తాహవచన పరమోపయోగి గోలార్థదీపికాటీక మున్నగు ననేక గ్రంథనిర్మాణ ధురంధరులు.

శ్రీ వేంకట కృష్ణాచార్య విరచిత శ్రీ భాగవత చంద్రిక విశిష్టాద్వైత వ్యాఖ్య, విజయధ్వజాచార్యుల వారి విజయధ్వజీయ ద్వైతవ్యాఖ్య కూడ దీనినలంకరించాయి. ప్రస్థానత్రయానికి త్రిమతాచార్యుల భాష్యాలున్నట్లే శ్రీమద్భాగవతానికి కూడా త్రిమత వ్యాఖ్యలున్నాయి. బృహత్క్రతు సందర్భం కూడా వీరి రచనయే. జీవగోస్వామి వైష్ణవతోషిణి రచించారు. విశ్వనాథ చక్రవర్తి సారార్థదర్శినిని రచించారు. వల్లభాచార్యులవారు సుబోధిని వ్రాశారు. సుదర్శనసూరి శుకపక్షి టీక గ్రంథించారు. శుకదేవుడు సిద్ధాంత ప్రదీపం రచించారు. రాధారమణ దాసగోస్వామి 'దీపికాదాసిని' వెలయించారు. సనాతన గోస్వామి బృహద్వైష్ణవతోషిణి రచించారు. ఇంకా బాలబోధిని, ప్రేమమంజరి, గణదీపిక, విశుద్ధరసదీపిక వ్యాఖ్యలు భాగవతానికున్నాయి. హనుమట్టీక, చిత్సుఖ టీక, శంకరాచార్య టీక కూడా భాగవత టీకలే. ఈ శంకరాచార్యులెప్పటివారో?

శ్రుతిగీతలకు అయిదు రకాల వ్యాఖ్యలున్నాయి. శ్రీ నీలకంఠాచార్య ప్రణీత వ్యాఖ్యానంలో ప్రతి స్కంధానికి వేరే వేరే శ్రవణ మాహాత్మ్యాలున్నాయి. ఇక శ్రీమద్భాగవతానికి దేశభాషానువాదాల మాట చెప్పితే అదే ఒక మహావ్యాసమవుతుంది.

ఒక భాషలోనే అనేకానువాదాలు వెలువడ్డాయి, వెలువడుతున్నాయి.

ఏబది నాలుగు గ్రంథాలను రచించిన గంగాసహాయ పండితుడు వార్ధక్యంలో శ్రీమద్భాగవతానికి అన్వితార్థ ప్రకాశికా టీక రచించాడు. అది పలు పండితుల ప్రశంసలనందుకొంది. దీనిలో అన్వయక్రమంలో అన్ని శ్లోకాల అర్థం ఉంటుంది. అతి విస్తరంగా ఉండదు. భక్తులకుపయోగించే విషయాలు ఉంటాయి. అతిసుగమంగా ఉంటుంది. పూర్వటీకల నుండి విషయాలు సేకరించి గంగాసహాయుడు ఈ వ్యాఖ్య వ్రాశారు.

చాలా పురాణాలకు వ్యాఖ్యానాలే లేవు. ఉన్నా లభించడం లేదు. ఇన్ని వ్యాఖ్యానాలు వ్యాఖ్యానంపై వ్యాఖ్యానం మరే పురాణానికున్నాయి?

అందుకే వంశీధరశర్మ మహాశయుడు –

భాగవతం బ్రహ్మసమ్మితం. బ్రహ్మనిత్యం. భాగవతం నిత్యమే. దీన్ని వ్యాసమహర్షి కొత్తగా రచించలేదు. అంతకుముందున్నదాన్ని ఆవిష్కరించారని వ్రాశారు.

శ్రీమద్భాగవతంలో కర్మోపాసనా జ్ఞానకాండలు మూడు ఉన్నాయి. వేదంలో ఇలాగే ఉన్నాయి. కాబట్టి భాగవతం వేద సమ్మితము. భాగవతంలో వేదవిభాగం, వేదప్రశంస ఉన్నాయి కాబట్టి ఇవి ప్రశంసావాక్యాలని చెప్పవచ్చు.

అష్టాదశ పురాణాలలోనిది ఈ భాగవతం కాదు దేవీభాగవతం అని శాక్తేయ సంప్రదాయం వారి అభిప్రాయం.

కాని చాలా పురాణాలలో ఈ భాగవతం ప్రశంసింపబడింది. స్కాందపురాణం ఇలా పేర్కొంది.

**పరీక్షిచ్ఛుకసంవాదో యోగో వ్యాసేన వర్ణితః**
**గ్రన్థోఽష్టాదశ సహస్రః సోఽసౌ భాగవతాభిధః**

అని భాగవతం పరీక్షిచ్ఛుకసంవాదమని తెల్పడం ఇది ఈ భాగవతాన్ని ఉద్దేశించిన వాక్యమే అని స్పష్టం చేస్తోంది.

నారదీయపురాణంలో –

**మరీచే శ్రుణు వక్ష్యామి వేదవ్యాసేన యత్కృతమ్**
**శ్రీమద్భాగవతం నామ పురాణం వేదసమ్మితమ్**

అని ఆరంభించి ఈ భాగవతంలోని ప్రధానాంశాలను కూడా పేర్కొన్నారు.

పాద్మపురాణంలో భాగవత మాహాత్మ్యమే ఉంది. దానిలో విష్ణుభక్తితో కూడిన భాగవత ప్రశంసయే ఉంది. వాయవీయ భాగవతోత్సవనిధిలో కూడా ఈ భాగవత కథకు చెందిన ఉత్సవాలే ఉన్నాయి. కాబట్టి పురాణ ప్రశంసలను పొందినది ఈ విష్ణు భాగవతమే అనే విషయంలో సందేహం లేదు.

శ్రీ దామోదరశాస్త్రి భాగవత దేవీభాగవతాలు రెండు మహాపురాణాలే. పురాణ లక్షణాలు రెండుచోట్ల సమానంగా ఉన్నాయి. కల్పభేదంచే ఇవి రెండూ ఏర్పడ్డాయని చెప్పారు. ఆ దృష్టితో చూస్తే ఇది శ్వేత వరాహకల్పం కనుక ఈ భాగవతమే ఈ యుగానికి సంబంధించింది అని చెప్పాలి.

గ్రంథ పరిమాణాన్ని బట్టి మహత్ అనే పదం ఉప అనే ఉపసర్గ చేరవచ్చు. కాని దానిచే ఆ గ్రంథ ప్రతిపాదనమే గొప్పదనము పెరగడమూ, తరగడమో కలుగుతుందని చెప్పక్కరలేదు.

శ్రీమద్భాగవతం శ్రీకృష్ణ శరీరంగా సంభావిస్తారు. ప్రథమ స్కంధం దక్షిణ చరణం. దీనిలో భాగవత శ్రవణాధికారుల గురించి చెప్పడం జరిగింది. సూతుడు వక్త. శౌనకాదులు శ్రోతలు. వీరు సత్రయాగ సందర్భంగా విరామకాలంలో పురాణాలను భారతేతిహాసాన్ని శ్రవణం చేశారు.

నారదుడు వక్త - వ్యాసుడు శ్రోత, అనేక గ్రంథాలు రచించినా చిత్తశాంతి లేని వ్యాసునికి నారదుడుపదేశించి దానిని విస్తరించి వ్రాయమని చెప్పాడు.

శ్రీ శుకుడు వక్త - పరీక్షిత్తు శ్రోత. వీరిలో పరీక్షిత్తు ప్రాయోపవేశం చేసినవాడు. శ్రీ శుకుడు ముక్తుడు. ఇలా మూడు రకాల అధికారుల ప్రస్తావన ఈ స్కంధంలో జరిగింది.

ద్వితీయస్కంధాన్ని శ్రీకృష్ణుని వామపాదంగా భావిస్తారు. దీనిలో భగవత్ప్రాప్తి సాధనాలు చెప్పారు. తత్త్వధ్యానం, విరాడ్రూపోపాసన, స్థూల ధారణ నిలిచిన తరువాత అది సూక్ష్మమయిన బ్రహ్మయందు మనస్సును లీనం చేయడం ఉపదేశించారు. తరువాత (హృత్ప్రసాదం) విష్ణుభక్తికి సాధనమయిన భగవత్కథల యందు పరీక్షిత్తుకు ఆసక్తి కలదని వెల్లడించారు.

తృతీయస్కంధం శ్రీకృష్ణుని దక్షిణకరం. దీనిలో సృష్టిలీల చెప్పబడింది. మహదాది స్థూలసృష్టి, బ్రహ్మ చేసిన సృష్టి, కాలసృష్టి, జీవసృష్టి చెప్పారు.

చతుర్థస్కంధం శ్రీకృష్ణుని వామకరం. దీనిలో పృథువు తన ప్రజలకు ధర్మోపదేశం చేశాడు. ధ్రువుడు తపస్సు వల్ల రాజ్యాన్నేకాక ధ్రువస్థానం కూడా పొందాడు. పృథువు పృథివి నుండి ఎవరికి ఏమి కావాలో అవి లభింపచేశాడు. ప్రచేతసులు నారదోపదేశం వల్ల మోక్షం పొందారు. పురంజనోపాఖ్యానం పరోక్షంగా ఆధ్యాత్మవిద్య బోధించింది. ఇలా ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలు దీనిలో ఉన్నాయి.

చతుర్థస్కంధం దక్షిణోరువు. దీనిలో భూలోకం, స్వర్గలోకం, అధోలోకాల వర్ణనముంది. మూడు స్థానాలను వర్ణించిన దీనిని స్థానలీల అంటారు.

షష్ఠస్కంధం వామోరువు. భక్తిని పోషించే భగవన్నామాది సాధనాలు వర్ణితాలు. అందుకే దీనిని పోషణలీల అన్నారు. అజామీళోపాఖ్యానంలో

భగవన్నామ మహిమ నిరూపించారు. సృష్టి చేయడం కోసం దక్షప్రజాపతి భగవద్ధ్యానం చేశాడు. దితి సంతానం కోసం విష్ణుదేవునర్చించింది. ఇవి భక్తిని పోషించే సాధనాలు కదా!

సప్తమస్కంధం శ్రీకృష్ణుని కుడి అరచేయి. జయ విజయుల అసద్వాసనలు వారిని భూలోకంలో దైత్యులుగా పుట్టించాయి. ప్రహ్లాదుని సద్వాసనలు భగవంతుని దరిజేర్చాయి. వాసనలకు ఊతి అని పేరు. అందుకే ఈ స్కంధాన్ని ఊతిలీల అంటారు.

అష్టమస్కంధం దక్షిణస్తనం. దీనిలో గజేంద్రుడు భగవంతుని స్మరించడం, భగవానుడు దేవతలకు అమృతదానం చేయడం, తన వరాన్ని పాటించడం కోసం అదితికి వామనునిగా అవతరించి, దేవేంద్రునికి రాజ్యం, బలిచక్రవర్తికి సుతలం ప్రసాదించడం వర్ణించారు.

నవమస్కంధం శ్రీకృష్ణుని వామస్తనం. దీనిలో సూర్య సోమ వంశాలు వర్ణితాలు. ఈశ కథకు ముందు వర్ణితమయిన ఈశాను కథ యిది.

దశమస్కంధం శ్రీకృష్ణుని హృదయం. దీనిలో సాత్త్విక రాజస తామస సాధనాలు వాటి ఫలాలు సోదాహరణంగా వర్ణించారు. దీనిలో దుష్టుల నిరోధం ప్రధానంగా ఉంది. దీనిని నిరోధలీల అంటారు.

ఏకాదశస్కంధం శ్రీకృష్ణుని శిరస్సు, దీనిలో ముక్తిలీల వర్ణితం. జీవుడు ముక్తిని పొందడానికి కావలసిన సాధనాలు, శ్రీకృష్ణుడు తన లోకాన్ని చేరడం దీనిలో ఉన్నాయి.

ద్వాదశస్కంధం శ్రీకృష్ణుని ఎడమ అరచేయి. దీనిని ఆశ్రయలీల అంటారు. ఈశ్వరుడు సర్వానికి అధిష్ఠానం. దీనిలో మహాపురుష వర్ణనలో ఆయనను అధిష్ఠానంగా చెప్పారు. ఆత్యంతికలయంలో లయానికి ఈశ్వరుడే అవధి అని వెల్లడి చేశారు. పురాణాలలో సర్గ, విసర్గ, వంశం, మన్వంతరం,

వంశానుచరితం ఉంటాయి. సర్గ అంటే మహదాది సృష్టి, విసర్గ బ్రహ్మాది కృత సృష్టి మొదలయినవి.

సూర్యచంద్ర వంశాలు, ఆ వంశాలలో కొందరి మహా పురుషుల చరితాలు, వంశ, వంశానుచరితాలు. మన్వంతరం ఒక మనువు పాలనా కాలం. అది 21 మహాయుగాల కాలం. పురాణాలలో ఇవి వర్ణిస్తారన్న మాట. శ్రీమద్భాగవతంలో స్థానం, పోషణం, ఊతి, నిరోధం, ముక్తి, ఆశ్రయం మొదలయినవి కూడా చెప్పారు.

ఇంత ఉత్కృష్ట గ్రంథంలో ప్రక్షేపాలు చేరకుండా ఉండడం కోసం వ్యాఖ్యాత ప్రతి అధ్యాయంలో శ్లోకాల సంఖ్య, ఉవాచల సంఖ్య, అర్ధ శ్లోకాల సంఖ్య చెప్పి కట్టుదిట్టం చేశారు.

భాగవతపురాణంలో అనేక మంత్రాలున్నాయి. మంత్రాలవలె పారాయణ యోగ్యమగు స్తోత్రాలనేకం ఉన్నాయి. పురాణాలలో సాధారణంగా సులభ భాష ఉంటుంది. భాగవతంలో చదవడానికి కూడా నోరు తిరగని జటిల శ్లోకాలు కూడా ఉన్నాయి. వీటిని అర్థం చేసుకోవడానికి పరిశ్రమ చేయాలి.

దీనిలో కావ్యాలలో ఉపయోగించే అలంకార సుందర వర్ణనలున్నాయి. మార్మికభాషలో వర్ణించిన పురంజనోపాఖ్యానం ఉంది. గజేంద్రమోక్షం మొదలయిన ఎన్నో ఉపాఖ్యానాలున్నాయి.

ఏకాదశస్కంధంలో ఉన్న ఉద్ధవగీతలు భారతీయ సిద్ధాంత సారమని చెప్పవచ్చు. ఏకనాథ మహరాజ్ దీనిని ఏకనాథ బృందావనమని చెప్పి మరాఠీలో అనువదించాడు.

శ్రీ భాగవత మహాపురాణము కృష్ణమయము, ప్రథమస్కంధంలో అశ్వత్థామ పరాభవం, గర్భగత పరీక్షిద్రక్షణం, పాండవచరితం, పరీక్షిత్తు ప్రాయోపవేశం మొదలయిన ఘట్టాలలో కృష్ణభక్తి నిండుగా ఉంది.

తృతీయస్కంధంలో ఉద్ధవ విదురుల సంవాదం, విదుర మైత్రేయ సంవాదం, కృష్ణభక్తి పరిపూర్ణాలు. సప్తమస్కంధంలో నారద ధర్మజ సంవాదంలో కృష్ణప్రసంగం ఉంది. విష్ణుపర్యాయంగా చాలాచోట్ల కృష్ణపదం వాడారు. ఇక దశమ, ఏకాదశ స్కంధాలు కృష్ణపూరితాలే. దీనిలో 258 అధ్యాయాల్లో 122 అధ్యాయాలు కృష్ణప్రధానాలు.

ఇతర పురాణాలలో ఉన్న ప్రధానాంశాలు దీనిలో ఉన్నాయి. దీనిలో ప్రధాన నాయకుని వంటి శ్రీకృష్ణుని కథ చాలా పురాణాలలో వర్ణితము. కాబట్టి భాగవతం పఠిస్తే ప్రతి పురాణం కొంత పరిచితమవుతుంది.

భాగవతంలో భక్తిరసం ఉంది. ఇది భక్తుల మనస్సును పరవశింపజేస్తుంది. ఈ రసంలో దాస్యం, సఖ్యం, వాత్సల్యం, మాధుర్యం భాగాలే.

సప్తాహదీక్షలో భాగవతం శ్రవణం చేసినా అర్థవంతంగా పారాయణ చేసినా ఒళ్ళు జలదరిస్తుంది. ఆనందబాష్పాలు స్రవిస్తాయి. కంఠం గద్గదం కావడం అనేకులకు అనుభవంలో ఉన్న విషయం.

ఈ మహాగ్రంథంలో భక్తియోగం, ధ్యానయోగం, సాంఖ్యయోగం, విజ్ఞానం, ఆగమవిషయాలు ఉండడం వల్ల విద్యావంతులకు కూడా భాగవతం పరీక్షాస్థానమైంది. అందుకే 'విద్యావతాం భాగవతే పరీక్షా' అనే సూక్తి ఏర్పడింది.

శ్రీమద్భాగవత గాథలకు అంతరార్థాలను చెప్పడం కూడా ఉంది. గజేంద్రమోక్షణ కథ ప్రసిద్ధము. సంసారమే సరోవరం. జీవుడు గజేంద్రుడు. కాలము మకరం, సంసార విషయాలలో ఆసక్తితో ఉన్న జీవునికి కాలమృత్యువు గ్రహించుచున్నదని తోచదు. మకరము గజేంద్రుని పాదమును పట్టుకొంటుంది. అంటే పాదముల శక్తి తగ్గిందంటే మృత్యువు సన్నిహితమని అర్థము. పరమాత్మను పట్టుకొన్నవానిని శ్రీహరి సుదర్శనమే నడిపిస్తుంది.

అదితి కశ్యపులు ప్రసిద్ధులే. దితి భేద బుద్ధి. అదితి అభేద బుద్ధి. భేదబుద్ధి హిరణ్యకశిపుని వంటి రాక్షసులను పొందుతుంది. అభేద బుద్ధి భగవంతుడైన వామనుని పొందుతుంది. కశ్యప శబ్దమునకు పశ్యకుడర్థమని తైత్తిరీయారణ్యకం చెబుతుంది. మనోవృత్తి సూక్ష్మముగ ఉండడంచే సర్వమును దర్శించువాడు అని అర్థం. సర్వం అంటే బ్రహ్మ అనే అర్థం కూడా ఉంది. కశ్యపుని మనోవృత్తి బ్రహ్మాకారమైనపుడు పరమాత్మ సాక్షాత్కరిస్తాడని భావం. ఇలా ఉంటాయి అంతరార్థాలు.

ఇలా అనేక విషయ విశిష్టంగా విలసిల్లినది శ్రీమద్భాగవతం. అందుకే

**శ్లో॥ ఇదం భాగవతం నామ పురాణం బ్రహ్మసమ్మితమ్**

శ్రీ భాగవతమనెడు పురాణం వేదంతో సమానం అని ప్రశంసింపబడింది. శ్రీమద్భాగవతాన్ని వ్యాఖ్యాతలు వేదం రక్షించినంత శ్రద్ధగా రక్షించారు. వేదంలో గల అష్టకాలు మొదలు అక్షరాల వరకు వారు లెక్కించారు. అలాగే శ్రీమద్భాగవతానికి కూడా గ్రంథ సంఖ్య మహావ్యాఖ్యాత అయిన శ్రీ వంశీధరశర్మ ఇలా వివరించారు.

దీర్ఘ వృత్తాలు, గద్యలు, అనుష్టుప్పులు గల గ్రంథంలో 32 అక్షరాలు ఒక గ్రంథంగా లెక్కింపబడుతుంది. ఈ రీతిని బట్టి భాగవతంలో 16195 సంఖ్య గల గ్రంథం ఉంది.

కాని భాగవతంలో 'అష్టాదశ సాహస్ర్యాం' అంటే 18000 గ్రంథం ఉందని తెలిపారు. ఇది ఎలా సరిపడుతుంది.

దీనిలో ఉవాచలు 1270, అర్ధ శ్లోకాలు 200 ఉన్నాయి.

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే అష్టాదశ సాహస్ర్యాం పారమహంస్యాం సంహితాయాం ప్రథమ స్కంధే శుకాగమన నామైకోన వింశోధ్యాయః వంటి వాక్యాలు కూడా వ్యాసరచితాలే. గ్రంథసంఖ్యలో ఇవి

కూడా ఉంటాయి. వాటి సంఖ్య 335 వీటినన్నిటిని కలిపి లెక్కపెడితే 18000 సంఖ్య సిద్ధిస్తుంది. ఇలాంటి మరో రీతి ద్వారా కూడా 18000 సంఖ్య సిద్ధింపజేశారా వ్యాఖ్యాత.

ఈ రహస్యం తెలియనివాడు భాగవత శ్లోకాలను లెక్కించి, కొంత గ్రంథం పోయిందని భ్రాంతిపడతాడు. భాగవతం వైశిష్ట్యానికి ఇదొక సూచకం.

భాగవతంలో కొన్ని కథలు విని అదే భాగవతసారమని భ్రమపడకుండా పండితులు, భాగవతప్రియులు భాగవత సముద్రంలో వ్యాఖ్యాతలెత్తిపోసిన విశిష్ట విషయమణుల కోసం అన్వేషిస్తే శ్రీమద్భాగవతం వల్ల సమాజానికి కలుగవలసిన పూర్ణప్రయోజనం కలుగుతుంది.

* * *

# కల్పసూత్రాలు

వేదాంగాలు ఆరు. వాటిలో కల్పసూత్రాలు వేదపురుషునకు చేతులవంటివి. ఇవి కర్మకాండాన్ని వివరిస్తాయి. కల్పసూత్రాల్లో శ్రౌత సూత్రాలు, గృహ్యసూత్రాలు, ధర్మసూత్రాలు, శుల్బసూత్రాలు ఉంటాయని కొందరి అభిప్రాయం. బౌధాయన కల్పసూత్రాలు, ఆపస్తంబ కల్పసూత్రాలలో చివర గృహ్య కల్పసూత్రాలు కలవని చెబుతారు. కల్పసూత్రగ్రంథాలే కాకుండా కేవలం ధర్మసూత్రాలు కూడా ఉన్నాయి. ఉదా : గౌతమధర్మసూత్రాలు.

గృహ్యకర్మలను ప్రతిపాదించేవి గృహ్యసూత్రాలు. గృహ్యసూత్రాలలో 'ఆపస్తంబం, సత్యాషాఢం, ద్రాహ్యాయణం, అగస్త్యం, శాండిల్యం, ఆశ్వలాయనం, శాంభవం, కాత్యాయనం అనే తొమ్మిది పూర్వసూత్రాలు, వైఖానసం, శౌనకీయం, భారద్వాజం, అగ్నివైశ్యం, జైమినీయం, వాధూలం, మధ్యందినం, కౌండిన్యం, కౌషీతకం అనే తొమ్మిది పరసూత్రాలు అని అగ్నివైశ్యసూత్రం చెబుతోంది.

కర్మలు, శ్రుతిలక్షణాలు, ఆచారలక్షణాలు అని రెండురకాలు. శ్రౌతసూత్రాలలో ఉన్న వివిధ యాగాలు శ్రుతిలక్షణాలు. ప్రత్యక్ష శ్రుతి తెలియకపోయినా ఆచారంచే తెలియబడే వివాహాది కర్మలాచార లక్షణాలు. అవే గృహ్యకర్మలు.

'అథ కర్మాణ్యాచారాద్యాని గృహ్యన్తే' అని ఆపస్తంబ గృహ్యసూత్రం, 'ఆచారాత్ ప్రయోగాత్ యాని గృహ్యన్తే' అని వృత్తికారుడు ఈ విషయం తెలుపుతున్నారు.

ఈ గృహ్యకర్మలను స్మార్తకర్మలని కూడా అంటారు. గర్భాదానం మొదలు మరణం వరకు ఉండే గృహ్యకర్మలను ప్రతిపాదించడం చేత వీటికి గృహ్యసూత్రాలనే పేరు వచ్చింది.

శాంఖాయన గృహ్యసూత్రం ఋగ్వేదానికి చెందింది. దీనిలో ఆరు కాండలున్నాయి. శాంబవ్యుడు కౌషీతకిశాఖకు సంబంధించిన గృహ్యసూత్రం వ్రాశాడు. ఇది కౌషీతకి బ్రాహ్మణాన్ని అనుసరించి రచించిన గ్రంథం. ఆశ్వలాయన గృహ్యసూత్రం ఐతరేయ బ్రాహ్మణానికి సంబంధించినది. దీనిలో నాలుగు కాండలున్నాయి. శాంభవ గృహ్యసూత్రం ఋక్శాఖకు సంబంధించిందే. ఇది ఎక్కువ ప్రమాణమై ఆచరణలో ఉంది.

గోభిల గృహ్యసూత్రం సామవేదానికి చెందినది. ఇది నాలుగు ప్రపాఠకాల గ్రంథం. దీనిలో స్మార్తాగ్న్యాధానం, పంచ మహాయజ్ఞాలు, పక్షాది స్థాలీపాకం, దర్శపూర్ణ మాసస్వరూపం, పిండ పితృయజ్ఞం మొదలైన విషయాలు తెలిపారు. దీనికి ఛాందోగ్యగృహ్యమనే పేరుకూడా ఉంది. దీనికి నారాయణ పండితుడు వృత్తి రచించాడు. గోభిలసూత్రం సామశాఖీయ సూత్రాలలో ప్రధానమయిందని తెలుస్తోంది.

ఖాదిర గృహ్యసూత్రం ద్రాహ్యాయణ శాఖకు చెందింది. రాణాయని శాఖవారు కూడా దీన్ని అనుసరిస్తారు. ఇది ద్రాహ్యాయణమతం అనుసరించింది. ఇది విషయం నందు గోభిలసూత్రాన్ని పోలి ఉంది. గోభిల సూత్రానికి ఇది సంగ్రహమని చెబుతున్నారు. దీనిలో నాలుగు పటలాలున్నాయి. ఖాదిర గృహ్యసూత్రంలో ఆగ్నేయస్థాలీపాకం, పుంసవనం మొదలైన కర్మలు ప్రతిపాదించారు.

ఇది గోభిల సూత్రంకంటె చిన్నది. గోభిలసూత్రం ప్రాచీనమైనది. జైమినిగృహ్యసూత్రం ద్రాహ్యాయణగృహ్యసూత్రం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాణాయని ద్రాహ్యాయణ గృహ్యసూత్రాన్ని రచించాడని ఊహిస్తున్నారు.

పారస్కర గృహ్యసూత్రం శుక్ల యజుర్వేదానికి సంబంధించినది. దీనినే కాత్యాయన గృహ్యసూత్రం, వాజసనేయగృహ్యసూత్రం అంటారు. హిరణ్యకేశి కల్పసూత్రంలో 19, 20 అధ్యాయాలు హిరణ్యకేశి గృహ్యసూత్రాలంటారు.

ఆపస్తంబ గృహ్యసూత్రం బోధాయన గృహ్యసూత్రం, శాట్యాయన గృహ్యసూత్రం, హిరణ్యకేశ గృహ్యసూత్రం, వైఖానస గృహ్యసూత్రం, భారద్వాజస గృహ్యసూత్రం, మానవ గృహ్యసూత్రం, కాఠక గృహ్యసూత్రం, వైఖానస గృహ్యసూత్రం కృష్ణయజుర్వేదానికి సంబంధించినవి.

మైత్రాయణీయ శాఖకు చెందినవి హిరణ్యకేశ గృహ్యసూత్రం, మానవ గృహ్యసూత్రం.

ఆంధ్రదేశంలో తైత్తిరీయులందరు ఆపస్తంబసూత్రులే. మానవ గృహ్యసూత్రంలో వినాయకోపాసన ఉంది. వైఖానస గృహ్యసూత్రం అతి విస్తృతం.

కౌశిక గృహ్యసూత్రం అథర్వవేదానికి సంబంధించింది. దీనిలో గృహ్యకర్మలతోపాటు అభిచారిక కర్మలు కూడా ఉన్నాయి. కాత్యాయన కల్పసూత్రంలో పంచవింశాధ్యాయంలో మృతాగ్నిహోత్రాదులు, ప్రాయశ్చిత్తం ఉన్నాయి.

బౌధాయన కల్పసూత్రంలో త్రింశప్రశ్నలో శుల్బసూత్రం చివర ప్రవరసూత్రం ఉన్నాయి.

సత్యాషాఢ కల్పసూత్రంలో పందొమ్మిది, ఇరవై ప్రశ్నలలో ఉపనయనం, వివాహం, గర్భాదానం మొదలైన స్మార్తకర్మలు చెప్పారు. ఇరవై యొకటవ ప్రశ్నయందు యాజుష హౌత్ర ప్రవర ఉంది. 24, 25 ప్రశ్నలందు శుల్బంలో విహారయోగాలు వర్ణించారు. 26, 27 ప్రశ్నలలో సామయాచారిక ధర్మాలుపదేశించారు. 28, 29, 30 ప్రశ్నలలో మరణించినవారికి చేయదగిన కర్మవిధానం, మరణించిన ఆహితాగ్నికి స్థాపన దహనవిధానం, శవాగ్నియందు హవనం, అస్థిసంచయనం మొదలైన పలు విషయాలు తెలిపారు.

సత్యాషాఢ కల్పసూత్రంలో చివరి రెండు ప్రశ్నలు భారద్వాజీయాలని మహాదేవుని ప్రయోగ వైజయన్తీ టీకవల్ల తెలుస్తోంది.

మానవశ్రౌత సూత్రంలో దశమభాగంలో శుల్బసూత్రం, పరిశిష్టమయిన ఏకాదశ భాగంలో ప్రతిగ్రహకల్పం, మూలజాత విధి, యమల శాంతి, ఆశ్లేషావిధి, దన్త్యాప్యృతి శాంతి, రుద్రజప విధానం, ప్రవరశ్రాద్ధం ఉపదేశించారు.

కాఠక కల్పసూత్రంలో కాఠకగృహ్య సూత్రం ఉంది. దీనికి దేవపాలుడు భాష్యం వ్రాశాడు.

ఆపస్తంబ గృహ్యసూత్రం 23 ఖండముల గ్రంథం. దీనిలో 405 సూత్రాలున్నాయి. దీనికి హరదత్తుడనాకుల వృత్తిని, సుదర్శనాచార్యుడు తాత్పర్య దర్శనాన్ని, కపర్దిస్వామి భాష్యాన్ని రచించారు. ఇది ఆపస్తంబుని శ్రౌత సూత్రములలో 27వ ప్రశ్నమని కొందరు తలుస్తున్నారు.

దీనిలో నైమిత్తిక కర్మలు, దేవపితృ కర్మలలో వ్యత్యాసం, అగ్నిముఖం, పాకయజ్ఞ విధి విశేషాలు, చరుహోమం, వివాహం, ఆగ్నేయ స్థాలీపాకం, వైశ్వదేవం, ఉపాకర్మోత్సర్జనాలు, సదసస్పతిహోమం, రజస్వలా నియమాలు, గర్భాదాన యోగ్యదినాలు, దంపతుల మనస్సులు కలియుటకు హోమాలు, రోగనివారణార్థం కర్మ, ఉపనయనం, స్నాతకం, సీమంతం, పుంసవనం, బాలెంత జరాయుపతనమునకు క్రియ, జాతకర్మ, నామకరణం, అన్నప్రాశనం, చౌలకర్మ, గోదానవ్రతం, గృహనిర్మాణ ప్రవేశాలు, బాలురకు గ్రహశాంతులు, సర్పబలి, ఆగ్రయణ విధి, హేమంత ప్రత్యవరోహణం, ఈశానబలి, మాసిశ్రాద్ధం, అష్టక, రథాశ్వ గజారోహణాలు, యాచన, ఋణం, వ్యవహారం, విక్రయ భర్తృవశ్యం, దాసీదాస పలాయన నివృత్తి, అద్భుతోత్పాత శాంతులు ఉన్నాయి.

ఆపస్తంబముని సమంత్రకాలయిన గ్రహపూజాంకురారోపణ ప్రతిసరబంధాదులు, అమంత్రకాలయిన నాకబలి, యక్షబలి, ఇంద్రాది పూజాదులు, జానపద గ్రామ కులముల ఆచారాలననుసరించి చేయాలని తెలిపారు.

మైత్రాయణీయ మానవసూత్రం రెండు పురుషాలుగా విభజింపబడింది. ప్రథమ పురుషలో ఇరవై మూడు ఖండాలు, ద్వితీయ పురుషలో పద్దెనిమిది ఖండాలు ఉన్నాయి. బ్రహ్మచారినియమాలతో ప్రారంభమయిన ఈ ఖండం పుత్రేష్టితో సమాప్తి పొందుతోంది. దీనిలో సూత్రాలు ప్రయోగసూచకాలయి కొంచెం పెద్దవిగా ఉన్నాయి. దీనిలో వివాహాది ప్రయోగం ఆపస్తంబ సూత్రప్రయోగాన్ని అనుసరించింది కాని దేశాచారభేదం ఉంది.

ఔఖేయస శాఖకు చెందిన వైఖానస గృహ్యసూత్రం పదకొండు ప్రశ్నల గ్రంథం. ఇది 'అథ నిషేకాది సంస్కారాన్ వ్యాఖ్యాస్యామః' అని ప్రారంభించి గృహ్యకర్మలను వివరించింది.

శుక్ల యజుశ్శాఖీయ గృహ్యసూత్రాల్లో పారస్కర గృహ్యసూత్రం ప్రసిద్ధం. ఈ పారస్కరుడు, వాక్యకార వరరుచి, కాత్యాయనుడు ఒకరే అని సంప్రదాయము వల్ల తెలుస్తోంది. కతమహర్షి గోత్రాపత్యం కాత్యానుడు.

ఇది మూడుకాండల గ్రంథం. దీనికనుబంధాలుగా కాత్యాయన కృతాలుగా పరిశిష్ట కండిక, శౌచసూత్రం, స్నానసూత్రం, శ్రాద్ధసూత్రం, భోజనసూత్రం లభిస్తున్నాయి.

దీనికి కర్కోపాధ్యాయుడు, జయరామాచార్యుడు, హరిహరాచార్యుడు, గదాధర దీక్షితులు భాష్యాలను రచించారు.

అథర్వ శాఖీయ గృహ్యసూత్రానికి కౌశికమని పేరు. ఇది కౌశికీ శ్రౌతసూత్రానికి అనుబంధం. దీనిలో వివాహాది గృహ్యకర్మలేకాక ఆభిచారిక కర్మలు కూడా ప్రతిపాదించారని తెలుస్తోంది.

బోధాయన గృహ్యసూత్రం నాలుగు ప్రశ్నల గ్రంథం. దీనిలో పన్నెండు అధ్యాయాలున్నాయి.

పరిభాషలో

**సౌరాష్ట్రం సింధు సౌవీరా వవన్తీం దక్షిణాపథమ్ ।**
**ఏతాని బ్రాహ్మణో గత్వా పునస్సంస్కార మర్హతి ॥**

అనే శ్లోకం ఉంది.

గృహ్యశేషంలో నవగ్రహ పూజావిధి సందర్భంలో రవ్యాది గ్రహాలను, రుద్రాది దేవతలను కళింగావంతీ భోజ కటకయమునా మగధ సింధు సౌరాష్ట్ర బర్బరాంతర్వేది దేశాల్లో పుట్టినవారుగా చెప్పారు. ఈ గ్రహాలకు దేవతలకు కాశ్యపాది గోత్రాలను పేర్కొన్నారు. వీరిని జైమిన్యాది సూత్రాలు కలవారిగా వర్ణించారు. కాబట్టి ఈ భాగాలర్వాచీనాలని భావిస్తున్నారు.

## బోధాయన గృహ్యసూత్రం

సప్తపాక యజ్ఞ సంస్థల నిరుక్తి, వివాహం, స్థాలీపాకం, గర్భాదాన విధి, నాపితకర్మ, పుంసవనం, సీమంతోన్నయనం, బలిహరణం, జాతకర్మ, నామకరణం, ఉపనిష్క్రమణం, అన్నప్రాశనం, చూడాకర్మ, ఉపనయనం, సమావర్తనం, శూలగవం, వైశ్వదేవ హోమం, పంచ మహాయజ్ఞాలు, ప్రత్యవరోహణం, అష్టకాహోమం, ఉపాకర్మ, హోతృశుక్రియ వతీచర్య, ఉపనిషద్వ్రత చర్య, గోదానం, సమిత వ్రతం, అవాంతరదీక్ష, వాస్తుశమనం, అద్భుత శాంతి, ఆయుష్య చరువు, అష్టమీవ్రతం, ఉపాకర్మోత్సర్గం, యక్షితమీ బలి, మాసికం, ఆభ్యుదయకం, వివిధ ప్రాయశ్చిత్తాలు, అద్భుతోత్పాత శాంతులు ఉన్నాయి.

బౌధాయన గృహ్యపరిభాషలో బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వైదికకర్తల కార్యవిధి, పుణ్యాహం, వైవాహిక శ్రాద్ధం, అగ్న్యాధేయకాలం, సూతకాగ్ని

విధానం, పునస్సంస్కారం, స్నాతకం, అనుగతాది ప్రాయశ్చిత్తాదులు, ఆగ్రయణ స్థాలీపాకం, నివీతాదులు, యజ్ఞోపవీతం, పంచ మహాయజ్ఞాలు, అతిథులు, దేవపిత్ర్య విశేషాలు, పుత్రార్థి హోమం మొదలైనవి ఉన్నాయి.

బోధాయన గృహ్యాశేషసూత్రంలో అగ్నిముఖ న్యాయం, ఔపాసనాగ్ని, ప్రజాసంస్కారార్థాగ్ని, స్థండిల విధి, పరిస్తరణ విధి, దర్భసంఖ్య, అధిదైవతాలు, పుణ్యాహం, నామకరణం, కర్ణవేధ, నక్షత్ర హోమం, ఉదకశాంతి, ప్రతిసరబంధం, గృహాతిథ్య బలికర్మోపహారము, నవగ్రహ పూజావిధి ఉన్నాయి. ఇంకా గృహశాంతి, అశ్వశాంతి, గజశాంతి, యమయజ్ఞం, తృణగర్భం, రాజాభిషేక విధి, శతాభిషేక విధి, పంచమీశ్రాద్ధం, గర్భాదానం, మంగళాలు, ప్రజార్థిహోమం, ఆదిత్యబలి, పుత్ర ప్రతిగ్రహకల్పం, యజ్ఞోపవిధి, రాజన్య వైశ్యాద్యుపనయనాదికం, జడబధిరమూక సంస్కారం, అశ్వత్థ సంస్కారం, పునర్వివాహం, విష్ణుప్రతిష్ఠాకల్పం ఉన్నాయి.

మరియు రుద్రస్నాపన విధి, రుద్రప్రతిష్ఠ, విష్ణుస్నాపన విధి, మహాదేవ పరిచర్యావిధి, రుద్రస్నానార్చన విధి, పునః ప్రతిష్ఠావిధి, పంచగవ్య విధి, పూజావిధి, ప్రణవకల్పం, వ్యాహృతికల్పం, దుర్గాకల్పం, ఉపశ్రుతికల్పం, శ్రీకల్పం, సరస్వతీకల్పం, విష్ణుకల్పం, రవికల్పం, జ్యేష్ఠాకల్పం, వినాయక కల్పం, మృత్యుంజయ కల్పం, అభివృద్ధి కల్పం, శిథిలీకల్పం, యమళకల్పం, ఈశానకల్పం ఉన్నాయి. ఇంకా వృషోత్సర్గం, సహస్ర భోజనవిధి, సహస్ర భోజనసుత్య, జీవశ్రాద్ధం, నారాయణ బలి, ఆత్మశ్రాద్ధం, వాయసబలి, మిత్యాసత్య బలి, ధూర్తబలి, మృతబలి, ధర్మోపభోగ విధి ఉన్నాయి. తర్వాత కామ్యవిధి, శౌచవిధి, ఆచమనవిధి, గృహస్థోపాసనం, అనాహితాగ్ని దర్శపూర్ణమాసలు, ద్విభార్యాకౌపాసనాగ్ని సంసర్గం, ప్రజార్థిహోమం, ఔపాసనాగ్ని విమోకం, ఔపాసన గ్రహణ ధారణోపావరోహణ విధి, విచ్ఛిన్నాగ్నికుని మరణం, అగ్న్యుద్ధారం ఉన్నాయి. అంతేకాక కపిలా

సన్యాసవిధి, సన్యాసి సంస్కారవిధి ఉన్నాయి. మరియు అంకురార్పణ విధి, నాందీముఖం, ఉత్పాతశాంతులు, అగ్నిముఖం, వివాహ్య కన్యారజస్వలా ప్రాయశ్చిత్తం, ఋతుశాంతి, మృత్తికాస్నానవిధి, అర్కోద్వాహ విధి, పంచమీ శ్రాద్ధం, వనస్పతి హోమం, ఉగ్రరథ శాంతి మొదలయినవి ఉన్నాయి.

పితృమేధ సూత్రంలో ఆహితాగ్ని సంస్కారం, అస్థిదాహం, సంచయనం, పునర్దాహం, లోష్టచయనం, శాంతిహోమం, బ్రహ్మమేధం, హవిర్యజ్ఞియాదులు, స్త్రీలకు వర్జ్యమంత్రాలు, విధురాగ్న్యాది సంధానం పరోక్షమృతకల్పం, దుర్మరణ ప్రాయశ్చిత్తం, ఏకోద్దిష్టం, సపిండీకరణం, దహనవిధి, అమన్య సంస్కారం, బాలసంస్కారం, దుర్మృతాదుల సంస్కారం, గర్భిణీసంస్కారం, హోతృసంచయనం, పరివ్రాజక సంస్కారం, మృతపత్నీ నియమాలు, పితృమేధశేషం మొదలైనవి ఉన్నాయి.

## ధర్మసూత్రాలు

ఇవి నాలుగైదు మాత్రమే ప్రసిద్ధిని పొందాయి. వాటిలో ఆపస్తంబ బౌధాయన హిరణ్యకేశీయ ధర్మసూత్రాలు కృష్ణయజుశ్శాఖకు చెందినవి. గౌతమ ధర్మసూత్రం సామశాఖకు చెందినది. వైఖానస ధర్మప్రశ్నమను పేరుతో ఒక సూత్ర గ్రంథముంది. ఇదికూడా కృష్ణయజుశ్శాఖకు చెందినదే. దీని కర్త విఖనసముని.

ధర్మసూత్రములలో ఆపస్తంబ ధర్మసూత్రం ప్రసిద్ధం. ఇది దక్షిణ హిందూదేశమందలి వర్ణాశ్రమాచారాలను తెలుపుతుంది. దీని మొదటిసూత్రం 'అజాత స్సామయాచారికాన్ ధర్మాన్ వ్యాఖ్యాస్యామః' అని. దీన్ని బ్రహ్మయజ్ఞంలో పఠిస్తారు. ఇది రెండు ప్రశ్నల గ్రంథం. ఇవి ఆపస్తంబ కల్పసూత్రంలో 28, 29 ప్రశ్నలని కొందరు భావిస్తారు. ప్రతి ప్రశ్నలో పదకొండేసి పటలాలున్నాయి.

ధర్మసూత్రాలు సామయాచారిక ధర్మాలను బోధిస్తాయి. సమయమంటే వ్యవస్థ. అది విధినియమ ప్రతిషేధరూపంగా మూడు విధాలు. విధికి ప్రయోజనం ప్రవృత్తి. గ్రామాంతరానికి వెళ్ళి వచ్చిన గురువును ఆనాడే చూడాలని విధి. నియమానికి నిషేధానికి నివృత్తియే ప్రయోజనం. ఏ దిక్కుకు తిరిగి భోజనం చేసినా ఆకలి తీరుతుంది. కాని తూర్పుదిక్కుగా తిరిగి భోజనం చేయమని నియమం. గోవును కాలితో తన్నకూడదని నిషేధం. ఇటువంటి ధర్మాలు సామయికాచారిక ధర్మాలు. కర్మజన్యం అభ్యుదయ నిశ్రేయసహేతువు ధర్మం... అట్టి ధర్మానికి హేతువులయిన కర్మలను ధర్మసూత్రాలు తెలుపుతాయి. ఈ సూత్రాలు సంఘధర్మ శాసనములనదగినవి. దీనిలో కౌత్సహారీతాది పూర్వమునుల పేర్లున్నాయి. దీనికి హరదత్తుదుజ్జ్వల వ్యాఖ్యను రచించాడు.

ఆపస్తంబ ధర్మసూత్రంలో వర్ణవిభాగం, వర్ణాల కర్మలు, ఉపనయనం, బ్రహ్మచారి ధర్మాలు, ఉపాకర్మ, అనధ్యాయాలు, బ్రహ్మయజ్ఞవిధి, పంచమహాయజ్ఞాలు, అధ్యయన విధులు, శుద్ధి, అభక్ష్యాలు, యజ్ఞోపవీత, ఆచమన విధి నిషేధాలు, భోజన విధినిషేధాలు, ఆపద్వృత్తి, పతనీయ కర్మలు, ఆత్మజ్ఞానం, యోగానుష్ఠానం, అక్రోధాదులు, ప్రాయశ్చిత్తాలు, స్నాతకం, మలమూత్ర విసర్జనాది విధి, అధ్యాపయితృ నియమాలు, గృహస్థధర్మాలు, అగ్న్యుపధానం, ఋతుకాలాభిగమనం, శిష్య నియమాలు, మనుష్య యజ్ఞం, షడంగవేదాలు, తనకు తనవారికి అన్నసంవిభాగం, జీవిక, వివాహ భేదాలు, పాపాత్ములకు రాజదండనం, దాతవ్యమార్గాలు, ధర్మాచరణ ప్రశంస, సగోత్రాదులకు కన్యాదాన నిషేధం, బ్రాహ్మాది వివాహాలు, దాయవిభాగం, శాస్త్ర విరుద్ధ దేశ, కుల ధర్మాలను గ్రహించకపోవుట, శావాశౌచం, శ్రాద్ధ విషయాలు, నాలుగాశ్రమాలు, రాజధర్మాలు, ధనానికి దంపతులధికారులు, సాక్ష్యంలో యోగ్యులు, స్త్రీ శూద్రుల దగ్గర గల విద్యను గూడా గ్రహించుట, ధర్మలక్షణం మొదలయిన అనేక విషయాలు ఈ ధర్మసూత్రంలో ఉన్నాయి.

ఆపస్తంబ ధర్మసూత్రం వలె హిరణ్యకేశి ధర్మసూత్రం కూడా హిరణ్యకేశి కల్పసూత్రంలో 26, 27 అధ్యాయములలో ఉంది. ఇది ఆంధ్రప్రదేశంలో వ్యాపించలేదు.

## బోధాయన ధర్మసూత్రం

బోధాయన ధర్మసూత్రం నాలుగు ప్రశ్నల గ్రంథం. దీనిలో అవాంతర భాగాలధ్యాయాలు. దీనికి గోవిందస్వామి రచించిన వ్యాఖ్య ప్రసిద్ధం. ఏ సూత్రంవారయినా తమ సూత్రం ఉన్నా పర సూత్రాన్ననుసరించి ఆచరింపవలసి వస్తే బౌధాయన సూత్రాన్నిబట్టి నడచినచో తమ సూత్రాన్ని అనుసరించిన ఫలం వస్తుందని వృద్ధమనువు చెప్పాడు.

బోధాయన ధర్మసూత్రంలో పరిషత్తు, దేశాచారం, ఆర్యావర్తం, బ్రహ్మచర్యకాలం, ఉపనయనం, బ్రహ్మచారి ధర్మాలు, స్నాతక ధర్మాలు, కమండలు చర్య, శౌచవిధి, పురుషార్థ నిరోధంలో హేయోపాదేయాలు, సాపిండ్యం, ఆశౌచవిధి, రజస్వలా వ్రతాలు, అభక్ష్య నిరూపణం, శుద్ధి, దీక్షిత నియమాలు, వర్ణవిభాగం, ప్రతిలోమాలు, అనులోమాలు, రాజధర్మాలు, దండ్యులు, అసత్య వాదన ప్రాయశ్చిత్తం, అష్టవివాహాలు, అనధ్యాయాలు, ప్రాయశ్చిత్తాలు, పాతకాదులు, గృహస్థ ధర్మాలు, దాయవిభాగం, పుత్ర ప్రతిగ్రహ విధులు, ఆపద్వృత్తి, గృహస్థ నియమాలు, స్నాతక వ్రతాలు, సంధ్యోపాసనం, స్నానవిధి, నిత్యతర్పణం, పంచమహాయజ్ఞాలు, నైష్ఠిక బ్రహ్మచారి ధర్మాలు, పరివ్రాజక ధర్మాలు, జ్ఞానం వల్ల ముక్తి, జ్ఞానకర్మ సముచ్చయం, భోజన విధి, శ్రాద్ధవిధులు, ఋణత్రయ విముక్తి, సంన్యాస విధి, వృత్త్యుపాయాలు, వానప్రస్థం, అఘమర్షణ కల్పం, యావక వ్రతం, కూష్మాండహోమాలు, చాంద్రాయణ కల్పం, అనశ్నత్పారాయణ విధి, వివిధ ప్రాయశ్చిత్తాలు, శాస్త్ర సంప్రదాయం, కృచ్ఛ్రవ్రతాలు, గణహోమాలు, మంత్రపురణశ్చరణం మొదలైనవి.

గౌతమ ధర్మసూత్రం మూడు ప్రశ్నల గ్రంథం. ఇది దక్షిణ హిందూదేశంలో ఎక్కువ వ్యాప్తి చెందింది. ఇది సామవేదానికి చెందినది. కాని ఇవి సర్వశాఖలకు సామాన్యంగా వ్యవహరింపబడుతోంది. దీనిలో 26వ అధ్యాయము సామవిధాన బ్రాహ్మణాన్ని అనుసరించడం చేత ఇవి సామవేదానికి సంబంధించినదని స్పష్టం. దీనికి హరదత్తుడు మితాక్షర వ్యాఖ్య రచించాడు. దీనిలోని లౌకిక ధర్మాలు హిందూధర్మశాస్త్రాలలో ఉదాహరింపబడినాయి.

క్రియాకాండమను పేరుతో వీనికి పరిశిష్ట గ్రంథముంది. అది గౌతమకృతం కాదు.

గౌతమ ధర్మసూత్రంలో ధర్మనిరూపణం, ఋషుల మహిమ, ఉపనయనం, కాలం, మౌంజి, దండం, వస్త్రాలు, ఆచమనం, గురూప సదనం, అనుపనీతి ధర్మాలు, పత్నికి ఔపాసన వైశ్వదేవాధికారం, అనుపనీతునికి పితృకర్మాధికారం, బ్రహ్మచారి నియమాలు, భిక్షుధర్మాలు, వానప్రస్థ ధర్మాలు, వివాహం, గృహస్థ ధర్మాలు, అతిథిపూజ, విద్యాగ్రహణ విధి, ఆపద్వృత్తి, బహుశ్రుత లక్షణం, 40 సంస్కారాలు, వర్ణధర్మాలు, ఉత్పాతాది శాంతులు, దేశ, జాతి, కులధర్మాలు, దండప్రకరణం, అశౌచ ప్రకరణం, శ్రాద్ధ ప్రకరణం, ఉపాకర్మ, అధ్యయనం, అనధ్యాయాలు, భక్ష్యా భక్ష్యాలు, స్త్రీ ధర్మాలు, ప్రాయశ్చిత్తాలు, కర్మవిపాకం, కృచ్ఛ్ర చాంద్రాయణాలు, దాయవిభాగం, దశావర పరిషత్ మొదలయిన విషయాలున్నాయి.

దేశకాల వృత్త్యాదులను బట్టి, ప్రజాస్వామ్య రాజ్యాన్నిబట్టి ధర్మసూత్రాలు చెప్పిన వాటిలో కొన్నిటిని వదలిపెట్టవలసి వస్తుంది. కాని ఈ కాలంలో కూడా ఇహపరాలకుపయోగించే అంశాలనేకం వీటిలో ఉన్నాయి కాబట్టి ఆ విజ్ఞానాన్ని వదలుకోవడం శ్రేయస్కరం కాదు.

## ఋగ్వేదీయ శ్రౌతసూత్రాలు

శ్రుతౌ భవః అనే అర్థంలో శ్రౌతపదం శ్రుతి విహిత ధర్మమనే అర్థంలో ఏర్పడింది. యజ్ఞాది ప్రయోగాన్ని తెలిపే విద్యకు శ్రౌతమని ప్రసిద్ధి. ఈ శ్రౌతవిద్యను తెలిపే కల్పసూత్రాలు అనేకం ఉన్నాయి. వాటిలో శ్రౌత సూత్రాలను సంగ్రహంగా సమీక్షిద్దాం.

## ఆశ్వలాయన శ్రౌతసూత్రము

ఋగ్వేదానికి గల శాకల బాష్కల శాఖలకు రెండింటికీ సంబంధించినది ఆశ్వలాయన శ్రౌత సూత్రము.

దీనిని దేవస్వామి, నారాయణ గార్గ్య, త్ర్యమ్బక భట్ట, రుద్రదత్త భట్ట, లక్ష్మీధర, దేవశ్రౌత, షడ్గురు శిష్య, మహాదేవ సిద్ధాంతి ప్రభృతులు పలువురు వ్యాఖ్యానించారని ప్రాచ్యలిఖిత భాండాగారంలో గ్రంథసూచికల వల్ల తెలుస్తోంది. వీటిలో నారాయణ గార్గ్యవృత్తి, సిద్ధాన్తిభాష్యం ముద్రణమును పొందాయి. నారాయణ గార్గ్యుని తండ్రి నరసింహుడు. నారాయణుడు తన వృత్తిలో దేవస్వామి వ్రాసిన సదనాకులమనే ఆశ్వలాయన సూత్రభాష్యం స్మరించాడు.

ఈ శ్రౌతసూత్రంలో పన్నెండు అధ్యాయాలున్నాయి. ప్రథమాధ్యాయంలో పరిభాష, దర్శపూర్ణ మాసేష్టులు, ద్వితీయాధ్యాయంలో అగ్న్యాధేయం, అగ్నిహోత్ర హోమం, ఉపస్థానం, పిండపితృయజ్ఞం, అన్వారమ్భణీయ, ఆగ్రయణం, కామ్యేష్టులు, వైమృదేష్టి, లోకేష్టి, మిత్రవిన్ద, పవిత్రేష్టి, కారీరేష్టి, వైశ్వానరేష్టి, ఇష్టచయనము, సాంవత్సరికాలు, తురాయణం, దాక్షాయణ యజ్ఞం, యాజ్యాపురోను వాక్యాలక్షణం, చాతుర్మాస్యాలు, తృతీయాధ్యాయంలో పశువు, పశుయాజ్యా పురోనువాక్యాలు, నిరూఢపశువు, సౌత్రామణి ప్రాయశ్చిత్తాలు, చతుర్థ పంచమాధ్యాయాలలో

అగ్నిష్టోమం, షష్ఠాధ్యాయంలో షోడశి, అతిరాత్రమునకు నైమిత్తికం, సోమప్రాయశ్చిత్తాలు, దీక్షిత మరణ ప్రాయశ్చిత్తాదులు, సోమయాగశేషం, అనూబంధ్య, అవబృథం, ఉదయనీయాదులు, సప్తమాధ్యాయంలో సత్రధర్మాలు, న్యూఙ్ఖాదులు, అష్టమాధ్యాయంలో ప్రతిగరాదులు, పృష్ఠ్యాదులు, నవమాధ్యాయంలో రాజసూయం, ఏకాహాలు, వాజపేయాలు, దశమాధ్యాయంలో అహీనాలు, ద్వాదశాహం, అహీన సత్రములందు సమాన ధర్మాలు అశ్వమేధం, ఏకాదశాధ్యాయంలో రాత్రి సత్రాలు, గవామయనం, ద్వాదశాధ్యాయంలో ఆదిత్యానామయనం, అంగిరసామయనం, కుండపాయినామయనం, తాపశ్చితామయనం, ప్రజాపతి ద్వాదశవత్సరం, సారస్వత సత్రాలు, మిత్రావరుణాయనం, సత్రోత్థానం, సవనీయ పశువులు, సత్రిధర్మాలు, వ్రత్యాలు, సవనీయ పశువిభాగం, ఋత్విజుల ప్రవరలు, సత్రాలు, పృష్ఠ్య శమనీయం ఉన్నాయి.

## శాంఖాయన శ్రౌతసూత్రము

శాంఖాయనీశాఖ ఉత్తర గుజరాతులో వ్యాపించి ఉంది. పరిశిష్టాదులతో కూడింది ఆనర్తీయ భాష్యంతో కూడింది శాంఖాయన శ్రౌతసూత్రం కలకత్తాలో ముద్రితం అయ్యింది. ఈ భాష్యంలో అక్కడక్కడ వినష్టమయిన దాన్ని దాసశర్మ పూరించి పరిష్కరించారని తెలుస్తోంది.

దీని భాష్యకారుల్లో బ్రహ్మదత్త, నారాయణ, శ్రీపతిసుత విష్ణు గోవిందాదులు పరిగణింపదగినవారు. దీనిలో పద్దెనిమిది అధ్యాయాలున్నాయి. వీటిలో క్రమంగా పరిభాష, దర్శపూర్ణమాసలు, అగ్న్యాధేయాదులు, వైమృధేష్ట్యాదులు, అగ్నిష్టోమం, చయనం, ద్వాదశాహం, చతుర్వింశాద్య హీనహౌత్రం, పాశుకం, సౌమిక ప్రాయశ్చిత్తం, గవామయనాదులు, ఏకాహాలు, పాశుక చాతుర్మాస్యలు, సౌత్రామణి, వాజపేయం, రాజసూయం, అశ్వమేధం, మహావ్రతం, గవామయనాదులు ఉన్నాయి. ఈ శ్రౌతసూత్రం కౌషీతకి బ్రాహ్మణాన్ని అనుసరిస్తోంది.

## కౌషీతకి శ్రౌతసూత్రం

ఇది కౌషీతకి శాఖవారి సూత్రం. ఇది ముద్రణను పొందిన జాడలేదు. వ్రాతప్రతిగా ఉందని ప్రాచ్యలిఖిత భాండాగార పుస్తకసూచుల వల్ల తెలుస్తోంది.

## యజుర్వేదీయ శ్రౌతసూత్రాలు

కాత్యాయన శ్రౌతసూత్రం – శుక్ల యజుర్వేదానికి ఈ శ్రౌతసూత్రం ఒకటి లభిస్తోంది. దీన్ని చాలామంది వ్యాఖ్యానించారు. అనంతదేవుడు తన గ్రంథ ప్రారంభంలో

**శ్లో॥ మునిం కాత్యాయనం కర్కం పితృభూతిం తథాదిమాన్**
**యశోగోపి భర్తృయజ్ఞం తథా భాష్యకృతోపరాన్**
**పద్ధత్యాది ప్రణేతౄంశ్చ జనకం వేదదాన్ గురూన్ ॥**

అని ప్రాచీన భాష్యప్రణీతల పేర్లు పేర్కొన్నాడు. ఇపుడు మూడు భాష్యాలు ముద్రితమై లభిస్తున్నాయి. ఉపాధ్యాయ కర్కుడు రచించిన కర్కభాష్యం, యాజ్ఞిక దేవభాష్యం, మహామహోపాధ్యాయ విద్యాధరశర్మ సరలా వృత్తి. వీటిలో కర్కభాష్యం శ్రేష్ఠమని విద్వాంసుల అభిప్రాయం.

గంగాధర, గదాధర, భర్తృయజ్ఞగర్భ, పద్మనాభ, భాస్కరమిశ్ర, దేవభూతి, మణిరామ, మహాదేవ, హరిహర వాసుదేవ, శ్రీధర, జయరామాది భాష్యకారుల పేర్లు మాత్రం లభిస్తున్నాయి.

ఈ శ్రౌతసూత్రం ప్రధానంగా రెండు శుక్ల యజుర్వేద శాఖలకు సంబంధించినది. ఆ రెండు శాఖలలో ఉన్న కర్మల క్రమాన్ని అనుసరించి ఈ సూత్రం రచించబడింది.

దీనిలో ప్రథమాధ్యాయంలో పరిభాష, ద్వితీయ తృతీయాధ్యాయాలలో అంగాలతో దర్శపూర్ణమాసలు, చతుర్థాధ్యాయంలో పిండపితృయజ్ఞం,

ధర్మశేషాలు, వత్సపాకరణాదులు, వికృతి యాగాలందు దర్శపూర్ణ మాసధర్మాల అతిదేశం, దాక్షాయణ యజ్ఞం, ఆగ్రయణేష్టి, అన్వారమ్భణీయ, అగ్న్యాధానం, పునరాధేయం, అగ్నిహోత్రం ఉన్నాయి.

పంచమాధ్యాయంలో చాతుర్మాస్యలు, మిత్రవిన్దేష్టి, షష్ఠాధ్యాయంలో ప్రతి సంవత్సరం అనుష్ఠేయమయిన నిరూఢ పశువు, సప్తమం మొదలుకొని ఏకాదశాధ్యాయం వరకు సోమయాగం, పన్నెండవ అధ్యాయంలో ద్వాదశాహం ఉంది. దీనిలో పన్నెండు సుత్యలుంటాయి. దీనిని సత్రయాగమంటారు. త్రయోదశాధ్యాయంలో గవామయనం, చతుర్దశాధ్యాయంలో వాజపేయం, పంచదశాధ్యాయంలో రాజసూయం, షోడశ, సప్తదశ, అష్టాదశాధ్యాయాలలో మహాగ్నిచయనం, ఏకోనవింశాధ్యాయంలో సౌత్రామణి, వింశాధ్యాయంలో అశ్వమేధం, ఏకవింశాధ్యాయంలో పురుషమేధ, సర్వమేధ, పితృమేధాలు, ద్వావింశాధ్యాయంలో ఏకాహాలు, త్రయోవింశాధ్యాయంలో త్రిరాత్రం మొదలు ఏకాదశరాత్రం వరకు గల అహీనాలు, చతుర్వింశాధ్యాయంలో ఇతర సత్రాలున్నాయి. షడ్వింశాధ్యాయంలో ప్రవర్గ్య ఉంది.

## కృష్ణయజుర్వేదీయ శ్రౌతసూత్రాలు

కృష్ణయజుర్వేదానికి తొమ్మిది శ్రౌతసూత్రాలు లభిస్తున్నాయి.

### 1. బౌధాయన శ్రౌతసూత్రం

కృష్ణయజుర్వేద తైత్తిరీయశాఖకు గల బౌధాయన శ్రౌత సూత్రాలారింటిలో బౌధాయన సూత్రం ప్రాచీనం, ప్రధానం అని ప్రాచీనాచార్యుల అభిప్రాయం. దీనిలో ముప్పై ప్రశ్నలున్నాయి. ప్రతి ప్రశ్నలో అధ్యాయాలున్నాయి. వీటిలో యాగవిధి అంతా విస్తరంగా తెల్పబడింది. సూత్రాలలో మంత్రాలు పూర్తిగా ఉదాహరింపబడినాయి. దీనిలో ప్రథమ ప్రశ్నలో దర్శపూర్ణమాసలు, రెండవదానిలో ఉపవ్యాహరణం, దేవయాచనం,

ఋత్విక్కుల వరణం, వినిధులు, అగ్న్యాధేయ కర్మాన్తం, ఉపవసధగవి, అగ్న్యాధేయం, అన్వారమ్భణీయేష్టి ఉన్నాయి.

తృతీయ ప్రశ్నకు దశాధ్యాయికా అని పేరు. దీనిలో పునరాధేయం, అగ్నిహోత్రం, అగ్న్యుపస్థానం, పిండ పితృయాగం, ఆగ్రయణం, అగ్నుల నుండి ప్రవాసం, యాజమానం, బ్రహ్మత్వం, హౌత్రం ఉన్నాయి.

చతుర్థాది ప్రశ్నలలో పశుబంధం, చాతుర్మాస్యలు, వైశ్వదేవ హవిస్సులు, వరుణ ప్రఘాస హవిస్సులు, సాకమేధ హవిస్సులు, మహాపితృ యజ్ఞాలు, త్ర్యంబక హోమం, శునాసీర హవిస్సులు, అగ్నిష్టోమం, ప్రాతర్మాధ్యందిన సాయంసవనాలు, ప్రవర్గ్య ప్రాయశ్చిత్తాలు, అవాన్తర దీక్ష, అగ్నిచయనం, వాజపేయం, రాజసూయం, ఇష్టికల్పం, ఔపానువాక్యం, అజావశాయాగం, జయాదిహోమం, రాష్ట్రభృద్ధోమం, సర్వవేదస యాగాదులు, అశ్వమేధం, ద్వాదశాహం, అతిరాత్రం, బృహస్పతి సవాదులు, సావిత్ర నాచికేతాదులు, ద్వైధం, కర్మాన్తం, ప్రాయశ్చిత్తాలు ఉన్నాయి.

ద్వైధంలో శాలీకి, ఔపమన్యువు, ఔపమన్యవీ పుత్రరాధీతరుడు మొదలయిన వారి అభిప్రాయాలను రాశారు.

కర్మాన్తంలో దర్శపూర్ణమాసాది కర్మలలో రహస్యాలు, వాటి వైశిష్ట్యం, పరిభాష వేరేచోట చెప్పనివి, చెప్పవలసినవి అయిన విషయాలున్నాయి.

దీనికి భవస్వామి, కేశవస్వామి, గోపాలుడు, నారాయణుడు, దామోదరుడు, దేవస్వామి, శేషనారాయణుడు వివరణలు వ్రాసినట్లు ఇతర గ్రంథాల్లో వీరి పేర్లు పేర్కొనడం వల్ల తెలుస్తోంది.

వీరిలో శేషనారాయణుడు వేదభాష్యకారుడయిన సాయణాచార్యుని మనుమడు. వీరి భాష్యం వివరంగా ఉంది. మహాదేవ వాజపేయి సుబోధినీ వ్యాఖ్య వ్రాశాడు. శేషనారాయణుడు బౌధాయన శ్రౌత సర్వస్వం, బౌధాయనాగ్నిష్టోమం మొదలయిన గ్రంథాలు వ్రాశాడు.

## భారద్వాజ శ్రౌతసూత్రం

ఇది కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ శాఖకు సంబంధించినది. ఈ శ్రౌతసూత్రం పైతృమేధిక పరిశేష సూచులతో కాశీలో వైదిక సంశోధక మండలి ప్రకటించింది. భాస్కరభట్టు కుమారుదు హరిహరుదు అన్త్యేష్టి పద్ధతికి మొదట భారద్వాజ శ్రౌతసూత్ర భాష్యం పేర్కొన్నాడు. ప్రాచ్యలిఖిత భాండాగారాల్లో గ్రంథసూచుల యందు భట్టగోపాలాదుల భాష్యాలు సూచింపబడినాయి.

దీనిలో పదిహేను ప్రశ్నలున్నాయి. వాటియందు దర్శపూర్ణ మాసలు, అగ్న్యాధేయం, అగ్నిహోత్రం, ఆగ్రయణం, నిరూఢ పశుబంధం, వైశ్వదేవపర్వ, సాకమేధపర్వ, శునాసీరీయపర్వ, కామ్యాలు, పంచ సాంవత్సరికాలు, పూర్వ ప్రాయశ్చిత్తం, జ్యోతిష్టోమం, జ్యోతిష్టోమ బ్రహ్మత్వం ఉన్నాయి.

## ఆపస్తంబ శ్రౌతసూత్రం

ఇదికూడా తైత్తిరీయ శాఖకు సంబంధించినది. ఆపస్తంబ శ్రౌత సూత్రానికి భారద్వాజ శ్రౌతసూత్రానికి అనేక సూత్రాలు సమానంగా ఉన్నాయి.

ఆపస్తంబ శ్రౌతసూత్రానికి చాలా భాష్యాలు ఉన్నాయి. శ్రీరామాగ్ని చిద్వృత్తి, ధూర్తస్వామి భాష్యం, రుద్రదత్త ప్రణీత సూత్రదీపికావృత్తి లభిస్తున్నాయి. సూత్ర దీపికావృత్తి పదిహేను ప్రశ్నల వరకు లభిస్తోంది. ధూర్తస్వామి ఆపస్తంబీయ శ్రౌతసూత్రానికి అగ్నిచయన పర్యంతం వ్యాఖ్యానించాడు. కపర్దిస్వామి వాజపేయానికి భాష్యం వ్రాశాడని ప్రయోగదీపిక వల్ల తెలుస్తోంది.

ప్రాచ్యలిఖిత భాండాగారాల్లో గుహదేవస్వామి, తాలవృంత నివాసి హరదత్తుడు, సోమనాథ దీక్షితుడు, గార్గ్య గోపాలయజ్వ, కరవిందస్వామి,

కృష్ణభట్టు, సుందరరాజు, సోమనాథుడు, అహోబలుడు, అనంతదేవుడు మొదలయిన వారి భాష్యాలు ఉన్నాయి.

ఈ సూత్రగ్రంథంలో ఇరవై నాలుగు ప్రశ్నలున్నాయి. వాటిలో వరసగా దర్శపూర్ణమాసాలు, వైమృధేష్టి, దాక్షాయణ యజ్ఞం, యాజమానం, అగ్న్యాధేయం, అగ్నిహోత్రం, నిరూఢ పశుబంధం, చాతుర్మాస్యలు, ప్రాయశ్చిత్తం, సోమయాగం, సోమసంస్థలు, ప్రవర్గ్యం, చయనం, వాజపేయ రాజసూయాలు, సౌత్రామణి, అశ్వమేధం, ద్వాదశాహం, ఏకాహం, సత్రం, యజ్ఞపరిభాష ఉన్నాయి.

## సత్యాషాఢ శ్రౌతసూత్రం

సత్యాషాఢునికి హిరణ్యకేశి అనే పేరు కూడా ఉంది. ఇతని శ్రౌత సూత్రం తైత్తిరీయ శాఖకు చెందినది. మహాదేవభట్టు, గోపీనాథ భట్టు, మహాదేవశాస్త్రి, మాతృదత్తాచార్యుడు, వాంఛేశ్వరుడు, మహాదేవ దీక్షితుడు మొదలైనవారు దీనికి వ్యాఖ్యానం వ్రాశారు. ఇది వ్యాఖ్యాన సహితంగా ఆనందాశ్రమ ముద్రణాలయం వారు ముద్రించారు.

ఈ శ్రౌతసూత్రంలో పందొమ్మిది ప్రశ్నలున్నాయి. మొదటి రెండు ప్రశ్నలలో పరిభాష, దర్శపూర్ణమాసలు, అనునిర్వాప్యేంద్ర వైమృధం, కామ్యదర్శ పూర్ణమాస ప్రయోగ వికాసం, పిండపితృయజ్ఞం, బ్రహ్మత్వం వివరించారు. మూడవ ప్రశ్నలో అధికారం, అన్ని కర్మలయందు ప్రతినిధి నిరూపణం, ఆధానం, దానికి అంగాలయిన ఇష్టులు, పునరాధేయం, అగ్నిహోత్రం, దర్విహోమ ధర్మాలు, అతిదేశ ప్రకారం, వికృతులలో విశేష విధులు, సోమాగ్రయణేష్టి పశుబంధాల అనుష్ఠానంలో అమావాస్య పౌర్ణమాసి కాలాలు, ఆగ్రయణేష్టి వివరించారు.

చతుర్థ పంచమ ప్రశ్నలలో నిరూఢ పశుబంధం, చాతుర్మాస్యలు ప్రతిపాదించారు. షష్ఠ ప్రశ్నలో యాజమాన హోమోపస్థానం,

ప్రవాసోపస్థానం, చాతుర్మాస్యలలో అవాంతర కాలికాలయిన వ్రతాలు చెప్పారు. సప్తమాష్టమ నవమ ప్రశ్నలలో జ్యోతిష్టోమం, దానికి వికృతి ఉక్థ్యం, షోడశి, అతిరాత్రం, ఆప్తోర్యామం, పశ్వేకాదశిని, ఆ పశువులలో తన్త్రావృత్తిచే అనుష్ఠింపదగిన ధర్మవిశేషాలు నిరూపించారు.

దశమ ప్రశ్నలో అగ్నిష్టోమం, యజమాన హెూత్ర వినియోగం జ్యోతిష్టోమ బ్రహ్మత్వం చెప్పారు. ఏకాదశ ద్వాదశ త్రయోదశ ప్రశ్నలలో అగ్నిచయనం, వాజపేయ రాజసూయాలు, చరక సౌత్రామణులు వివరించారు.

చతుర్దశ పంచదశ షోడశ ప్రశ్నలలో అశ్వమేధ, పురుషమేధ, సర్వమేధాలు, విధ్యపరాధాలు, ప్రాయశ్చిత్తాలు, ద్వాదశాహం, అహీన సత్రరూపం, మహావ్రతం, గవామయనం తెలిపారు. పదిహేడు పద్దెనిమిది ప్రశ్నల యందు ఏకాహాహీనాలు, సత్రాలు, సహస్ర సంవత్సరాంతాలు ఉపదేశించారు.

పందొమ్మిది, ఇరవై ప్రశ్నలలో ఉపనయనం, వివాహం, గర్భాదానం మొదలైన స్మార్తకర్తలు చెప్పారు.

ఇరవై యొకటి, ఇరవై రెండు, ఇరవై మూడు ప్రశ్నలయందు కామ్యేష్టి, పశుబంధాలు, కౌకిలీ సౌత్రామణీ సవాలు, కాఠక చయనాలు వర్ణించారు. ఇరవై నాలుగు, ఇరవై అయిదు ప్రశ్నలయందు ప్రవర్గ్యము వర్ణించారు.

## వైఖానస శ్రౌతసూత్రం

ఇది తైత్తిరీయ శాఖకు చెందిన సూత్రం. దీని వ్యాఖ్యాత శ్రీనివాస దీక్షితులు. ఈ సూత్రాలు రచించిన వారు విఖనసాచార్యులు.

ఈ శ్రౌతసూత్రంలో 21 ప్రశ్నలున్నాయి. వీటిలో అగ్న్యాధేయం, పునరాధేయం, అగ్నిహెూత్రం, అగ్నుల నుండి ప్రవాసం, దర్శపూర్ణ మాసలు,

ఆగ్రయణం, చాతుర్మాస్యలు, నిరూఢ పశుబంధం, సౌత్రామణి, పరిభాష, యజ్ఞాయుధాలు, అగ్నిష్టోమం, ఉక్థ్యం, షోడశి, సంధ్య, వాజపేయం, అగ్నిచయనం, ప్రాయశ్చిత్తం అనే విషయాలున్నాయి. దీనిలో విషయాలు విస్పష్టంగా ప్రతిపాదించారు. దీనిలో హౌత్రం, బ్రహ్మత్వం, యాజమానాది విషయాలు కలిపి వివరించారు.

## వాధూల శ్రౌతసూత్రం

ఇది తైత్తిరీయ శాఖకు సంబంధించినది. ఈ సూత్రంలో క్రమంగా ఉన్న విషయాలివి. అగ్న్యాధేయం, పునరాధేయం, అగ్న్యుపస్థానం, ప్రవసదుపస్థానం, పురోడాశం, యాజమానం, ఆగ్రయణం, బ్రహ్మత్వం, చాతుర్మాస్యాలు, పశుబంధం, జ్యోతిష్టోమం, అగ్నిచయనం, వాజపేయ రాజసూయాలు అశ్వమేధం, ద్వాదశాహం, ఔపానువాక్యం, అహీనాలు, ఏకాహాలు.

## మానవశ్రౌతసూత్రం

కృష్ణయజుర్వేదం మైత్రాయణీ శాఖకు సంబంధించినదీ సూత్రం. దీనికి అగ్నిస్వామి, కుమార, బాలకృష్ణ మిశ్ర, శంకరుడు, శివదాసు మొదలైనవారి భాష్యాలున్నాయి. దీనిలో పదకొండు భాగాలున్నాయి.

ప్రథమభాగంలో సోమభాగానికి పూర్వం దర్శపూర్ణమాసలు, హెూమాలు, యాజమానం, అగ్న్యాధేయం, అగ్నిహెూత్రం, ఆగ్రయణం, పునరాధేయం, చాతుర్మాస్యలు, వైశ్వదేవం, వరుణ ప్రఘాసలు, సాకమేధాలు, సునాశీర్యం, సాంవత్సరికాలు, పశువు ప్రతిపాదించారు.

ద్వితీయభాగంలో సవన త్రయాత్మకమైన అగ్నిష్టోమం, తృతీయభాగంలో ప్రాయశ్చిత్తాలు, చతుర్థభాగంలో ప్రవర్గ్య, పంచమభాగంలో ఇష్టికల్పం, షష్ఠంలో చయనం, సప్తమంలో వాజపేయం, ద్వాదశాహం,

గవామయనం, అష్టమంలో ఆనుగ్రాహికం, నవమంలో రాజసూయం, ఏకాహాలు, అహీనాలు, సత్రాలు, గోనామికం తెలిపారు.

## వారాహ శ్రౌతసూత్రం

ఇది మైత్రాయణీ శాఖకు చెందింది. ఈ సూత్రంలో మూడు భాగాలున్నాయి. ప్రథమంలో ప్రాక్ సౌమికంలో పరిభాషలు, యాజమానం, బ్రహ్మత్వం, దర్శపూర్ణమాసలు, ఆధానం, పునరాధేయం, అగ్నిహోత్రం, అగ్న్యుపస్థానం, ఆగ్రయణేష్టి, పశుబంధం, చాతుర్మాస్యలు తెలిపారు. ద్వితీయభాగంలో అగ్నిచయనం ఉంది. తృతీయభాగంలో వాజపేయం, ద్వాదశాహం, గవామయనం, ఉత్సర్గిణామయనం, మహావ్రతం, ఏకాదశిని, సౌత్రామణి, రాజసూయం, అశ్వమేధం వర్ణించారు.

## కాఠక శ్రౌతసూత్రం

ప్రాచ్యలిఖిత భాండాగారాల్లో పుస్తక సూచులయందు కాఠక శ్రౌత సూత్ర ప్రస్తావన ఉంది. ఇది సమగ్రంగా ప్రకటింపబడలేదు. కాత్యాయనీ శ్రౌతసూత్రానికి గల కర్కాది భాష్యాలలో దీనినుండి ఉద్ధరించిన వాక్యాలున్నాయి. దేవపాలుడు కాఠక శ్రౌతసూత్రంలో ముప్పై తొమ్మిది అధ్యాయాలున్నాయని తెలిపాడు.

## సామవేదీయ శ్రౌతసూత్రాలు

## మశక శ్రౌతసూత్రము

ఇది మశకాచార్యునిచే విరచితం – దీనికి ఆర్షేయకల్పమని పేరు. ఈ ఆచార్యుని పేరు లాట్యాయన శ్రౌతసూత్రంలో వంశ బ్రాహ్మణాను పదాదులందు పేర్కొన్నారు. ఆర్షేయకల్పానికి వరదరాజ శ్రీనివాసాచార్యాదుల భాష్యాలున్నాయి. పంచవింశ బ్రాహ్మణాన్ననుసరించి పై శ్రౌతసూత్రంలో సోమయాగానికి చెందిన కర్మల విధానాలు సామముల వినియోగం వివరించారు.

దీనిలో పదకొండు ప్రపాఠకాలున్నాయి. వాటిలో ఏకాహాలు, అహీనాలు, సత్రాలు వివరించారు.

## లాట్యాయన శ్రౌతసూత్రం

ఈ శ్రౌతసూత్రం సామవేద కౌథుమశాఖకు చెందినది. దీనికి అగ్నిస్వామి, రామకృష్ణ దీక్షితులు, సాయణాచార్యులు మొదలయినవారు రచించిన భాష్యాలున్నాయి. ప్రథమ ప్రపాఠకంలో పరిభాష తరువాత ఋత్విక్ యాజ్య లక్షణాదుల తరువాత వృతప్రతి మన్త్రణాదులు, పూతభృత్తు, ఆహవనీయాధికరణం ఉన్నాయి. ద్వితీయ ప్రపాఠకంలో స్తోమ యాగాదులు సార్వక్రతు సామాన్య విధానాలు ఉన్నాయి. తృతీయభాగంలో షోడశినులు, గుణ విధానాదులు, వాణాయవ ద్రవ్య విధానాలు ఉన్నాయి. చతుర్థ ప్రపాఠకంలో వాణాయవాచ్ఛాదన ద్రవ్య విధానాదులు, వాజినభక్షణం ఉన్నాయి. పంచమ ప్రపాఠకంలో చాతుర్మాస్యాధికారంలో వరుణ ప్రఘాసకు చెందిన బ్రహ్మత్వ కథనాదులు, సోమ చమస భక్షణం ఉన్నాయి. షష్ఠ ప్రపాఠకంలో సామవిధానాదులు, ద్వ్యక్షర ప్రతిహారం ఉన్నాయి. సప్తమ ప్రపాఠకంలో చతురక్షర ప్రతీహారాదులు, గాయత్రీ గానాంతం ఉన్నాయి. అష్టమ ప్రపాఠకంలో ఏకాహం అహీనసత్రం మూడుకాండలతో కూడిన యజ్ఞానికి ప్రతి కాండలో వేరు విధానాదులు వాజపేయ విధానం ఉన్నాయి. నవమ ప్రపాఠకంలో రాజసూయ విధానాదులు, అహీన విధి విధానాంతం ఉన్నాయి. దశమ ప్రపాఠకంలో సత్రాధికారంలో దాని పరిభాషా విధానాదులు, సంవత్సర విధానాంతం ప్రస్తావం వివరించారు.

## ద్రాహ్యాయణ శ్రౌతసూత్రం

ఈ శ్రౌతసూత్రం – రాణాయణీయ సామవేదశాఖకు చెందినది. దీనికి ధన్వి భాష్యముంది. దీనికి రుద్ర స్కందస్వామి భాష్యం కూడా ఉంది. దీనికి లాట్యాయన శ్రౌతసూత్రంతో బాగా పోలికలున్నాయి. దీనిని వసిష్ఠసూత్రమని అంటారు.

## జైమినీయ శ్రౌతసూత్రం

ఇది జైమినీయ శాఖకు సంబంధించినది. దీనికి భవత్రాత వ్రాసిన వృత్తి ఉంది. దీనిలో అగ్నిష్టోమ ప్రకరణంలో ఉద్గాతృ ప్రవృత్తి క్రమం, ఉద్గాతృ సత్కారవిధి, సుబ్రహ్మణ్యాహ్వాన విధి, అగ్నిచయన పక్షవిధి, ప్రవర్గ్యోద్వాసనం, ఔదుంబర్యుత్థాపన విధి, పితాపుత్రీయ విధి, విశ్వరూప గాన కలావిధి, ద్రోణకలశవిధి, ఉపవేశన విధి, వహ్నిపవన విధి, సత్రోద్గాతృమార్జన విధి, ధిష్ణ్యోపస్థాన విధి, సోమభక్షణ విధి, ప్రాతస్సవన విధి, దక్షిణాదాన విధి, పృష్ఠవిధి, తృతీయ పతన సవన క్రియాక్రమం, నారాశంస భక్షణవిధి, అనుయాజ విధి, పత్నీసంయాజ విధి, అగ్న్యాధేయ సామవిధి, ప్రవర్గ్య సామవిధి, పరిగాణ విధి, ప్రకీర్ణకం ఉన్నాయి.

తరువాత స్తోమకల్పవృత్తి, ప్రాకృత వృత్తి, సంజ్ఞ, వికృతికల్పం వివరించారు. పర్యధ్యాయంలో మహదహః క్లుప్తి, స్తోత్ర గీతిభేదం, ప్రస్తావ పరిణామాదులు, ప్రతీహార విధి, సామలక్షణం, ఊహలక్షణం, నిధన విధి, కల్పసమయం, సామన్తవాదం, జాములు సంవాదవిధి, ఆరమ్భణీయాహస్సు, పృష్ఠం, మహావ్రత విధి, మహేంద్ర గ్రహగ్రహము, హింకార విధానం, సమిదాధానం, స్తోమకల్పం, విష్టుతులు, పర్యాయాలు, విధృతి విధాలు, నిర్మథ్య, సప్తదశ స్తోమం, ఏకవింశ స్తోమం, చతుష్టోమ రూపాలు, విష్టుతి భేదాలు, స్తోమభేదాలు, గీతులలో ఓంకార ప్రాథమ్యం, ఋష్యాది వివేకం ఉన్నాయి.

## అథర్వవేదీయ శ్రౌతసూత్రాలు

### వైతాన శ్రౌతసూత్రం

అథర్వవేదానికి చెందిన అయిదు కల్పసూత్రాలలో వితాన కల్పసూత్రంలో శ్రౌతసూత్ర విషయాలు వివరించారు. దీనికి సోమాదిత్యుని ఆక్షేపవిధి భాష్యం ఉంది. దీనిలో ఎనిమిది అధ్యాయాలున్నాయి. వాటిలో

దర్శపూర్ణ మాసలు, అగ్న్యాధేయం, అగ్నిహోత్రం, ఆరంభణీయేష్టి, చాతుర్మాస్యలు, పశుబంధం, అగ్నిష్టోమం, అత్యగ్నిష్టోమం, ఉక్థ్యము, షోడశి, అతిరాత్ర, ఆప్తోర్యామాలు, అగ్నిచయనం, సౌత్రామణి, గవామయనం, గవామయన పరిభాష, రాజసూయం, అశ్వమేధం, పురుషమేధం, సర్వమేధం, ఏకాహ స్తోత్ర వికారాలు, కామయజ్ఞాలు ఉన్నాయి.

శ్రౌతసూత్రాల్లో తెల్పినది, భాష్య వృత్యాదులలో వ్యాఖ్యానింపబడినది అయిన యజ్ఞవిద్య, ప్రయోగపద్ధతి, కారికలు మొదలయిన రూపాల్లో పండితులచే విస్తరింపబడింది.

* * *

# ఋగ్వేదభాష్యాలు - భాష్యకారులు

## శ్రీ విద్యారణ్య సాయణాచార్య సోదరులు

శ్రీశైలం దగ్గర గల బడగనాడు మండలంలో మంగకాపురమొక అగ్రహారం. ఆ ఊరిలో శ్రీమతీమాయణ దంపతులుండేవారు. మాయణుడు నిరంతరం శిష్యులకు వేదశాస్త్రాలు అధ్యాపనం చేసేవాడు.

వారికి మాధవుడు, సాయణుడు, భోగనాథుడు అని ముగ్గురు సంతానం. వారిలో మాధవ సాయణులు నాల్గు వేదాలను, తర్క వ్యాకరణ మీమాంసా జ్యోతిషాది శాస్త్రాలను అధ్యయనం చేశారు.

ఉత్తర మీమాంసాధ్యయనం కోసం వారు కాంచీనగరానికి వెళ్ళి విద్యాతీర్థ బిరుదాంకితులయిన శంకరానంద యతీంద్రుల దగ్గర వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చేసి ఇల్లు చేరారు.

మాధవుడు వేదధర్మ రక్షణకు జీవితాన్ని అంకితం చేయదలిచాడు. భువనేశ్వరీ దేవి నారాధించ గోరి పంపాక్షేత్రానికి చేరాడు. భువనేశ్వరీదేవి సన్నిధిలో తీవ్ర తపస్సు చేశాడు. ఆమె అనుగ్రహాన్ని పొందాడు. శృంగేరీ క్షేత్రంలో శారదా పీఠాధిపతి శ్రీకృష్ణ భారతీస్వామి వారివద్ద సన్యాసం తీసుకుని విద్యారణ్య దీక్షానామం పొందారు.

ఆ కాలంలో ముస్లిములు శ్రీ విరూపాక్ష దేవాలయంపై దండెత్తారు. ముస్లిం వేషంలో ఇద్దరు భారతీయ యోధులు వారినడ్డుకున్నారు. ముస్లిం సైన్యం పారిపోయిన తరువాత ఆ యోధులు విద్యారణ్యస్వామికి ప్రణామం చేశారు.

ఆ యోధులు బుక్కరాయలు, హరిహరరాయలు. పూర్వం వారిని ఢిల్లీసుల్తాను బంధించి కారాగారములో పెట్టినాడు. బుక్కరాయలను మహమ్మదీయ మతములో చేర్చుకొని రాజప్రతినిధిగా ఆనెగొందికి

పంపించినారు. వారిని బల్లాళరాజు సోమదేవరాజు ముట్టడింపగా అరణ్యములలో బడి తలదాచుకొన్నారు. ఆ సమయంలో మల్లిక్ సాయబు విరూపాక్ష దేవాలయమును నాశనం చేస్తూంటే వీరడ్డుకుని కాపాడారు.

ఈ వృత్తాంతాన్ని విని విద్యారణ్యస్వామి పంపాక్షేత్రంలో మీరాంధ్ర సామ్రాజ్యం స్థాపించండి. మా సోదరులు నేను వైదిక ధర్మస్థాపనకు కృషి చేస్తాము. రాజ్యస్థాపనకు మీకు కావలసిన ధనాన్ని ఇస్తాను. సైన్యాన్ని సమకూర్చుకుని తుంగభద్రాతీరంలో కోట కట్టుకోండి అని సలహా ఇచ్చారు.

విద్యారణ్యస్వామి వారికి కావలసిన ధనాన్ని ఇచ్చి ప్రోత్సహించారు. వారు సైన్యమును సమకూర్చుకొని సామ్రాజ్యాన్ని స్థాపించి కోటను నిర్మించారు. శ్రీవిద్యానగరమని ఆ పురమునకు పేరుపెట్టారు. విజయ పరంపరలచే ఆ కోట విజయనగరమయింది. శ్రీవిద్యానగర రాజ్యంలో బుక్కరాయలను విద్యారణ్యస్వామి పట్టాభిషిక్తుని చేశారు.

శృంగేరీ శారదాపీఠాధిపతి శ్రీ విద్యాతీర్థస్వామి సిద్ధి పొందారు. ప్రజల కోరికపై విద్యారణ్యస్వామి శృంగేరీ శారదాపీఠాన్ని అధిష్ఠించారు.

హరిహరుని పెద్ద తమ్ముడు కంపన. ఆయన ఉదయగిరికి పాలకుడు సాయణాచార్యుడాయనకు మంత్రి. కంప భూపతి మరణించిన తరువాత అతని కొడుకు సంగమరాజు పసివాడవడంతో సాయణాచార్యులు రాజగురువై రాజనీతి, సకల విద్యలు నేర్పాడు. రాజ్యపాలన గూడా చేశాడు. కత్తిపట్టి యుద్ధం చేశాడు.

**'జగద్వీరస్య జాగర్తి కృపాణ స్సాయణప్రభోః**
**కిమిత్యేతే వృథాటోపా గర్జన్తి పరిపన్థినః**
**అముంశమిత శాత్రవ స్థిర భుజావ లేపోదయం**
**సమీక్ష్య యుధి సాయణం సమధికో భవేద్విస్మయః ॥**

**సత్యం మహీం శాసతి సాయణార్యే**
**సంప్రాప్త భోగ సుఖిన స్సకలాశ్చ లోకాః'**

అని అలంకార సుధానిధిలో సాయణాచార్యుల పరాక్రమం, పాలనల గురించి చెప్పారు.

సాయణాచార్యులు సంగమరాజుకు రాజ్యమప్పగించిన తరువాత విద్యారణ్యస్వామివారి ఆదేశంతో బుక్కరాయలకు మంత్రి అయ్యాడు. మహారాజు ప్రేరణచే వేదాలకు భాష్యరచనం చేశాడు.

**శ్లో॥ యే పూర్వోత్తరమీమాంసే తే వ్యాఖ్యాయాతి సంగ్రహాత్**
**కృపాలుర్మాధవాచార్యో వేదార్థం వక్తు ముద్యతః ॥**

మాధవాచార్యులవారు పూర్వమీమాంసాసారాన్ని జైమినీ న్యాయమాలా విస్తరంలో వ్రాశారు. ఉత్తరమీమాంసాసారాన్ని వేదాంత పంచదశిగా రచించారు. మాధవాచార్యుల వారు వేదార్థం రాయడానికి ఉద్యుక్తులయ్యారు. కాని భువనేశ్వరీదేవి గురించి తపస్సు, సన్యాస స్వీకారం, మహమ్మదీయుల దాడినుండి దేశాన్ని, ధర్మాన్ని రక్షించడం కోసం సామ్రాజ్య నిర్మాణం, ఇలా అనేక బాధ్యతల నిర్వహణం వల్ల ఆయన ఆ బాధ్యతను సాయణాచార్యులకు అప్పజెప్పించారు. దానికి కృతజ్ఞతతో సాయణాచార్యుల వారు "మాధవీయే వేదార్థప్రకాశే" అని ప్రపాఠకాన్తగద్యలో చేర్చడమే కాకుండా సందర్భం వచ్చినపుడు 'అథ మీమాంసా' అనే శీర్షికతో మాధవాచార్యులవారి జైమినీయ న్యాయమాలా శ్లోకాల నుదాహరించి వివరించారు. మాధవీయమంటే మాధవాచార్యుల వారికి సంబంధించింది. మా తమ్మునిచే వ్రాయించండని బుక్కరాయలకు చెప్పడం, మాధవాచార్యుల వారి జైమినీయ న్యాయమాలా శ్లోకాలు భాష్యంలో చేర్చుకోవడమే మాధవాచార్యుల వారికి వేదభాష్యాలకు సంబంధం – కొందరు పై శ్లోకాన్ని చూచి వేదభాష్యాన్ని మాధవాచార్యుల వారు వ్రాశారని భావించి, వేదభాష్యాలను విద్యారణ్యం అని వ్యవహరిస్తున్నారు.

కాని ప్రపాతకాన్తగద్యలో స్పష్టంగా 'సాయణాచార్యేణ విరచితే' సాయణాచార్య విరచితం అని ఉండడం.

**తత్కటాక్షేణ తద్రూపం దధ ద్బుక్కమహీపతిః**
**అన్వశా న్మాధవాచార్యం వేదార్థస్య ప్రకాశనే**
**స ప్రాహ నృపతిం రాజన్ సాయణార్యో మమానుజః**
**సర్వవేత్త్యేష వేదానాం వ్యాఖ్యాతృత్వే నియుజ్యతామ్**
**ఇత్యుక్తో మాధవార్యేణ వీరబుక్క మహీపతిః**
**అన్వశా త్సాయణాచార్యం వేదార్థస్య ప్రకాశనే**

అని మాధవాచార్యుల వారిని వేదార్థప్రకాశం చేయమని బుక్కమహీపతి ఆదేశించడం, ఆయన మా సోదరుడన్నీ ఎరిగినవాడు, వేదవ్యాఖ్య వ్రాయమని ఆయనను నియోగించమని చెప్పడం, వీరబుక్క మహీమపతి వేదార్థప్రకాశనం చెయ్యమని సాయణాచార్యుల వారిని ఆదేశించడం స్పష్టంగానే వ్రాశారు. వేదభాష్యాలు మాధవాచార్యులు వ్రాశారనే భావం భ్రాంతి మాత్రమే. మాధవాచార్యుల వారు భాష్యరచనను పర్యవేక్షించి అవసరమయిన సలహాలు ఇచ్చి ఉండవచ్చు.

సాయణాచార్యుల వారు వేదసంహితలకు, బ్రాహ్మణములకు, భాష్యములను వ్రాశారు. సాయణాచార్యులు పురుషార్థ సుధానిధి, యజ్ఞతంత్ర సుధానిధి, సుభాషిత సుధానిధి, ప్రాయశ్చిత్త సుధానిధి, అలంకార సుధానిధి, ఆయుర్వేద సుధానిధి, ధాతువృత్తి అనే గ్రంథాలు కూడా వ్రాశారని తెలుస్తోంది. సాయణాచార్యులు శ్రౌత స్మార్తాది కర్మజ్ఞుడు, పూర్వోత్తర మీమాంసా కూలంకష ప్రజ్ఞుడు, స్మృతి పురాణాగమ విజ్ఞాన ఖని, అలంకార నీతి వైద్యశాస్త్ర నిష్ణాతుడని ఆయన భాష్యాల వల్ల ఆయన రచించిన ఇతర గ్రంథాల వల్ల తెలుస్తోంది.

## ఋగ్వేదభాష్యం

శ్రీ సాయణాచార్యుల వారు ఋగ్వేదభాష్యానికి మొదట ఉపోద్ఘాతం విస్తృతంగా రాశారు. దానిలో వేదాలలో మొదటిదైన ఋగ్వేదానికి మొదట ఎందుకు వ్యాఖ్యానం చేయలేదు. మొదట యజుర్వేదమే ఎందుకు వ్యాఖ్యానించారు మొదలయిన ప్రశ్నలు వేసుకుని సమాధానాలు చెప్పారు. ఇవి ప్రశ్నోత్తర రూపంలో ఉండడం వల్ల సులభంగా తెలియడానికవకాశం ఉంది. ఈ ఉపోద్ఘాతంలో వేదలక్షణం, ప్రమాణం తెలిపారు. జైమిని పూర్వమీమాంసా సూత్రాల నుదాహరించారు. మాధవాచార్యుల వారి జైమినీ న్యాయమాలా శ్లోకాలను కూడా ఉదాహరించారు.

వేదం అపౌరుషేయమని ప్రమాణపూర్వకంగా నిరూపించారు. వేదస్వరూపాన్ని తెలిపి, వేదార్థజ్ఞానం అవసరమని ప్రమాణాలతో వెల్లడించారు. వేదానికి అనుబంధ చతుష్టయాన్ని తెలిపారు. సంక్షిప్తంగా వేదాంగాలు పరిచయం చేశారు.

బ్రాహ్మణం మంత్ర వ్యాఖ్యానానికుపయోగిస్తుంది. కాబట్టి ఋగ్వేద సంహితకంటే ముందు బ్రాహ్మణారణ్యకోపనిషత్తులకు వ్యాఖ్య రాసి, తరువాత ఋక్సంహితకు వ్యాఖ్య చేశారు. మొదట బ్రాహ్మణం వ్యాఖ్య అయిపోయినా మంత్ర వ్యాఖ్యాన సందర్భంలో అక్కడక్కడ బ్రాహ్మణ వాక్యాలను కూడా ఉదాహరించారు.

మంత్రార్థం సులభంగా తెలియడం కోసం ప్రచారంలో ఉన్న కథలను అవతారికగా చెప్పారు. ఇవి గురుపరంపరగా వేదాధ్యయన సమయంలో లభించినవి కాబోలు. వీటిలో కొన్ని ఆకర్షణీయంగా ఉన్నాయి.

మంత్రానికి ఋషి, ఛందస్సు అవసరమయితే కల్పసూత్రం, అనుక్రమణిక ఉదాహరించి తరువాత వ్యాఖ్యానం చేశారు. సందర్భాను గుణంగా పూర్వమీమాంసా చర్చలు కూడా చేశారు.

ప్రతి మంత్రంలో ప్రకృతి ప్రత్యయ విభాగపూర్వకంగా వ్యాకరణ సూత్రాలనుదాహరిస్తూ అర్థం రాశారు. వైదిక స్వరప్రక్రియను సూత్ర పూర్వకంగా తెలిపారు. దీనివల్ల వీరు వ్రాసిన అర్థం ప్రామాణికమైందని తెలుస్తుంది.

అక్కడక్కడ అనేకార్థాలు కూడా ప్రమాణపూర్వకంగా వ్రాశారు. మొదటి మంత్రంలో అగ్నిశబ్దానికి అనేకార్థాలు వివరించారు. అర్థ నిర్ణయానికి యాస్క నిరుక్తం, అనుక్రమణిక ఉదాహరించారు. ఆ ఉద్ధరించబడిన భాగాలు కఠినంగా ఉంటే వాటికి కూడా అర్థాలు వ్రాశారు. అవసరమయినప్పుడు ఇతర వేదశాఖలను కూడా ఉదాహరించారు.

మొదటి మంత్రం బాగా విస్తరంగా వ్యాఖ్యానించి వేదగాంభీర్య మింతటిదని తెలిపారు. తరువాత సంక్షేపంగా వ్యాఖ్యానించారు.

ఇంత విస్తరంగా ప్రమాణాలతో వ్రాయడం వల్లనే వేదార్థం గ్రహించాలనుకొనే దేశ విదేశీయులు సాయణాచార్యభాష్యం అధ్యయనం చేసేవారు. ఆయన ఋగ్వేదభాష్యాన్ని విదేశీయులు 1890లోనే ముద్రించారు.

* * *

# శ్రీ దయానంద సరస్వతీస్వామి

మౌర్వీరాజ్యం (సౌరాష్ట్ర - గుజరాత్)లో టంకా గ్రామంలో విక్రమశకం 1881లో సంపన్న కుటుంబంలో మూలశంకరుడు జన్మించాడు. ఆయన బాల్యంలో యజుర్వేదసంహిత నభ్యసించాడు. శివరాత్రినాడు అర్ధరాత్రి శివలింగంపై ఎలుక తిరుగుతుంటే చూచిన అతనికి విగ్రహారాధనపై వ్యతిరేకభావం కలిగింది.

అతని చెల్లెలు, గురువయిన పినతండ్రి మరణించడం వల్ల విరక్తి కలిగి ఇరవై రెండో ఏట ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. నర్మదాతీరంలో పూర్ణానంద సరస్వతీస్వామి వారి దగ్గర సన్యాసం తీసుకున్నారు. వారి దీక్షానామం దయానందసరస్వతీస్వామి.

ఆయన హిమాలయాలలోని వివిధ క్షేత్రాలలో సంచరించారు. మధురలో వ్యాకరణవేత్త అయిన విరజానందస్వామివారి శిష్యరికం చేస్తూ అధ్యయనం చేశారు. ఆయన ఆదేశంచే వైదికధర్మవ్యాప్తికి కృషి చేశారు.

ఆగ్రా నుండి ధర్మోపదేశాలు ప్రారంభించారు. గోవధను ఆపమని ఆంగ్లేయులను కోరారు. విగ్రహారాధనాదులను ఖండించారు. కాశీలో కాశీమహారాజు సన్నిధిలో శాస్త్రచర్చలను చేశారు. వేదపాఠశాలలు ప్రారంభించారు. యజుర్వేదభాష్యం, ఋగ్వేదభాష్యం ఏడు మండలాలు రచించి ముద్రింపజేశారు. సత్యార్థప్రకాశం రచించి ముద్రింపజేశారు. మరెన్నో గ్రంథాలు వ్రాశారు.

అజమేరు, బీహారు, స్వదేశీ సంస్థానాలు మొదలైన చోటులలో తన సిద్ధాంతం ప్రచారం చేశారు.

విధర్ములు విషప్రయోగం చేయడంతో సంవత్ 1940లో పరమపదించారు. శ్రీస్వామి దేశవిదేశీయులచే మన్ననలందుకొన్నారు.

భారతీయ లూథర్‌గా, పరమేశ్వరాజ్ఞాపాలకపుత్రునిగా, మహర్షిగా ఖ్యాతి గడించారు.

## శ్రీ దయానంద సరస్వతీస్వామి భాష్యాలు

శ్రీ దయానంద సరస్వతీ స్వామివారు విక్రమశకం 1931లో మనుష్య హితంకోసం, సత్యప్రమాణాలతో సత్యార్థాన్ని వెల్లడిస్తూ ఈశ్వరానుగ్రహంచే వేదభాష్యం రచిస్తున్నానని గ్రంథ ప్రారంభంలో చెప్పారు.

మునులు, ఋషులు అవలంబించిన సనాతన వ్యాఖ్యారీతిలో మన్త్రార్థాలను వివరిస్తున్నానన్నారు.

ఈశ్వరుడు రచించిన వేదాలకు ప్రత్యక్షాది ప్రమాణాలచే సిద్ధించిన యథార్థ భాష్యాన్ని తాను రచిస్తానని వెల్లడించారు.

కర్మకాండలో మంత్రాలే దేవతలు అని వారు తెలిపారు. ఇది పూర్వమీమాంసా భాష్యకారుడు శంబరస్వామి అభిప్రాయం. అందుకే పూర్వమీమాంసకు నిరీశ్వర మీమాంస అని పేరు వచ్చింది. దయానంద సరస్వతీస్వామి పరలోకంలో ఇంద్రాది దేవతలున్నారని అంగీకరించలేదు. కాని పరబ్రహ్మను మాత్రం అంగీకరించారు.

ఇంద్రుడు, అగ్ని, వాయువు మొదలయిన పేర్లతో ఆ పరబ్రహ్మే వేదంలో స్తుతింపబడుతున్నాడని వారు వ్యాఖ్యానించారు. పరమేశ్వరునకు శరీరం లేదని వీరి అభిప్రాయం.

వేదంలో ముప్పై ముగ్గురు దేవతల గురించి ఉంది. వారు భౌతిక ప్రకృతికి, శరీరానికి చెందినవారు ఉపాసింపదగరు. వారి దేవతత్త్వం కేవలం వ్యవహారోపయోగిత్వమే. వారిని ఉపాసించడం అనార్యత్వమే. పరబ్రహ్మమే ఉపాసించదగినవాడని వారు చెప్పారు. వాక్కు మనస్సు ప్రాణమే మూడులోకాలు అని వారు చెప్పారు. బ్రహ్మ, విష్ణువు, శివుడు, ఇంద్రుడు మొదలైన పురాణ ప్రసిద్ధ దేవతలు వేదంలో వేరేలేరు. వేదంలో ఉన్న అగ్ని,

వాయువు, ఇంద్ర, వరుణ మొదలైన పేర్లన్నీ పరబ్రహ్మకే వర్తిస్తాయని ఏకేశ్వరతత్త్వాన్ని వారు తెలిపారు.

ఋక్సంహిత మంత్రభాగమే వేదమని వాటికే స్వతః ప్రామాణ్యం ఉందని, దీనినే పరమేశ్వరుడు రచించాడని వారి నిర్ణయం. బ్రాహ్మణారణ్యకోపనిషత్తులు ఋషుల రచనలని, వేదానికి విరుద్ధంగా లేని బ్రాహ్మణారణ్యకోపనిషత్తుల వాక్యాలను గ్రహించవచ్చని వారు అనుమతించారు.

వేదంలో సర్వవిద్యలు కర్మ ఉపాసన, బ్రహ్మవిద్య, విజ్ఞానం ఇవన్నీ ఉన్నాయని ఆయన వ్యాఖ్యానిస్తూ, మంత్రవ్యాఖ్యాన సందర్భంగా అక్కడున్న విద్యలను తెలిపారు.

ఆధునిక విద్యలుగా ప్రసిద్ధమయిన నౌక, విమానం, శతఘ్నులు, వైద్యం మొదలైనవి వేదంలో ఉన్నాయని తమ వ్యాఖ్యద్వారా తెలిపారు. తమ భాష్యంలో సాయణాచార్యుల వారి భాష్యాన్ని ఖండించారు.

వీరు తాము తెలిపే అర్థం విషయంలో వ్యాకరణం, మీమాంస, కల్పం మొదలైన ప్రమాణాలను వ్రాయలేదు. ఆ గ్రంథాల ద్వారానే వాటిని గ్రహించమని సూచించారు. మరల వ్రాయడం పునరుక్తి అవుతుందని తెలిపారు.

ఋగ్వేదంలో సర్వపదార్థాల గుణప్రకాశం ఉందని వ్రాశారు. వేదంలో ఉన్న అగ్న్యాది శబ్దాలతో ప్రసిద్ధమైన అగ్న్యాదులేకాక ఈశ్వరుడు కూడా చెప్పబడుతాడని తెలిపారు.

వారు మంత్రానికి ఋషి, ఛందస్సు, దేవత తెలిపిన తరువాత మొదట సంస్కృతంలో అర్థం, భావం వ్రాసి, పిదప హిందీలో అర్థం, భావం వ్రాశారు. వీరు ఋక్సంహితలో ఏడు మండలాల వరకు భాష్యం వ్రాశారని తెలుస్తోంది.

వీరి భాష్యం ప్రత్యేక లక్షణాలతో సాగింది.

**స్కందస్వామి :** ఋగ్వేదానికి స్కందస్వామి భాష్యం రాశారు. ఇది దొరుకుతున్న ఋగ్వేద భాష్యాలలో మొదటిది. ఇతడు ఇతర భాష్యకారులను పేరెత్తకుండా స్మరించాడు. ఇతని ఊరు వలభి. తండ్రి భర్తృధ్రువుడు. ఇతను 7వ శతాబ్దివాడు. ఇతని భాష్యం యజ్ఞపరంగా ఉంది. ప్రథమాష్టకం మాత్రం దొరుకుతోంది. తక్కిన భాష్యం దక్షిణదేశ గ్రంథాలయాల్లో ఉందని తెలుస్తోంది.

**నారాయణాచార్యులు :** ఇతడు స్కందస్వామికి భాష్యరచనలో తోడుపడ్డాడు. 5,6,7 అష్టకములకు భాష్యం రాశాడు.

**ఉద్గీథాచార్యులు :** ఈయన వేదభాష్యకారునిగా ప్రసిద్ధుడు. ఋక్సంహితలో పదవ మండలంలో ఐదవ సూక్తం నుండి ఎనభై మూడవ సూక్తం వరకు వీరి భాష్యం లభిస్తోంది. సాయణాచార్యులీయనను పలుసార్లు స్మరించారు. ఇది యజ్ఞపరమైన భాష్యం.

**హస్తామలకుడు :** ఎనిమిదవ శతాబ్దివాడితడు. ఇతని భాష్యం అలభ్యం.

**వేంకట మాధవుడు :** ఇతడు పదవ శతాబ్దంలో ఋగర్థదీపిక అనే భాష్యం వ్రాశాడు. ఇతని భాష్యం యజ్ఞపరం. వేదార్థ జ్ఞానానికి నిరుక్త, వ్యాకరణ, బ్రాహ్మణ గ్రంథపరిచయం కావాలని ఈయన అభిప్రాయం.

**లక్ష్మణాచార్యుడు :** ఇతని ఋక్సంహితాభాష్యం వేదభూషణం. ఇది వెలుగు చూడలేదు. ఇతడు పన్నెండవ శతాబ్దివాడని తెలుస్తోంది.

**ఆనందతీర్థుడు :** ఈయనకే మధ్వాచార్యులని మరో పేరు. 13వ శతాబ్దివాడు. కన్నడదేశ నివాసి. ఋక్సంహితలో ప్రథమ మండలంలో 40 సూక్తాలకు వీరి భాష్యం ఉంది. విష్ణువే సకల వేదప్రతిపాద్యుడని ఈయన సిద్ధాంతం.

**ఆత్మానందతీర్థుడు :** ఈయన 13వ శతాబ్దివాడు. ఋక్సంహిత ప్రథమ మండలంలో 40 సూక్తాలకు భాష్యం రాశాడు.

**ముద్గలాచార్యుడు :** ఇతడు 15వ శతాబ్దివాడు. సాయణభాష్యానికి సంగ్రహరూపం ఇతని భాష్యం. ఋక్సంహిత ప్రథమాష్టకానికి, చతుర్థాష్టకంలో 5వ అధ్యాయం వరకు ఇతని భాష్యం లభిస్తోంది.

**దేవస్వామి :** ఇతడు ప్రాచీనుడని ప్రసిద్ధి. ఇతని ఋక్సంహితాభాష్యం లభించడం లేదు.

**చతుర్వేదస్వామి :** ఇతడు ఋక్సంహితలో కొన్ని భాగాలకు కృష్ణపరమైన భాష్యం రాశాడు. శ్రీకృష్ణచరితం వేదమంత్రాలలో ఉందని ఈయన అభిప్రాయం.

**ధానుష్కయజ్వ :** ఇతడు కూడా ఋగ్వేదానికి భాష్యం వ్రాశాడు. కాని అలభ్యం, ఇతడు యజుస్సామవేదాలకు కూడా వ్రాశాడట.

**రావణుడు :** ఇతడు ఋగ్యజుర్వేదాలకు అధ్యాత్మార్థ ప్రధానమైన భాష్యాలు వ్రాశాడు. అక్కడక్కడ దొరుకుతోంది.

ఇలా ఋగ్వేదానికి మహానుభావులు వ్రాసిన భాష్యాలలో కొన్ని నశించాయి. కొన్ని అసమగ్రంగా దొరుకుతున్నాయి. వీటిలో సమగ్రంగా లభించేది సాయణాచార్యభాష్యం.

* * *

# బ్రహ్మచర్య ప్రాశస్త్యం

**శ్లో. బ్రహ్మచర్య ముపస్థ నియమః, వీర్యధారణఞ్చ**

**శబ్దకల్పద్రుమః, 3 భాగం, 444 పుట**

బ్రహ్మచర్యమంటే మర్మేంద్రియాన్ని నియమించడం. దాని ద్వారా వీర్యమనే ఏడవ ధాతువును ధరించడం. ఈ బ్రహ్మచర్యం ఒక్కొక్క ఆశ్రమానికి ఒక్కొక్క విధంగా ఉంటుంది.

వైదిక సంప్రదాయంలో ఆశ్రమాలు నాలుగు. 1) బ్రహ్మచర్యం, 2) గృహస్థాశ్రమం, 3) వానప్రస్థం, 4) సన్యాసం. బ్రహ్మచర్యాశ్రమంలో వేదాధ్యయనానికి బ్రహ్మచర్యం అంగం.

**బ్రహ్మణే వేదార్థం చర్యం బ్రహ్మచర్యమ్ ఆచరణీయమ్**

వేదం అధ్యయనం చేయడం కోసం ఆచరింపదగిన నియమాలలో బ్రహ్మచర్యం ఒకటి. బ్రహ్మచారికి వీర్యస్రావం కలిగితే వ్రత భంగమవుతుంది.

**శ్లో. ఏకశ్శయీత సతతం నరేతః స్కన్దయేత్ క్వచిత్**
**కామార్థీ స్కందయన్ రేతో హినస్తి వ్రతమాత్మనః**

**- మనుస్మృతి, 2 అ. 180 శ్లో.**

బ్రహ్మచారి అంతటా ఒంటరిగా పడుకోవాలి. కోరికతో వీర్యాన్ని విడువకూడదు. కామముతో రేతస్సును విడచినవాడు బ్రహ్మచర్యవ్రతం పోగొట్టుకుంటాడు. ఇట్టివానికి ఆ దోషం పోవడానికి ప్రాయశ్చిత్తముంది.

తన సంకల్పం లేకుండా కలలో రేతస్సును విడిచినవానికి ప్రాయశ్చిత్తం తక్కువ.

**శ్లో. స్వప్నే సిక్త్వా బ్రహ్మచారీ ద్విజ శ్శుక్ర మకామతః**
**సాత్వా ర్క మర్చయిత్వా త్రిః పునర్మామిత్యృచం జపేత్**

**- మను, 2 అ, 181 శ్లో.**

కలలో కామం లేకుండా రేతస్ఖలనం చేసినవాడు మరునాడుదయం స్నానంచేసి, సూర్యునుపాసించి, 'పునర్మామైత్వింద్రియమ్' అనే ఋఙ్మంత్రాన్ని మూడుసార్లు జపించాలి.

ఆ మంత్రానికి అర్థం - భోగంలో నశించిన వీర్యం మరల నన్ను చేరుగాక. మరల ఆయువు చేరుగాక. బ్రహ్మవర్చసం మరల చేరుగాక. ద్రవిణం కూడా మరల వచ్చుగాక!

అరుణం - 206. తైత్తిరీయారణ్యకము.

**బ్రహ్మచర్యంవల్ల లాభాలు**

**బ్రహ్మచర్యప్రతిష్ఠాయాం వీర్యలాభః**

**- పాతంజల యోగదర్శనం, 2 పా, 38 సూ.**

బ్రహ్మచర్య నిష్ఠుడయిన యోగికి సామర్థ్య విశేషము లభిస్తుంది. అణిమాది సిద్ధులు, జ్ఞానక్రియాశక్తులు కలుగుతాయి.

**శ్లో. మనస్స్థైర్యే స్థిరో వాయుః తతో బిన్దుః స్థిరో భవేత్**
**బిన్దు స్థైర్యాత్సదా సత్త్వం పిణ్డ స్థైర్యం ప్రజాయతే**

**- హఠయోగ ప్రదీపిక, 4 ఉ, 28 శ్లో.**

మనస్సు స్థిరపడిన యెడల ప్రాణము స్థిరమగును. అందువల్ల శుక్లము (వీర్యము) స్థిరమగును. శుక్లము స్థిరమయిన యెడల బలము దేహము యొక్క స్థిరత్వమును గలుగుతాయి.

**దీర్ఘాయుష్యదాయకాలు**

**శ్లో. క్షుతం వస్త్రేణ సంహృత్య జృమ్భణం నాసికేన తు**
**బిందుసంరక్షణే చైవ శతవర్షాణి జీవతి**

**- ఆచరణం - ఆరోగ్యం, 39 పుట**

దగ్గు వచ్చినప్పుడు బట్ట అడ్డంపెట్టుకోవాలి. ఆవలింత వస్తే నోరు మూసుకుని ముక్కుద్వారా ఆ గాలిని విడవాలి. వీలయినంత ఎక్కువగా శుక్రధాతువును రక్షించుకోవాలి (మైథునం తక్కువసార్లు చేయాలని భావం). ఇలా ప్రవర్తించినవాడు నూరు సంవత్సరాలు జీవిస్తాడు.

**శ్లో. విచార్య దేశ కాలే చ వయ స్సత్త్వం తథా బలమ్**
**జలపానముషః కాలే పీత్వా శత సమం వసేత్**

**- పై గ్రంథం**

దేశం, కాలం, వయస్సు, సత్త్వం, బలం ఆలోచించుకొని వాటికి తగినట్లుగా ఉషఃకాలంలో (సూర్యోదయానికి రెండు గంటలు ముందు కాలంలో) నీరు త్రాగితే నూరు సంవత్సరాలు జీవిస్తాడు.

**శ్లో. అంభసః ప్రసృతా న్యష్టౌపిదనుదితే రవౌ**
**వాత పిత్త కఫాన్ జిత్వా జీవే ద్వర్షశతం సుఖీ**

**- పై గ్రంథం**

సూర్యుడుదయించకుండా 8 పుడిసెళ్ళ నీరు (పుడిసెలి–చారెడు) త్రాగితే శరీరంలో ఉన్న వాతపిత్త కఫదోషాలు తగ్గడంవల్ల నూరు సంవత్సరాలు జీవిస్తాడు.

**శ్లో. జ్ఞాత్వా సుషుమ్నా సద్భేదం కృత్వా వాయుఞ్చ మధ్యగమ్**
**స్థిత్వా సదైవ సుస్థానే బ్రహ్మరన్ధ్రే నిరోధయేత్**
**- హఠయోగప్రదీపిక, 4వ ఉపదేశం, 16 శ్లో.**

ఎల్లప్పుడు మంచి స్థానమందు వసించియుండి, సుషుమ్నయనెడి మధ్యనాడిని చక్కగా భేదించు స్థితిని గురుముఖముగా దెలిసియుండి, ప్రాణవాయువును మధ్యయందు పోవునట్లు చేసి బ్రహ్మరంధ్రము నందు నిరోధింపవలయును.

**శ్లో. సూర్యాచంద్రమసౌ ధత్తః కాలం రాత్రిందివాత్మకమ్**
**భోక్త్రీ సుషుమ్నా కాలస్య గుహ్యమేత దుదాహృతమ్**
**– పై గ్రంథం, 17వ శ్లో.**

సూర్యుడును, చంద్రుడును దివారాత్రుల స్వరూపమయిన కాలమును కలిగించుచున్నారు. సుషుమ్న సూర్యచంద్రులచే చేయబడిన దివారాత్రి స్వరూపమయిన కాలమును భుజించుచున్నది. ఇది రహస్యముగా చెప్పబడినది.

వివరణం – రెండున్నర గడియలు ఒక గంట సూర్యనాడి, రెండున్నర గడియలు చంద్రనాడి గమనం చేస్తున్నాయి. ఈ సూర్యచంద్ర నాడులందు వాయుసంచారంతో కాలం గడుస్తోంది. అదే ఆయువు. సుషుమ్నామార్గము నందు పయనించి మనస్సు బ్రహ్మరంధ్రమునందు వాయువు సంచరించుచున్నప్పుడు కాలము లేనందువల్ల సుషుమ్న కాలమును భుజించుచున్నది. బ్రహ్మరంధ్రము నందు వాయువు వెళ్ళుచున్నంతవరకు యోగులకు ఆయుర్వృద్ధి కలుగుచున్నది.

దీర్ఘకాలము సమాధిని అభ్యసించిన యోగి ముందే మరణకాలమును తెలుసుకొని బ్రహ్మరంధ్రమునందు వాయువును నింపి కాలుని జయించుచున్నాడు. స్వేచ్ఛగా దేహత్యాగము చేయుచున్నాడు.

**శ్లో. మన స్థైర్యే స్థిరో వాయుః తతో బిన్దుః స్థిరో భవేత్**
**బిన్దు స్థైర్యాత్సదా సత్త్వం పిణ్డస్థైర్యం ప్రజాయతే**

మనస్సు స్థిరపడిన యెడల ప్రాణము స్థిరమగును. అందువలన శుక్లము స్థిరమగును. శుక్లము స్థిరమయిన యెడల బలమును పిండము యొక్క స్థిరత్వమును గలుగుచున్నవి.

**శ్లో. రసస్య మనసశ్చైవ చంచలత్వం స్వభావతః**
**రసో బద్ధో మనో బద్ధం కిం న సిద్ధ్యతి భూతలే**

పాదరసమునకు, మనస్సునకు స్వభావముగా చంచలత్వం కలదు. పాదరసము మనస్సు కట్టుపడితే లోకంలో ఏది సిద్ధించదు?

**శ్లో. మూర్ఛితో హరతే వ్యాధీన్ మృతో జీవయతి స్వయమ్**
**బద్ధః ఖేచరతాం ధత్తే రసో వాయుశ్చ పార్వతి**
**- హఠయోగప్రదీపిక, 4 ఉ, 26, 27 శ్లో.**

పార్వతీ! రసమును, వాయువును మూర్ఛితమయిన యెడల వ్యాధులను పోగొట్టుచున్నవి. అవి మృతమయిన యెడల బహుకాలము జీవింపజేయుచున్నవి. అవి కట్టువడిన యెడల ఆకాశమునందు సంచరించు స్థితి కలిగించుచున్నవి.

ఓషధీ విశేషంవల్ల చంచలత్వం పోయిన పాదరసం, కుంభక ప్రాణాయామాల చివర రేచకం చేసిన పిదప వాయువు మృత మనబడతాయి.

క్రియావిశేషం వల్ల గుళిక అయిన రసమును, ధారణచే భ్రూమధ్యమందు ధరింపబడిన వాయువును బద్ధమంటారు.

**శ్లో. ఆర్ద్రపాదస్తు భుంజీత నార్ద్రపాదస్తు సంవిశేత్**
**ఆర్ద్రపాదస్తు భుఞ్జానో దీర్ఘమాయు రవాప్నుయాత్**
**- మనుస్మృతి, 4 అ, 76 శ్లో.**

తడికాళ్ళతో భోజనం చేయాలి. తడికాళ్ళతో పరుండరాదు. తడి పాదములతో భుజించువాడు దీర్ఘాయుర్దాయం పొందుతాడు.

**కాయకల్పచికిత్స**

**అపాన మూర్ధ్వ ముత్థాప్య ప్రాణం కణ్ఠాదధో నయన్**
**యోగీ జరా వినిర్ముక్తః షోడశో వయసా భవేత్**
**- సర్వసారతత్త్వోపనిషత్, ఉ-2, అ1, 35 శ్లో.**

అపానవాయువును పైకిలేపి, ప్రాణవాయువును కంఠమునకు క్రిందికి తీసుకువచ్చినచో యోగి ముసలితనము నుండి విడువబడినవాడై పదహారేండ్ల యువకునివలె అగును.

**శ్లో. ఏకశాయీ ద్విభోజీ చ షణ్మూత్రీ ద్విపురీషకః**
**స్వల్ప సంగమకారీ చ శత వర్షాణి జీవతి**

**– ఆచరణం–ఆరోగ్యం, 33 పుట**

ఒకేసారి పరుండేవాడు (రాత్రి మాత్రం నిద్రించేవాడు) రెండుసార్లు భోజనం చేసేవాడు, ఆరుసార్లు మూత్రం, రెండుసార్లు మలం విసర్జించేవాడు, మైథునం చాలా తక్కువసార్లు (ఋతుకాలంలో మాత్రం) చేసేవాడు నూరు సంవత్సరాలు జీవిస్తాడు.

**శ్లో. దివా స్వాపం న కుర్వీత మిథ్యావాదం న కారయేత్**
**దివా స్త్రీసంగమో నృణామాయుః క్షయకరో భవేత్**

**– ఆచరణం–ఆరోగ్యం, 32 పుట**

పగలు నిద్రపోగూడదు. అసత్యం చెప్పకూడదు. పగలు స్త్రీ సంగమం ఆయుర్దాయాన్ని తగ్గిస్తుంది.

**శ్లో. రజస్స్వలాం గతవతో నరస్యాసంయతాత్మనః**
**దృష్ట్యాయు స్తేజసాం హానిః అధర్మశ్చ తతో భవేత్**

**– పై గ్రంథం, 35 పుట**

మనస్సు వశంలో లేక రజస్వలా స్త్రీసంభోగం చేయడంవల్ల చూపు, ఆయువు, తేజస్సు నాశమవుతాయి. అధర్మం కలుగుతుంది.

**శ్లో. అధితిష్ఠే న్న కేశాంస్తు న భస్మాస్థి పాలికాః**
**న కార్పాసాస్థి న తుషాన్ దీర్ఘమాయుర్జిజీవిషుః**

**– మను, 4 అ, 78 శ్లో.**

దీర్ఘకాలము జీవింపగోరువాడు వెంట్రుకలు, బూడిదలు, ఎముకలు, చిల్లపెంకులు, దూదె, పుట్టెలు, ఊక వీటిపై నిలబడరాదు.

**శ్లో. వయోధికాం స్త్రియం గత్వా తరుణః స్థవిరో భవేత్**

**– ఆచరణం–ఆరోగ్యం, 33 పుట**

తనకంటే ఎక్కువ వయస్సు గల స్త్రీతో సంగమం చేసిన యువకుడు ముసలివాడౌతాడు.

**శ్లో. తారుణ్యం తరుణీం గత్వా వృద్ధోఽపి సమవాప్నుయాత్ –** పై గ్రంథం

యౌవనవతితో సంగమం చేసిన వృద్ధుడు కూడా యౌవనం పొందుతాడు.

అష్టవిధ బ్రహ్మచర్యాన్ని పాటించేవారికి ఊర్ధ్వరేతస్కలత ఏర్పడుతుంది. వారికి మైథునం లేకపోవడం ఇబ్బంది కాదు. కాని కామభావనలుండి శుక్రాన్ని నిరోధించడం అనారోగ్యకరం.

**శ్లో. ఉచ్చారితే మూత్రితే చ రేతసశ్చ విధారణే**
**ఉత్తానే చ భవే చ్ఛీఘ్రం శుక్రాశ్మర్యాశ్చ సంభవః**

**– ఆచరణం–ఆరోగ్యం, 36 పుట**

మలం, మూత్రం, శుక్రం వీటి వేగాన్ని నిరోధించడం వల్ల శుక్రాశ్మరి అనే రోగం వస్తుంది.

**శ్లో. అవ్యవాయాన్మేహ మేదోవృద్ధి శ్శిథిలతా తనోః**

**– పై గ్రంథం 31వ పుట**

యౌవనవంతులు పూర్తిగా మైథునం మానడం వల్ల మేహం, కొవ్వు పెరుగుతాయి. శరీరం శిథిలమవుతుంది.

**అతిమైథునం వల్ల దోషాలు**

**శ్లో. శూల కాస జ్వర శ్వాస కార్శ్య పాండ్వామయ క్షయః**
**అతివ్యవాయా జ్జాయన్తే రోగాశ్చాక్షేపకాదయః**

**– పై గ్రంథం, 37 పుట**

అతిమైథునంవల్ల శూల, కాస, జ్వరము, శ్వాసరోగం, చిక్కిపోవడం, పాండురోగం, క్షయ, ఆక్షేపకం అనే వాతరోగం మొదలయిన రోగాలు కలుగుతాయి.

**పరస్త్రీ సాంగత్యం దోషకరం**

**శ్లో. నహీదృశ మనాయుష్యం లోకే కిఞ్చన విద్యతే**
**యాదృశం పురుషస్యేహ పరదారోపసేవనమ్**

**– మనుస్మృతి, 4 అ, 134 శ్లో.**

పురుషునికి పరభార్యాసేవనము కలిగించునంత ఆయుఃక్షీణత కలిగించేది లోకంలో మరోటి లేదు.

* * *

## వాయూత్పత్తి - ప్రాణం

**శ్రీమద్భాగవతము - 2 స్కం - 5 అ - 18 శ్లో. నుండి**

**శ్లో. సత్త్వం రజ స్తమ ఇతి నిర్గుణస్య గుణాస్త్రయః**
**స్థితి సర్గ నిరోధేషు గృహీతా మాయయా విభోః 18**

**భా.** నిర్గుణుడు, సమర్థుడు అయిన భగవంతునకు వశంగా ఉన్న సత్త్వం, రజస్సు, తమస్సు అని మూడు గుణాలున్నాయి. సృష్టి చేయడానికి రజస్సు, రక్షణకు సత్త్వం, సంహారానికి తమస్సు మాయచేత స్వేచ్ఛగా ఆయనచే గ్రహించబడినాయి.

**శ్లో. కాలం కర్మస్వభావఞ్చ మాయేశో మాయయా స్వయా**
**ఆత్మన్యదృచ్ఛయా ప్రాప్తం విబుభూషు రుపాదదే ॥**

**భా.** మాయేశుడయిన భగవంతుడు తన మాయచేత అనేక విధములుగా అవదలచినవాడై తనయందు లీనమయి యున్నది, సత్త్వాది గుణములెక్కువ తక్కువ అగుటకు కారణమయిన కాలమును, జీవుల కర్మను, పరిణామ హేతువయిన స్వభావమును, జగత్సృష్టికి కారణంగా పరిగ్రహించాడు.

**శ్లో. కాలాద్గుణ వ్యతికరః పరిణామః స్వభావతః**
**కర్మణో జన్మ మహతః పురుషాధిష్ఠితా దభూత్ ॥**

**భా.** పరమేశ్వర ప్రేరితమయిన కాలమువల్ల, సత్త్వాది గుణములకు సామ్యావస్థ తొలగుట, పరస్పర మేలనం కలిగింది. స్వభావము వల్ల గుణముల పరిణామము, రూపాంతరమును పొందుట జరిగింది. జీవుల అదృష్టకర్మ వల్ల మహత్తత్త్వము జన్మ కలిగింది.

**శ్లో. మహతస్తు వికుర్వాణాత్ రజస్సత్త్వోపబృంహితాత్**
**తమః ప్రధాన స్త్వభవత్ ద్రవ్యజ్ఞానక్రియాత్మకః ॥ 23**

**భా.** పరమేశ్వరునిచే ప్రేరితమయి రూపాంతరాన్ని పొందిన రజస్తమో గుణముల వల్ల వృద్ధి పొందిన మహత్తత్త్వము నుండి ద్రవ్యములు (పృథివ్యాది పంచ మహాభూతాలు) జ్ఞానము (మనస్సు, దేవతలు) క్రియలు (ఇంద్రియాలు) వీటికి కారణమయినది కలిగింది.

**శ్లో. సోహంకార ఇతి ప్రోక్తో వికుర్వన్ సమభూత్త్రిధా**
**వైకారిక స్తైజసశ్చ తామసశ్చేతి యద్భిదా**
**ద్రవ్యశక్తిః క్రియాశక్తిః జ్ఞానశక్తి రితి ప్రభో ॥ 24**

**భా.** దానిని అహంకారమంటారు. దానికి సాత్త్వికము, రాజసము, తామసము అని మూడు భేదాలున్నాయి. వాటిలో మహాభూతా లనుత్పాదనం చేసే శక్తి కలది తామసం. పది ఇంద్రియాలను ఉత్పాదనం చేసే శక్తి కలది రాజసం. అంతఃకరణాన్ని దేవతలను పుట్టించే సామర్థ్యం కలది సాత్త్వికం.

**శ్లో. తామసాదపి భూతాదే ర్వికుర్వాణా దభూన్నభః**
**తస్య మాత్రా గుణ శ్శబ్దో లిఙ్గం యద్ద్రష్టు దృశ్యయోః ॥ 25**

**భా.** తామసాహంకారం వికృతిని పొందగా ఆకాశం ఏర్పడింది. శబ్దం ఆకాశానికి సూక్ష్మగుణం, ఆకాశం ముఖ్య గుణం శబ్దం. గోడకవతల గజం అనే శబ్దం వినబడుతుంది. వెళ్ళి చూస్తే గజాన్ని చూచేవాడు, గజం కనబడతాయి. ఆ రెండింటికి ఈ గజశబ్దం లింగం.

**శ్లో. నభసోథ వికుర్వాణా దభూత్స్పర్శగుణోనిలః**
**పరాన్వయా చ్ఛబ్దవాంశ్చ ప్రాణ ఓజస్సహో బలమ్ ॥ 26**

**భా.** ఆకాశం రూపాంతరాన్ని పొందగా ఆకాశాన్నుండి స్పర్శ తన్మాత్ర ద్వారా స్పర్శగుణం కల వాయువు పుట్టింది. దానికి ఆకాశాన్నుండి శబ్దగుణం వచ్చింది. ఈ వాయువుకు దేహమును ధరించు ప్రాణత్వము లక్షణం. ప్రాణము (దేహధారణ శక్తి) ఓజస్సు (ఇంద్రియ శక్తి) సహము (అంతఃకరణ శక్తి) బలం (దేహ సామర్థ్యము) వీటికి వాయువే హేతువు.

**శ్లో. వాయోరపి వికుర్వాణాత్ కాలకర్మ స్వభావతః**
**ఉదపద్యత తేజో వై రూపవత్ స్పర్శశబ్దవత్ ॥ 27**

**భా.** కాల కర్మ స్వభావం వల్ల వికృతి పొందిన వాయువు నుండి రూప తన్మాత్ర ద్వారా రసం, రూపం, స్పర్శ, శబ్దం కల తేజస్సు పుట్టింది.

**శ్రీమద్భాగవతం - 3వ స్కంధం - 6 అ.**

**శ్లో. ఇతి తాసాం స్వశక్తీనాం సతీనామసమేత్య సః**
**ప్రసుప్త లోక తన్త్రాణాం నిశామ్య గతి మీశ్వరః ॥ 1**

**శ్లో. కాలసంజ్ఞాం తదా దేవీం బిభ్రచ్ఛక్తి మురుక్రమః**
**త్రయోవింశతి తత్త్వానాం గణం యుగపదావిశత్ ॥ 2**

**భా.** కలవకుండా ఉన్నవి, విశ్వరచన, జీవోపకరణాలు ప్రసుప్తంగా ఉన్న తన శక్తులకు సృష్టిరచనాసామర్థ్యం లేకపోవడం చూచి. కాలంచే ఉద్బోధాన్ని పొందే తన ప్రకృతిశక్తితో కూడా ఇరవై మూడు తత్త్వాలలో (మహత్తు, అహంకారం, 5 మహాభూతాలు, 5 తన్మాత్రలు, 11 ఇంద్రియాలు) అంతర్యామిగా ఒకేసారి ప్రవేశించాడు.

**శ్లో. సోఽనుప్రవిష్టో భగవాన్ చేష్టారూపేణ తం గణమ్**
**భిన్నం సంయోజయామాస సుప్తం కర్మ ప్రబోధయన్ ॥ 3**

**భా.** అలా ప్రవేశించిన భగవంతుడు చేష్టారూపంలో కాలమనే క్రియాశక్తిచే వాసనారూపంలో ఉన్న ప్రాణుల కర్మను ప్రబోధిస్తూ (ఫలోన్ముఖంగా చేస్తూ) విడిగా ఆ 23 తత్త్వాలను ఏకంగా కూర్చాడు.

**శ్లో. ప్రబుద్ధ కర్మా దైవేన త్రయోవింశతికో గణః**
**ప్రేరితో జనయత్స్వాభిర్మాత్రాభి రభిపూరుషమ్ ॥ 4**

**భా.** ప్రాణుల అదృష్ట కర్మ, తమ క్రియాశక్తి మేల్కొన్న ఆ త్రయోవింశతి గణము ఈశ్వరునిచే ప్రేరేపింపబడినదై తమ అవయవములచేత విరాడ్దేహాన్ని సృష్టించింది.

**శ్లో. పరేణ విశతా స్వస్మిన్ మాత్రయా విశ్వసృగ్గణః**
**చుక్షోభాన్యోన్య మాసాద్య యస్మింల్లోకా శ్చరాచరాః ॥ 5**

**భా.** తన అంశతో ప్రవేశించిన భగవంతుని చేత త్రయోవింశతి తత్త్వాల గణము పరస్పరం అంగాంగి భావాన్ని పొంది, తన అంశతో బ్రహ్మాండ రూపమయిన గర్భంగా పరిణమించింది. దానియందే స్థావర జఙ్గమాత్మకమయిన జీవులు వ్యష్టి విరాడ్రూపులు ఉన్నారు. ఆ సమష్టి విరాట్టే విశ్వబాలకుడు. బాలుడు తల్లి కడుపు నుండి వెలువడి బాల్యం యౌవనం మొదలయిన అవస్థలు పొందుతాడు. విశ్వబాలకుడు మాత్రం మాయ అనే తల్లి కడుపులోనే బాల్యాది మరణం వరకు ఉంటాడు.

**శ్లో. హిరణ్మయః స పురుషః సహస్ర పరివత్సరాన్**
**ఆణ్డ కోశ ఉవాసాప్సు సర్వసత్త్వోపబృంహితః ॥ 6**

**భా.** గర్భోదకంలో ఉన్న సమష్టి పురుషుడు బాగా కాంతితో ఉన్నాడు. సర్వ దేవ పశుపక్ష్యాది సూక్ష్మప్రాణులతో ఉన్నాడు. వేయి పరివత్సరాల కాలం ఆవరణ జలంలో ఉన్నాడు. ఇది ఆవరణ జలం బ్రహ్మాండోత్పత్తికి ముందే ఆవిర్భవించింది.

**శ్లో. స వై విశ్వసృజాం గర్భో దేవ కర్మాత్మ శక్తిమాన్**
**విబభాజాత్మనాత్మానం ఏకధా దశధా త్రిధా ॥ 7**

**భా.** భగవదంశ చిచ్ఛక్తి, క్రియాశక్తి, జీవరూపమయిన భోక్తృశక్తి కలిగిన ఆ విశ్వసృజుల గర్భము తానే ఒకటిగా పది విధాలుగా, మూడు విధాలుగా తనను విభజించుకొనెను. దేవశక్తి హృదయంలో ఉండే చైతన్యరూపంతో ఒకటిగా ఉంది. క్రియాశక్తి ప్రాణరూపంతో పది విధాలుగా ఉంది. ఆత్మశక్తి అధ్యాత్మం, అధిదైవం, అధిభూతం అని మూడు విధాలుగా ఉంది.

**శ్లో. ఏష హ్యశేష సత్త్వానా మాత్మాంశః పరమాత్మనః**
**ఆద్యోఽ వతారో యత్రాఽ సౌ భూతగ్రామో విభావ్యతే ॥ 8**

**భా.** ఈ విరాట్టు అన్ని వ్యష్టి జీవులకు ఆత్మ, సమష్టి రూపము, పరమాత్మ అంశం, ఆద్యావతారం, ఈ విరాట్టు యందు స్థావర జంగమాత్మకమయిన విశ్వమంతా కనబడుతుంది.

**శ్లో. సాధ్యాత్మః సాధిదైవశ్చ సాధిభూత ఇది త్రిధా**
**విరాట్ ప్రాణో దశవిధ ఏకధా హృదయేన చ ॥ 9**

**భా.** అధ్యాత్మములింద్రియాలు వాటితో కూడినది విరాట్టు. అధిభూతములు వ్యష్టి దేహాలు. వాటితో కూడిన విరాట్టు, ఆదిత్యాదులు సమూహమధి దైవములు వానితో కూడినది విరాట్టు. ఇలా సాధ్యాత్మం, సాధిభూతం, సాధిదైవం అని విరాట్టు మూడు రకాలు.

ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం, నాగం, కూర్మం, కృకరం, దేవదత్తం, ధనంజయం అని వృత్తిభేదంచే విరాట్ ప్రాణం పది విధాలు. ప్రాణం ముందుకు ప్రవహించేది నాసాగ్రమందుంటుంది. అపానం క్రిందికి ప్రసరించేది పాయ్వాది స్థానాల్లో ఉంటుంది. సమానం తిన్న, తాగిన వాటిని సమం చేసేది శరీర మధ్యమందుంటుంది. ఉదానం పైకి ప్రసరించేది కంఠమందుంటుంది. మృత్యుహేతువయిన వ్యానం అడ్డంగా ప్రసరిస్తుంది. శరీరమంతటా ఉంటుంది. ఇది చేతులు, కాళ్ళు మొదలయినవి ముడుచుకొనడానికి చాపడానికి కారణం. త్రేణుపులకు నాగము, కనులు తెరుచుటకు కూర్మము, ఎండుటయందు కృకరము, ఆవలింతయందు దేవదత్తము ఉంటాయి. మరణించిన వానియందు కూడా శరీరమందు ధనంజయం ఉంటుంది.

హృదయావచ్ఛిన్న చైతన్యరూపంతో ఒకటిగా ఉంటుంది.

* * *

## జీవిత లక్ష్యాలు

**శ్లో. ఆహార నిద్రా భయ మైథునాని**
**సమాన మేత త్పశుభి ర్నరాణామ్**
**ఏకో వివేకో హ్యధికో మనుష్యే**
**తేనైవ హీనః పశుభి స్సమానః**

**– సమయోచిత పదమాలిక, 20 శ్లో.**

ఆహారం, నిద్ర, భయం, మైథునం ఇవి పశువులతో మనుష్యులకు సమానం. మనుష్యునికి వివేకం ఒకటి ఎక్కువ. వివేకం లేని మనుష్యుడు పశువుతో సమానం.

**శ్లో. పరిత్యజే దర్థ కామౌ యౌ స్యాతాం ధర్మవర్జితౌ**
**ధర్మఞ్చా ప్యసుఖో దర్కం లోకవిక్రుష్టమేవ చ**

**– మను, 4 అ, 176 శ్లో.**

ధర్మవిరుద్ధమయిన అర్థకామాలను వదిలిపెట్టాలి. తరువాత దుఃఖాన్ని కలిగించే ధర్మకార్యం కూడా చేయరాదు. లోకనింద్యమయిన ధర్మకార్యం చేయరాదు.

**శ్లో. ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్**
**అనపాకృత్య మోక్షం తు సేవమానో పతత్యధః**

**– మను, 6 అ, 35 శ్లో.**

దేవఋణం, ఋషిఋణం, పితృఋణం తీర్చి మనస్సును మోక్షమందు పెట్టాలి. ఋణములను తీర్చకుండా మోక్షమును సేవించిన వాడు నరకమున బడును.

**శ్లో. అధీత్య విధివ ద్వేదాన్ పుత్రాంశ్చోత్పాద్య ధర్మతః**
**ఇష్ట్వా చ శక్తితో యజ్ఞైః మనో మోక్షే నివేశయేత్**

**– మను, 6 అ, 36 శ్లో.**

వేదములను శాస్త్రము చెప్పిన రీతిలో చదివి, ధర్మమార్గములో పుత్రులను పొంది, శక్తి ననుసరించి యజ్ఞములను చేసి మనస్సు మోక్షమందు పెట్టాలి.

**శ్లో. ధర్మం శనై స్సంచినుయా ద్వల్మీకమివ పుత్రికాః**
**పరలోకసహాయార్థం సర్వ భూతా న్యపీడయన్**

**– పై గ్రంథము, 238 శ్లో.**

సకల భూతములను బాధింపక, పరలోకంలో తోడ్పాటుకై చీమలు పుట్టలు పెట్టినట్లు ధర్మము కొంచెం కొంచెం సంపాదించాలి.

* * *

# సూక్తులు

श्लो. विरूपो याव दादर्शे नात्मनः पश्यते मुखम् ।
मन्यते ताव दात्मान मन्येभ्यो रूपवत्तरम् ।।

ता. विकृत रूपः आत्मनः मुख मादर्शे यावन्न पश्यते तावत्पर्यन्त मात्मान मितरेभ्य स्सुन्दरम् मन्यते ।

భా. వికృత రూపం కలవాడు అద్దంలో తన ముఖం చూసుకోనంత వరకు తాను ఇతరుల కంటె బాగా అందగాణ్ణని అనుకుంటాడు.

– మహాభారతం, ఆదిపర్వం, 74-87

श्लो. यदा स्व मुख मादर्शे विकृतं सोभिवीक्षते ।
तदान्तरं विजानीते आत्मान ञ्चेतरं जनम् ।।

ता. यदा आत्मनः मुख मादर्शे विकृत रूपं वीक्षते तदा स्व मुखस्य अन्य मुखस्य अन्तरं विजानीते।

భా. తన ముఖం అద్దంలో వికృతంగా ఉందని చూసినపుడు తనకు ఇతరులకు రూపంలో ఉండే తేడా తెలుసుకోగలుగుతాడు.

విశే. ఇది ఒక్క అంగానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. నాది అనే భావం ఉన్నప్పుడు ప్రతీది మంచిగా, గొప్పగా అనిపిస్తుంది. ఆ పక్షపాతం విడచి తన వాటిని ఇతరుల పదార్థాలతో పోల్చి చూచినపుడు తన లోపాలు, ఇతరుల గొప్పదనాలు తెలుస్తాయి.

– మహాభారతం, ఆదిపర్వం, 74-88.

श्लो. पुमांसो ये हि निन्दन्ति वृत्तेनाभिजनेन च ।
न तेषु निवसेत् प्राज्ञः श्रेयोर्थी पापबुध्दिषु ।।

ता. आत्मनः वृत्त मात्मनः अभिजनं यत्र पाप बुध्दयः निन्दन्ति तत्र श्रेयोर्थी प्राज्ञः निवासं न कुर्यात् ।

భా. పాపబుద్ధి గలవారు ఇతరుల మనస్సుకు కలత కలిగించడం కోసం వారి నడతలోను, వారి వంశంలోను తప్పులు వెదకుతూ నిందిస్తారు. శ్రేయస్సును కోరుకునే బుద్ధిమంతుడు అలాంటివారున్న చోట నివసించకూడదు.

– మహాభారతం, ఆదిపర్వం, 79-10

విశే. ఆ ఇతరుల కువిమర్శల వల్ల తాను హీనుడననే భావం, నిరుత్సాహం కలగడం వల్ల తానభివృద్ధి సాధించలేడు కాబట్టి అక్కడ నివసించకూడదు.

**श्लो. येत्वेन मभिजानन्ति वृत्तेनाभिजनेन च ।**
**तेषु साधुषु वस्तव्यं सवासः श्रेष्ठ उच्यते ।।**

ता. उत्तम वृत्तोपेत मुत्तमाभिजनोपेतं ये जानन्ति तेषु साधुषु निवासं कुर्यात्। स श्रेष्ठनिवास इति उत्तमै रुच्यते।

భా. తన మంచి నడత, తన మంచి వంశము ఎరిగిన సత్పురుషులున్నచోట నివసించాలి. అక్కడ నివసించడం శ్రేష్ఠం.

– మహాభారతం, ఆదిపర్వం, 79-11

విశే. తన మంచి నడతను, తన సద్వంశాన్ని ఎరిగిన మంచివారి దగ్గర ఉంటే వారి సద్వచనాలవల్ల తనకు ఉత్తేజం కలుగుతుంది. దాని ద్వారా గొప్ప కార్యాలను చేయగలుగుతాడు.

**श्लो. सुखं हि जन्तु र्यदि वापि दुःखं**
**दैवाधीनं विन्दते नात्मशक्त्या ।**
**तस्माद्दिष्टं बलवन्मन्यमानो**
**न संज्वरेन्नापि हृष्येत् कथञ्चित् ।।**

తా. प्राणी सुखं वा दुःखं वा यद्विन्दते तत्पूर्वजन्म कर्माधीनं विन्दते। न आत्मशक्त्या लभते। तद् ज्ञात्वा प्राज्ञः दिष्टं बलवन्मन्यमानः दुःखेन परितापम् न कुर्यात्। सुखलाभेन हर्षम् न कुर्यात्।

భా. ధీరుడు దుఃఖాలచేత క్రుంగిపోకూడదు. సుఖాలచేత బాగా ఉప్పొంగిపోకూడదు. ఎల్లప్పుడు సమభావంతో ప్రవర్తించాలి. విధి బలీయమైనది అని తలుస్తూ శోకాన్ని పొందకూడదు. ఏ విధంగాను అతిగా సంతోషించకూడదు.

– మహాభారతం, ఆదిపర్వం, 89–9

విశే. దుఃఖాలను తలచుకొని కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకునేవారూ ఉన్నారు. సుఖాలను తలచుకొని అహంకారంతో ఇతరులను కించపరచేవారూ ఉన్నారు. ఈ రెండూ తనకు సంఘానికీ కూడా మంచివి కావు. పట్టలేని సంతోషంతో గుండె ఆగిపోయినవారు కూడా ఉన్నారు. కాబట్టి సుఖదుఃఖాలకు అతీతంగా వ్యవహరించాలి. బలీయమైన విధివల్లనే యీ సుఖదుఃఖాలు వస్తున్నాయని గుర్తించడం వల్ల సహనము అలవడుతుంది. అహంకారం కలుగదు.

**श्लो. न संशयमनारुह्य नरो भद्राणि पश्यति ।**
**संशयं पुनरारुह्य यदि जीवति पश्यति ॥**

**महाभारतम्, आदि-२३९, अ-७३ श्लो**

తా. मानवः अभ्युदय प्राप्त्यर्थम् प्राण संशयकरं साहस मकृत्वा शुभानि नाप्नोति। साहस करण समये यदि प्रमादमाप्नोति स न जीवति। यदि जीवति तदा भद्राणि पश्यति।

భా. మానవుడు ప్రాణసంశయాన్ని కలిగించే సాహసం చేయకుండా గొప్ప శుభాల్ని పొందలేడు. ఆ సాహసం చేసేవేళ పొరపాటు పడితే ప్రాణం దక్కదు. ఆ సాహసం చేసి జీవించి విజయాన్ని సాధిస్తే గొప్ప శుభఫలితాలను పొందుతాడు.

విశే. చాలామంది తన కర్తవ్యంలో ఉండే ఇబ్బందులను ముందే ఊహించి ఘనకార్యాలకు పూనుకోరు. దానివల్ల అభివృద్ధికి నోచుకోరు. ఇబ్బందులు అన్ని పనులలోను ఉంటాయి. తనకు తోచిన ఇబ్బందులకు పరిష్కారాలను కూడా తెలుసుకుని సాహసం చేయకపోతే ఘనకార్యాలను సాధించలేరు.

**श्लो. यो जानाति पर प्रज्ञां नीतिशास्त्रानुसारिणीम् ।**
**विज्ञायेह तथा कुर्यादापदं निस्तरेद् यथा ।।**

**म.भा, आदि-१४४, २१ श्लो**

ता. राजनीतिशास्त्रानुसारिणीं शत्रूणां प्रज्ञां यो जानाति स्वयमपि राजनीतिशास्त्रानुसारिणी परिहारकारिणीम् क्रियाम् विज्ञाय तत्कृत्वा आपदं निस्तरेत्।

భా. రాజనీతిని అనుసరించే ఇతరుల ప్రజ్ఞను గ్రహించినవాడు వారి వలన కలిగే ఆపదను (ఆ నీతిని అనుసరించి) దాటాలి.

విశే. తన మానాన తాను నడుస్తున్నా ఇతరులవల్ల (శత్రువులవల్ల) ఇబ్బందులు కలుగుతూంటాయి. వారే నీతిననుసరించి తనకు ఇబ్బందులు కలిగిస్తున్నారో ముందు గ్రహించగలగాలి. అట్టి నీతి ననుసరించి వాటికి ప్రతిక్రియను తెలుసుకోగలగాలి. అప్పుడు శత్రువులవల్ల కలిగే ఆపదలను తొలగించుకోగలుగుతాడు. కాబట్టి నీతిపరిజ్ఞానం ప్రతివారికి అవసరం. పరిపాలకులకు మరీ అవసరం.

**श्लो. यो हि कारणतः क्रोधं सञ्जातं क्षन्तु मर्हति ।**
**नालं स मनुजः सम्यक् त्रिवर्गं परिरक्षितुम् ।।**

ता. यः शत्रूणामपराधेन सञ्जात मात्मनः समुचितम् क्रोध मुपशमयति सः धर्मार्थकामान् सम्यक् परिरक्षितुं न समर्थो भवति।

భా. సరియైన కారణంవల్ల కోపం వస్తే దానిని అణచివేసుకున్నవాడు ధర్మార్థకామాలను బాగా రక్షించుకోలేడు.

– మహాభారతం, ఆదిపర్వం, 170-3

విశే. తగిన కారణంవల్ల కోపం వచ్చినా దానిని పైకి వెల్లడించక అణచివేసుకుంటే అది అనారోగ్యంగా పరిణమిస్తుందని హోమియోపతి వైద్యశాస్త్రం చెబుతోంది.

**श्लो. प्रतिषेध्दा हि पापस्य यदा लोकेषु विद्यते ।**
**तदा सर्वेषु लोकेषु पापकृन्नोपपद्यते ।।**

ता. लोकेषु पापस्य प्रतिषेधकर्ता विद्यते यदि सर्वेषु पापकृन्न भवेत्। निवारकाभावेन पापकृतः वृद्धिं प्राप्नुवन्तीति भावः।

భా. లోకంలో పాపం చేయవద్దని, చేసేవారిని అడ్డగించేవాడుంటే జనులందరిలో పాపంచేసే వాడుండడు. కాబట్టి సామర్థ్యం, అధికారం కలవారు తప్పు చేసేవారిని తప్పు చేయకుండా అడ్డుకుంటే లోకంలో తప్పు చేసేవారు తగ్గుతారు.

– మహాభారతం, ఆదిపర్వం, 179-9

**श्लो. जानन्नपि च यः पापं शक्तिमान् न नियच्छति।**
**ईशः सन् सोपि तेनैव कर्मणा सम्प्रयुज्यते ।।**

ता. पापः क्रियत इति जानन्नपि तन्निवारणम् कर्तुं शक्तिमानपि, अधिकार्यपि यो न नियच्छति सोपि तत्पापकर्मणा संयुज्यते।

భా. శక్తి గలవాడు, సమర్థుడు అధికారి అయినవాడు అది పాపమని తెలిసి కూడా దానిని అడ్డుకొనకపోతే, అతనికి కూడా ఆ పాపంలో భాగం వస్తుంది. – మహాభారతం, ఆదిపర్వం, 179-11

**श्लो. कीर्तिरक्षण मातिष्ठ कीर्ति र्हि परमं बलम् ।**
**नष्टकीर्ते र्मनुष्यस्य जीवितं ह्यफलं स्मृतम् ।।**

తా. हे मानव! तव सत्कीर्तेः रक्षणम् कुरु। यश एव तव परमम् बलम् स्मृतम्। यस्य कीर्ति र्विनष्टा भवति तस्य जीवितम् विफल मिति सद्भिः स्मर्यते।।

భా. కీర్తిని రక్షించుకోవాలి. కీర్తి గొప్పబలం. మానవునికి యశస్సు నశిస్తే అతని జీవితం నిష్ఫలమని పెద్దలు తలచారు.

– మహాభారతం, ఆదిపర్వం, 202-10

**श्लो. अरक्षितारं राजानं बलिषड्भागहारिणम् ।**
**तमाहुः सर्वलोकस्य समग्रं पापचारिणम् ।।**

తా. प्रजाना मरक्षितारम् प्रजाभ्यः बलि माहर्तारं राजानम् मुनय, सर्व लोकस्य सम्पूर्ण पापाचरणकर्तार माहुः।

భా. ప్రజలనుండి పన్ను తీసుకుని వారిని రక్షించని పాలకుడు సర్వలోకమునకు చెందిన సంపూర్ణ పాపం చేసినవాడని మునులు చెప్పారు. – మహాభారతం, ఆదిపర్వం, 212-9

విశే. పూర్వం రాజుల పాలనలో ఆదాయంలో ఆరవ భాగం పన్నుగా తీసుకొనేవారు. ఇప్పుడు ప్రజాస్వామ్యంలో వేరేవిధంగా పన్ను తీసుకుంటున్నారు. అయినప్పటికీ ప్రజారక్షణం చేయకుండా పన్ను తీసుకుంటే దోషమని భావం.

**श्लो. आत्मनिन्दाऽऽत्मपूजा च परनिन्दा परस्तवः ।**
**अनाचरित मार्याणां वृत्त मेतच्चतुर्विधम् ।।**

తా. आर्या; आत्मनः निन्दा मात्मनः पूजाश्च परनिन्दाम् परस्तुतिश्च नाचरन्ति। एत च्चतुर्विधकार्याकरणम् पूज्यानां सद्वृत्तम् भवति।।

భా. తనను నిందించుకోవడం, తనను పొగడుకోవడం, ఇతరులను నిందించడం, ఇతరులను పొగడడం, ఈ నాలుగు విధాలు పూజ్యులు

ఆచరించరు. ఇవి పూజ్యులు చేయరాని పనులని భావం.

– మహాభారతం, ఆదిపర్వం, 44–24

श्लो. अव्यापारः परार्थेषु नित्योद्योगः स्व कर्मसु ।
रक्षणं समुपात्ताना मेतद्वैभवलक्षणम् ।।

म.भा, सभ-५४, अ-७ श्लो

ता. स्वस्य सम्बन्धरहितेषु कार्येष्वननुप्रवेशः, स्व कर्तव्येषु निरन्तरोद्योगः, सम्पादित वस्तु रक्षणम् वैभवप्राप्ति लक्षणानि भवन्ति।।

భా. ఇతరుల పనులలో కలగజేసుకొనకపోవడం, తన పనులలో నిరంతరం ప్రయత్నం చేయడం, తనకు లభించిన దానిని రక్షించుకోవడం, ఇవి వైభవం లభించడానికి చిహ్నములు. ఇలా ప్రవర్తించినవారికి వైభవం లభిస్తుందని భావం.

– మహాభారతం, సభాపర్వం, 54–6

श्लो. पर नेयोऽग्रणी र्यस्य स मार्गान् प्रतिमुह्यति ।
पन्थान मनुगच्छेयुः कथं तस्य पदानुगाः ।।

म.भा, सभा-५५, अ-४ श्लो

ता. योषां नायकःसर्वेष्वर्थेषु इतरैः नेयो भवति स कर्तव्येषु विषयेषु माप्नोति। कर्तव्यं न वेति ज्ञाना भावात्। तन्नायकानुयायिनः कथं गन्तव्य मार्गमनु गच्छेयुः तस्मा दविवेकिनं नानु गच्छेत्।।

భా. నాయకుడు ఇతరులచే నడిపించబడేవాడైతే అతడు ప్రవర్తించవలసిన దారియేదో తెలియక మోహాన్ని పొందుతాడు. అతని అడుగుజాడల్లో నడిచే అనుయాయులు సరియైన మార్గంలో ఎలా వెళ్ళగలరు?

– మహాభారతం, సభాపర్వం, 55–4

श्लो. **न कालो दण्डमुद्यम्य शिरः कृन्तति कस्यचित् ।**
**कालस्य बल मेतावद् विपरीतार्थदर्शनम् ।।**

**म.भा, सभा-८१, अ-११ श्लो**

ता. दुष्कालः दण्ड मुद्यम्य कस्यचित् शिरोभेदनं न करोति। किन्तु यथा स्थितस्यार्थस्य विपरीतदर्शनेन नष्ट करणं दुष्कालेन भवति। एतावदेव दुष्कालबलम्। एतद् ज्ञानेन कालाननुकूल समये सत्पुरुष सूचित मार्ग गमनेन नष्टनिवारणम् भविष्यति।

భా. చెడుకాలం దండం ఎత్తి ఎవడి తల పగులకొట్టదు. ఉన్న విషయాన్ని ఉన్నట్లు కాకుండా విరుద్ధంగా చూచునట్లు చేయడమే కాలబలం.

విశే. తనకు కాలం అనుకూలంగా లేదని తెలిసినవాడు నమ్మకంగా మంచి మార్గాన్ని తెలిపే సత్పురుషుడు చెప్పిన దారిలో వెళ్ళడంవల్ల చెడు కాలంవల్ల కలిగే నష్టాన్ని కలగకుండా చేసుకోవచ్చు.

श्लो. **बुद्धिश्च हीयते पुंसां नीचैः सह समागमात् ।**
**मध्यमै र्मध्यतां याति श्रेष्ठतां याति चोत्तमैः ।।**

ता. पुरुषाणां बुध्दिश्च नीचसंयोगात् हीना भवति। चकारात् शरीरेन्द्रियाण्यपि हीनानि भवन्ति। मध्यमै स्समागमात् बुद्धिर्मध्यमा, उत्तमै स्समागमात् श्रेष्ठा च भवति। तस्मा दुत्तम समागमः कर्तव्य इति भावः।

భా. నీచులతో సంబంధంవల్ల బుద్ధి కూడా హీనమవుతుంది. మధ్యములతో సంబంధంవల్ల బుద్ధి మధ్యమస్థితిని పొందుతుంది. ఉత్తములతో సంబంధంవల్ల బుద్ధి శ్రేష్ఠమవుతుంది.

– మహాభారతం, వనపర్వం, 1–30

* * *

# ధన్యోపాఖ్యాన గాంభీర్యం

గుడిగంట మ్రోగింది. టంగ్... ప్రణవనాదం వెలువడింది. దానినుండి అనురణన ధ్వనులు వెలువడతాయి. అలాగే ధన్యోపాఖ్యానం వైదికధర్మ మహార్థాన్ని బోధిస్తోంది.

దుర్యోధనుడు చేసిన యాగానికి వచ్చిన రాజులు ద్వారకలోని మహాసంపదను గురించి విన్నారు. వారికి అసహనం కలిగింది. కానీ అక్కడ శ్రీకృష్ణుడు ఉన్నాడు. ఆయన అజయ్యుడు. అయినా ఆ సంపదను ఒకసారి చూద్దామనుకున్నారు. అందరూ సైన్యాలతో కూడా ద్వారకకు తరలి వచ్చారు. రైవతక పర్వతం దగ్గర సైన్యాలను నిలిపి ద్వారకకు వచ్చి శ్రీకృష్ణుని సభామంటపాన్ని చేరారు. ఇదొక అంశం. చూడ్డానికి వచ్చినవారు సైన్యంతో రావడం ఎందుకు? సైన్యాన్ని తమ దేశాలకు పంపి తగు పరివారంతో రావచ్చును కదా! వారి లోపల ఏదో దుర్బుద్ధి ఉండవచ్చు. వీలు కలిగితే అందరూ కలిసి ద్వారకను కబళిస్తే యాదవులు, శ్రీకృష్ణుడు ఏం చేయగలరు. జరాసంధుడు, కాలయవనుడు వస్తే శ్రీకృష్ణుడు మధురను వీడి ద్వారకకు వెళ్ళిపోలేదా? ఇది వారి గుండెలోతుల్లో ఉండి ఉంటుంది. కవి చెప్పడు. కాని వారి ఆశ నెరవేరదని నారదుడు చెప్పిన విషయం వెల్లడి చేస్తుంది.

నారదుడు సముద్రతీరానికి వెళ్ళాడు. అక్కడొక తాబేలు ఉంది. అంత తాబేలును ఆయన అంతకుముందు చూడలేదు. నీవు ధన్యమైనదానవు అన్నాడు. అది తాను ధన్యురాలను కాదంది. గంగ ధన్యమైనది అంది. గంగ సముద్రం ధన్యమంది. సముద్రం భూమి ధన్యమంది. భూమి పర్వతాలు ధన్యాలంది. పర్వతాలు ప్రజాపతి ధన్యుడన్నాయి. ప్రజాపతి వేదాలు, ధన్యాలన్నాడు. వేదాలు, యజ్ఞాలు ధన్యాలన్నాయి. యజ్ఞాలు విష్ణువు ధన్యుడని చెప్పాయి. ఆ విష్ణువే శ్రీకృష్ణుడు. నారదుడామాటే సభలో రాజులకు చెప్పాడు.

శ్రీకృష్ణుడు దక్షిణలతో కూడిన యజ్ఞపురుషుడు అంటే తాను ధన్యుడను అని స్థిరం చేశాడు.

ఇంక రాజులు ద్వారకను ఏం చేయగలరు. వారు మౌనంగా అక్కడినుండి నిష్క్రమించారు.

ఈ ఇతిహాసంలో తాబేలు మొదలుకొని శ్రీకృష్ణుని వరకు వారెలా ధన్యులో హేతువులున్నాయి. తాబేలు నుండి యజ్ఞాలవరకు అవెలా ధన్యాలు కావో కూడా హేతువులు చెప్పారు. ఇలా దక్షిణతో కూడిన యజ్ఞపురుషుడు ధన్యుడని చివరికి నిర్ణయమయ్యింది.

విష్ణువు వ్యాపించినవాడు. ఆయన కనబడడు. యజ్ఞం కనబడుతుంది. దానివల్ల యజ్ఞపురుషుడు లభిస్తాడు.

యజ్ఞం ప్రతీకాత్మకం. దానిలో విష్ణువుకు అవయవాలైన దేవతలకు సమర్పణం ఉంటుంది. అది వారిద్వారా విష్ణువును చేరుతుంది. అందుకే యజ్ఞం విష్ణువు అని వేదం బోధిస్తుంది.

యజ్ఞంలో పశుహింస ఉందని కొందరి ఆక్షేపం.

ప్రపంచంలో మాంసం తినని వారెందరు? భారతదేశంలో బ్రాహ్మణులు, వైశ్యులు తప్ప అన్ని జాతులు మాంసం స్వీకరిస్తారు. ఇది కూడా పూర్వం మాట. ఇప్పుడు వారిలో కూడా కొందరు మాంసంతో కంపెనీలు తయారుచేసిన బర్గర్లు, పిజ్జాలు స్వీకరించడం లేదా?

అహింసను ప్రధానంగా బోధించే బౌద్ధులకు మాంసం నిషిద్ధం కాదు. యజ్ఞంలో పశుహింసను మాత్రమే వారు వ్యతిరేకిస్తారు. వారికి ఈశ్వరుడు లేడు. కనుక యజ్ఞంలో పశుసమర్పణం వ్యర్థమని వారి భావం కావచ్చు. శాకాహారులు తినే గింజలలో చైతన్యం లేదా? అవి తినడం హింస కాదా? ఔనని ధర్మవ్యాధోపాఖ్యానం నిర్ధారణ చేసింది. కాబట్టి వేదాన్ని విశ్వసించే ఆస్తికులు యజ్ఞపురుషునికి పశుసమర్పణాన్ని అంగీకరిస్తారు.

యజ్ఞం వల్ల కర్తకు, పశువుకూ పుణ్యలోకం ప్రాప్తిస్తుంది. చిత్తశుద్ధి కలుగుతుంది. కల్మషం పోతుంది. చిత్తం శుద్ధమయితే తత్త్వజ్ఞానం కలుగుతుంది. దానివల్ల మోక్షమే లభిస్తుంది.

యజ్ఞంలో యజమానుడు, తనకు ప్రతీకగా పశువును సమర్పిస్తున్నాడు. జీవుడు తనను యజ్ఞపురుషునికి సమర్పించుకోవడం యజ్ఞం. పూజలోని రహస్యమూ ఇదే. గంధ, పుష్ప, ధూప, దీప, నైవేద్య తాంబూలాల ద్వారా క్రమంగా భూమి, ఆకాశం, వాయువు, తేజస్సు, నీరు సర్వమూ సర్వేశ్వరునికి సాధకుడు సమర్పిస్తున్నాడు. కాబట్టి పూజ కూడా యజ్ఞం. ఆ యజ్ఞం చేయలేనివారు పూజ చేస్తున్నారు.

వేదం మనకు ప్రసాదించిన వరం యజ్ఞం. యజ్ఞపురుషుడు ధన్యుడు. యజ్ఞం మనకు ధన్యతనిస్తుంది.

“హతో యజ్ఞస్త్వదక్షిణః” దక్షిణలేని యజ్ఞము హతము. దక్షిణ భార్య. యజ్ఞం భర్త. దక్షిణతో కూడిన యజ్ఞం వల్ల ఇహలోకంలో ప్రయోజనాలు ప్రాచీనులు సాధించారు. దశరథుడు యజ్ఞంవల్ల హత్యాపాపం పోగొట్టుకున్నాడు. విష్ణువును కుమారునిగా పొందాడు. వసుదేవుడు యజ్ఞంచేసి ఋషులద్వారా తత్త్వజ్ఞానం పొందాడు. ఋషులు నైమిశారణ్యంలో సహస్ర సమ సత్రయాగం చేసి మహాభారతాది మహాగ్రంథాలను శ్రవణం చేశారు.

పూర్వము వృద్ధాప్యంలో తపోవనాలు చేరి యజ్ఞాలు చేసేవారు. గృహస్థులు పంచ యజ్ఞాలు చేసి జీవితం ధన్యం చేసుకునేవారు.

ఇలా యజ్ఞం ద్వారా స్వామిసామీప్యం పొందడం ద్వైతముక్తి. యజ్ఞం వల్ల చిత్తశుద్ధి ద్వారా జ్ఞానం పొంది స్వామితో సమైక్యం పొందడం అద్వైతముక్తి.

* * *

# ప్రాచీన భారతీయ యన్త్రవిజ్ఞానం

ఆధునిక కాలం యంత్రాలకు గని. వివిధ రంగాలలో వివిధ యంత్రాల వల్ల ప్రపంచంలో నాగరికత అత్యధిక వేగంగా అభివృద్ధి చెందుతోంది.

పూర్వకాలం భారతదేశంలో కొన్ని యంత్రాలను నిర్మించారని తెలుస్తోంది. వాటిని సంగ్రహంగా మనవి చేస్తాను.

## సూర్యసిద్ధాంతం

ఇది ప్రాచీన జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంతగ్రంథం. వరాహమిహిరుడు, ఆర్యభటుడు ప్రాచీన సూర్యసిద్ధాంతాన్ని సంశోధించి ప్రస్తుత రూపమును ఏర్పరిచారని పండితులు భావిస్తున్నారు. మొదట ఆర్యభట్టు క్రీ.శ. 476లో జన్మించాడు. వరాహమిహిరుడు క్రీ.పూ. 123 ప్రాంతంవాడని కొందరు, క్రీ.శ.665 ప్రాంతంవాడని మరికొందరు అభిప్రాయపడినారు. వారికి పూర్వ కాలానిది సూర్యసిద్ధాంతము అని మాత్రం చెప్పవచ్చు. సూర్యసిద్ధాంతంలో పదమూడవ అధ్యాయం జ్యోతిషోపనిషదధ్యాయం. దానిలో కాలాన్ని గ్రహించడానికుపయోగించే కొన్ని యంత్రాలను పేర్కొన్నారు. జ్యోతిషం కాలప్రధానమైనది కదా!

**శ్లో. కాలసంసాధనార్థాయ తథా యన్త్రాణి సాధయేత్**
**ఏకాకీ యోజయేద్ బీజం యన్త్రే విస్మయకారణమ్**

**సూర్యసిద్ధాన్తం-13 అ. 19, 20 శ్లో.**

కాలాన్ని బాగా సాధించడం కోసం యంత్రాలను తయారు చెయ్యాలి. ఏకాకిగా ఉండి ఈ యంత్రాలకు బీజం చేర్చాలి. అది ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ యంత్రం పని చెయ్యడానికి ఒంటరిగా ఉండి పాదరసం చేర్చాలని వ్యాఖ్యాత చెప్పారు.

**శ్లో. శఙ్కు యష్టి ధనుశ్చక్రై శ్ఛాయా యన్త్రై రనేకధా**
**గురూపదేశా ద్విజ్ఞేయం కాలజ్ఞాన మతన్ద్రితః**
**పారదారామ్బుసూత్రాణి శుల్వ తైల జలాని చ**
**బీజాని పాంసవస్తేషు ప్రయోగాస్తేపి దుర్లభాః**

**సూర్యసిద్ధాన్తం-13-20, 21, 22 శ్లో.**

శంకువు, యష్టి, ధనుస్సు, చక్రము, ఛాయ అనే పేర్లు గల యంత్రముల ద్వారా అనేక విధములుగా బద్ధకించకుండా గురూపదేశం వలన కాలజ్ఞానం పొందాలి.

లోపల ఇసుక ఉండి సన్నని రంధ్రం ద్వారా అది బయటకు జారి కాలాన్ని తెలిపేవి నర, వానరయంత్రాలు.

పాదరసం, అంబుసూత్రం, శుల్బం, నూనె, నీరు, ఇసుక అనే పదార్థాలనుపయోగించి ఈ యంత్రాలను తయారు చెయ్యాలి. ఇవి చేయడం చాలా కష్టం.

శంకువు, యష్టి, ధనువు ఇవి ఛాయాయంత్రాలు. సూర్యరశ్మిలో ఛాయను పరీక్షించి సమయం తెలుసుకోవడానికివి ఉపయోగిస్తాయి. వీటిలో శంకువు విషయం వివరించాలి.

పన్నెండంగుళాల శంకుచ్ఛాయ నుండి అక్షాంశ, నతాంశ, నతకాలం, దిక్కు మొదలయినవి తెలుసుకోవచ్చును. వీటిని గణించడానికి గుణకారాలతో, భాగహారాలతో క్లిష్టమయిన ప్రక్రియ ఉంది.

ధనుస్సు, చక్రయంత్రాలతో సమయజ్ఞానం సులభం. ఇవి రెండు పేర్లయినా ఇది ఒక యంత్రంగానే పరిగణించవచ్చును.

చక్రయంత్రంలో ఒక గుండ్రటిచక్రం, అంచున సమానమయిన దూరంలో గుర్తులు అంకెలను సూచిస్తాయి. దానిని అరవై భాగాలు చేస్తే

అవి అరవై ఘడియలను సూచిస్తాయి. ఆ చక్రం కేంద్రంలో ఇనుముతో గాని, ఇత్తడితో గాని ఒక పలుచని మేకు దింపాలి. ఆ చక్రం ఒక ఆధారంపై ఉండాలి. కేంద్రంలో మేకు ఆకాశంలో ధ్రువం ఉన్న దిక్కు సూచించాలి. ఈ యంత్రం ద్వారా సూర్యుని నతకాలం తెలిసికోవచ్చు. ధనుర్యంత్రాన్ని చాపం అని కూడా అంటారు.

చక్రంలో సగభాగం ధనుస్సు. దీనితో యంత్రాన్ని నిర్మిస్తే సూర్యుని నతకాలం వస్తుంది. నతమనే పదం ఖమధ్యం ద్వారా వెళ్ళే దక్షిణోత్తర లంబాంశ నుండి సూర్యుని కోణాత్మక దూరం తెలుపుతుంది.

జలయంత్రాలు, సైకత యంత్రాలు కూడా ఉన్నాయి. జలయంత్రానికి కపాలయంత్రమని పేరు. ఇది కపాలాకారంలో అర్ధగోళాకారంగా ఉంటుంది. దాని క్రిందభాగంలో చిన్న చిల్లు ఉంటుంది. దీనిని నీటిలో తేలేవిధంగా ఉంచితే లోపల నీరు ప్రవేశించి నీరు నిండాక మెల్లగా మునిగిపోతుంది. ఈ కపాలం ఒక రోజులో అరవైసార్లు నిండే పరిమాణంతో చిల్లు పరిమాణం ఉండాలి. ఒకసారి ఆ కపాలం నిండడానికి ఒక గడియ పడుతుంది. గడియ అంటే ఇరవై నాలుగు నిమిషాలు. గడియను సంస్కృతంలో ఘటీ అంటారు. అందుకే ఈ యంత్రానికి ఘటీయంత్రమని పేరు. ఆ పేరే గడియారంగా తరువాత మారింది.

ఈ యంత్రాలను పాదరసం, నూనె, నీరు మొదలైనవాని ద్వారా స్వతంత్రంగా కదిలేలా చేసేవారు. కపాలయంత్రాన్ని చెప్పిన శ్లోకమిది.

**శ్లో. తామ్రపాత్రమధశ్ఛిద్రం న్యస్తం కుమ్భే మలామ్భసి**
**షష్టి ర్మజ్జ త్యహోరాత్రే స్ఫుటం యన్త్రం కపాలకమ్**

**నరయంత్రం**

**శ్లో. నరయన్త్రం తథా సాధు దివా వా విమలే రవౌ**
**ఛాయా సంసాధనైః ప్రోక్తం కాలసాధనముత్తమమ్**

పగలు ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు నీడచేత కాలాన్ని సాధించవచ్చు. అదే నరయంత్రం.

**భూభగోల యన్త్రం :** భూ అంటే భూమి, భ అంటే ఆకాశం. భూమి, ఆకాశం గోళాకారంగా గోచరిస్తున్నాయి. ఖగోలంలోనే గ్రహాలు, నక్షత్రాలు ఉన్నాయి కదా!

**శ్లో. అభీష్టం పృథివీగోలం కారయిత్వా తు దారవం**
**దండం తన్మధ్యగం మేరో రుభయత్ర వినిర్గతమ్**

కర్రతో అభీష్టమయిన భూగోలాన్ని తయారు చెయ్యాలి. దానిమధ్య ఒక కర్రను పెట్టి రెండువైపులకు వచ్చేలా చెయ్యాలి. ఆ కర్ర కొనలు మేరువును తెలుపుతాయి. ఆ దండం ఆధారంగా చేసికొని కర్రతో చేసిన రెండు వృత్తాలు ఒకదానికొకటి సమకోణంగా ఉండాలి. ఆ రెండు వృత్తాల మధ్య విషువద్వృత్తం ఉండాలి. ఈ మూడు వృత్తాలను మూడు వందల అరవై అంశలుండేలా చేయాలి. వాటిని గుర్తించాలి. ఇలా ఈ భూభాగాల యంత్రరచన వర్ణన సాగింది. ఇది ఎల్లప్పుడూ తిరిగే ఏర్పాటు కూడా చెప్పారు.

**శ్లో. వస్త్రచ్ఛన్నం బహిశ్చాపి లోకాలోకేన వేష్టితమ్**
**అమృతస్రావయోగేన కాలభ్రమణసాధనమ్**
**తుంగబీజసమాయుక్తం గోలయన్త్రం ప్రసాధయేత్**
**గోప్యమేతత్ ప్రకాశోక్తం సర్వగమ్యం భవేదిహ.**

దృశ్యాదృశ్య గోళాల క్షితిజవృత్తం నిర్మించిన గోళంపై వస్త్రం కప్పి, గోళం తనంతట తాను తిరిగి నక్షత్రకాలాన్ని సూచించే రీతిగా నీటి ప్రవాహం ద్వారా ఏర్పాటు చేయాలి. పాదరసం ద్వారా కూడా చేయవచ్చును. ఇదంతా గురూపదేశం ద్వారా తెలుసుకొనే ఈ యంత్రరచన చేయాలి.

**సిద్ధాంతశిరోమణి**

దీనిని వ్రాసినవారు రెండవ భాస్కరాచార్యులు. ఈ గ్రంథం చాలా విస్తృతం. దీనిలో లీలావతి అనే గణితశాస్త్రం ఒక భాగం. బీజగణితం, గణితాధ్యాయం, గోళాధ్యాయం అని నాలుగు భాగాలున్నాయి. లీలావతి ప్రసిద్ధం. గోళాధ్యాయంలో అనేక యంత్రాలున్నాయి.

ఈ భాస్కరుడు శక సంవత్సరం 1036లో క్రీ.శ. 1114లో జన్మించాడు. తన ముప్పది యారవయేట సిద్ధాన్తశిరోమణి వ్రాశాడు. తన అరవై తొమ్మిదవయేట కరణకుతూహలమని మరో గ్రంథం రచించాడు.

**శ్లో. గోలం నాడీవలయం యష్టిః శఙ్కుః ఘటీచక్రమ్**
**చాపం తుర్యం ఫలకం ధీరేకం పారమార్థికం యన్త్రమ్**

గోళం, నాడీవలయం, యష్టి, శంకువు, ఘటి, చక్రం, చాపం, తుర్యం, ఫలకం అనే యంత్రాలు చెప్పి బుద్ధి ఒకటే పారమార్థికమయిన యంత్రమని చెప్పారు. వీటన్నిటికి లక్షణాలు, ఉపకరణాలు చెప్పారు. యష్టిసాధనము, యష్టిప్రయోజనం, యష్టియంత్రం, స్వయంవహ యంత్రాలు చెప్పారు. స్వయంవహం స్వయంగా కదలడానికి పాదరసం ఉపయోగించాలి.

ఆయుర్వేదంలో కూడా యంత్రాల వినియోగం ఉంది.

ఔషధాలను పాకం చేయడం కోసం ఉపయోగించే యంత్రం వాలుకాయంత్రం. ఇంకా దోలాయంత్రం, స్నేహనయంత్రం, విద్యాధర యంత్రం, చంద్రమూషాయంత్రం, భూధరయంత్రం, మూషాయంత్రం, వకయంత్రం, కవచీయంత్రం అనే యంత్రాలను అచట చెప్పారు. ఇవి వైద్యక రసేన్ద్రసార సంగ్రహంలో జారణాద్యధికారంలో చెప్పారు.

చికిత్స కుపయోగించేవి నూటొక్క యంత్రాలున్నాయి.

**గద్య. యన్త్రశత మేకోత్తర మత్ర హస్తమేవ ప్రధానతమం యన్త్రాణా మవగచ్ఛ, కిం కారణమ్? యస్మాద్ధస్తా దృతే యన్త్రాణా మప్రవృత్తిరేవ తదధీనత్వా ద్యన్త్ర కర్మణామ్.**

ఇక్కడ నూటొక్క యంత్రాలున్నాయి. వీటిలో చేయి ప్రధానం. చేయి లేకపోతే యంత్రాలుపయోగించవు. యంత్రకర్మలు చేతికధీనంలో ఉన్నవి.

స్వస్తిక యంత్రాలు, సందంశ యంత్రాలు, తాలయంత్రాలు, నాడీ యంత్రాలు, శలాకా యంత్రాలు, ఉపయంత్రాలు అని యంత్రాలు ఆరు విధాలు. వాటిలో స్వస్తిక యంత్రాలు ఇరవై నాలుగు. సందంశ యంత్రాలు రెండు. తాలయంత్రాలు రెండు. నాడీయంత్రాలు ఇరవై. శలాకాయంత్రాలు ఇరవై ఎనిమిది. ఉపయంత్రాలు ఇరవై ఐదు. మొత్తం నూటొకటి. ఇవి తరచుగా లోహాలతో తయారు చేస్తారు. లోహం లభించకపోతే ఇతరాలతో చేస్తారు. వీటి ముఖాలు తరచుగా క్రూరమృగ, మృగ, పక్షి ముఖాలను పోలి ఉంటాయి.

శాస్త్రం వల్ల, గురువు వల్ల, ఇతర యంత్రాలను చూడడం వల్ల, యుక్తి వల్ల వీటిని తయారు చెయ్యాలి. ఈ యంత్రాలు సమాహితంగా బాగా దృఢంగా, మంచిరూపంతో నునుపుగా పట్టుకొనుటకు వీలుగా ఉండాలి.

స్వస్తిక యంత్రాలు పద్దెనిమిది అంగుళాల ప్రమాణం కలవి. ఎముకలు, విరిగిన శల్యాలు పైకి తీయడానికి ఉపయోగిస్తాయి. సందంశ యంత్రాలు పదహారంగుళాలుంటాయి. అవి చర్మ, మాంసం, సిరలు, స్నాయువులతో ఉన్న శల్యాలను తీయడానికి ఉపయోగిస్తాయి.

తాలయంత్రాలు పన్నెండంగుళాలు. ఇవి చేపదౌడవలె ఉంటాయి. చెవి, ముక్కు నాడులు. వీటిలోని శల్యాలను తొలగించడాని కుపయోగిస్తాయి. నాడీయంత్రాలు అనేక విధాలు. వాటికి అనేక ప్రయోజనాలున్నాయి. ఒక

ముఖం కలవి. రెండువైపులా ముఖాలు కలవి. అవి ప్రవాహాదులలో గల శల్యాలను తొలగించగలవు. రోగాన్ని చూడడానికి, వైద్యక్రియాసౌకర్యం కోసం ఉపయోగిస్తాయి.

భగందరం, అర్శం, వస్తి, ఉత్తరవస్తి, మూత్రవృద్ధి, దకోదరం, ధూమ సన్నిరుద్ధం, గుదము వీనికి చికిత్స చేసే యంత్రాలు. అలాబు శృంగయంత్రాలు కూడా చెప్పారు.

శలాకా యంత్రాలు అనేక ప్రకారాలు. వీటికి అనేక ప్రయోజనాలున్నాయి. వీనికి పెసరబద్దంత ముఖం ఉంటుంది. స్రోతస్సులో శల్యాలను తీయడానికి ఉపకరిస్తాయి. ఆరుపత్తితో చేసిన ఉష్ణీషాలు ప్రమార్జనానికి ఉపయోగిస్తాయి. మూడు గరిటెలతో చేసినవి క్షారౌషధులను ఇవ్వడానికి వినియోగిస్తారు.

ఉపయంత్రాలు త్రాడు, వెదురు, పట్టు, నార, లత, వస్త్రాలతో తయారు చేస్తారు. ఇవి దేహమందంతట అవయవాల్లో, సంధులందు, ధమనులందు వాడతారు.

ఈ యంత్రాలతో చేసే కర్మలు ఇరవై నాలుగు ఉన్నాయి. శల్యచికిత్సలో అసంఖ్యేయమయిన వికల్పాలున్నందువల్ల బుద్ధిమంతుడు తన బుద్ధితో యోచించి కూడ వినియోగించవచ్చును.

అతిస్థూలం, అతిహ్రస్వం, అసారం, అతిదీర్ఘం, మృదుకీలం, మృదుముఖం, మృదుపాశం అనేవి యంత్రదోషాలు. ఈ దోషాలులేనివి, పద్దెనిమిది అంగుళాలు ఉన్నవి అయిన యంత్రాలను వైద్యుడు చికిత్సాకర్మలో ఉపయోగించాలి.

కనబడే శల్యాన్ని సింహముఖాదులతో ఉద్ధరించాలి. గూఢంగా ఉన్నదానిని కంకముఖాదులతో ఉద్ధరించాలి. వీటిలో కంకముఖం చాలా ప్రధానం. సుశ్రుతంలో సూత్రస్థానంలో వైద్యపరికర సంబంధమైన యంత్రాలు

చెప్పారు. దీనినిబట్టి శస్త్రచికిత్స భారతదేశంలో పూర్వం బాగా ఉందని తెలుస్తుంది.

**సమరాంగణ సూత్రధారం**

భోజమహారాజు ధారానగరాన్ని పాలించిన మేధావి, పండితుడు, కవి, బహుశాస్త్రజ్ఞుడు. 11వ శతాబ్దికి చెందిన ఇతడు అనేక కావ్యాలు, శాస్త్రగ్రంథాలు రచించాడు. వాటిలో సమరాంగణ సూత్రధారం వాస్తుశాస్త్ర గ్రంథం. దీనిలో 31వ అధ్యాయం యంత్రవిధానం. దీనిలో పలురకాల యంత్రాల విషయం ఉంది. ఇది వెయ్యి సంవత్సరాల వెనుక భారతీయ యంత్రజ్ఞానానికి గొప్ప నిదర్శనం.

ఈ యంత్రవిధానం ధర్మార్థ కామమోక్షాలకు నాల్గింటికి కారణమని కవి చెప్పాడు.

**శ్లో. యదృచ్ఛయా ప్రవృత్తాని భూతాని స్వేన వర్త్మనా**
**నియమ్యాస్మిన్ నయతి యద్ తద్ యన్త్రమితి కీర్తితమ్**

**భా :** భూమి, నీరు, అగ్ని, వాయువు యదృచ్ఛగా ప్రవర్తిస్తాయి. వాటిని నియమించి ప్రవర్తింపజేసేది అని యంత్రానికి ఒక నిర్వచనం.

**శ్లో. స్వరసేన ప్రవృత్తాని భూతాని స్వమనీషయా**
**కృతం యస్మాద్ యమయతి తద్వా యన్త్రమితి స్మృతమ్**

**భా :** పృథివ్యాది భూతాలు సహజ లక్షణాలచే ప్రవర్తిస్తాయి. వాటిని కర్త తన బుద్ధితో నియమించే సాధనం యంత్రం.

ఈ నిర్వచనాలచే ఈ యంత్రం దేవతారాధన సాధనం కాదని, ఆధునిక యంత్రాలవంటిదని తెలుస్తుంది.

ఈ యంత్రాలు తయారు చెయ్యడానికి భూమి, నీరు, అగ్ని, వాయువు అనే నాలుగు భూతాలు, వీటికి ఆశ్రయంగా ఆకాశం ఉపయోగపడతాయి.

ఈ నాలుగు భూతాలను కలపడం వల్ల అనేక భేదాలు కల యంత్రాలు తయారవుతాయి.

తనంతట తాను నడిచేవి, ఒకసారి ప్రేరేపిస్తే నడిచేవి, వేరొకటి వ్యవధానంగా ఉన్నా నడిచేవి, కొంచెం ఎడంగా ఉన్నా ప్రేరేపణ పొందేవి తయారవుతాయి. వీటిలో స్వయంగా నడిచేవి ఉత్కృష్టాలు.

దూరంగా ఉండేది, కనబడనిది, సమీపంలో ఉండేది నడిపించబడితే అది, ఒకటే పలు యంత్రాలను నడిపిస్తే అది ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

తన నడక, తన వాహనం నడక ఒక శిల్పమునందు ఆశ్చర్యంగా కనబడతాయి.

రెండు మూడు భూతాల లక్షణాల కలయికచే, నాలుగు భూతాల కలయికచే, ఒకదానికి ప్రాధాన్యం ఇచ్చి, మిగిలిన వాటిని అంగంగా చేయడం చేత అనేక యంత్రాలను సాధించవచ్చు.

ఈ విధానం బాగా తెలుసుకున్నవాడు స్త్రీలకు, రాజుకు, మేధావులకు ప్రియుడవుతాడు. అతనికి లాభం కీర్తి, గౌరవం, ధనం కలుగుతాయి.

ఇలాంటి యంత్రాల వల్ల ఇల్లు విలాసాలకు, ఆశ్చర్యాలకు, ఆనందానికి నెలవౌతుంది.

దేవతలు మొదలైనవారి రూపం, చేష్టలు చూపడం చేత స్త్రీలు సంతోషిస్తారు. వారికి సంతోషం కలిగించడం ధర్మమని పూర్వులు చెప్పారు. రాజు సంతోషించడం వల్ల ధనం లభిస్తుంది. ధనం వల్ల కోరికలు తీరతాయి. ధనం వల్ల ధర్మాచరణాదుల ద్వారా మోక్షం కూడా సంపాదించవచ్చు.

భూమి నుండి ఏర్పడిన వస్తువులతో ఈ యంత్రాలు చేయవచ్చు. నీటినుండి ఏర్పడిన వాటితో భూమికి సంబంధించిన వాటిని చేర్చి తయారు చేయవచ్చు. పార్థివ వస్తువులను తేజోద్రవ్యాదులతో వాయువు నుండి ఏర్పడిన

వాటితో తయారు చేయవచ్చు. నీటి పదార్థాలతో నీటి యంత్రాలను తయారు చేయవచ్చు. వాయువుతో వాయుయంత్రాలను చెయ్యాలి.

వాయువుతో నీటియంత్రాలను చేయవచ్చు. నీటివస్తువులతో, వాయువులతో, వహ్ని నుండి పుట్టిన వస్తువులతో ఈ యంత్రాలను చేయవచ్చు. వివిధ లేపనాలు, వివిధ చక్రాలు మొదలైనవి తయారు చేయవచ్చు.

ఇనుము, రాగి, ధ్వని గలవి, ప్రకాశించేవి, కర్ర, చర్మం, వస్త్రం ఈ యంత్రాలను చేయడానికి ఉపయోగపడతాయి.

అగ్నివలన తాపం, ఉత్తేజనం, జలసంగం వలన క్షోభ, భూద్రవ్యాలకు కలిగించడం వల్ల యంత్రాలు తయారు చేయవచ్చు. నీటిధార, జలభారం, నీటిని త్రిప్పడం, భూద్రవ్యాలు వీటితో యంత్రాలను తయారు చేయవచ్చు. నాలుగు భూతాలతో యంత్రాలు చేయవచ్చు. వీటిని సమగ్రంగా ఎవరు చెప్పగలరు?

భూపదార్థానికి చలనం లేదు. నీరు, అగ్ని, గాలి వీటికి సహజ చలనం ఉంది. భూపదార్థాలకు చలనం కలిగిస్తే వస్తుంది.

అతుకులు బాగా కలిసి ఉండడం, గమనంలో జారుపాటు లేకపోవడం, మన కోరికకు అనుగుణంగా నడవడం, లయతాళాలకు అనుగుణంగా నడవడం, అవసరమైన పని నెరవేర్చడం, పని చేయడం కోసం ఆకృతి మారినా మరల యథాతథంగా అవడం, దార్ఢ్యం, నునుపుదనం, చిరకాలం మన్నిక యంత్రవాహనాల గుణాలు.

ఒక వస్తువు చాలా వస్తువులను నడిపించుట, చాలా వస్తువులతో ఒకటి నడచుట యంత్రాలందు జరుగుతుంది.

అడ్డంగా, పైకి, క్రిందికి, ముందుకు, వెనుకకు, ప్రక్కలకు వెళ్ళుట ఒక యంత్రం గమనవిశేషాలు.

సుఖం, ప్రీతి, భయం కలిగించే శబ్దవిశేషాలు శబ్దానికి చెందినవి.

పాట, నృత్యం, వాద్యం, మురళి, మద్దెల, వీణ, తాళాలు మొదలైన శబ్దాలు కలిగించడం యంత్రం వల్ల ఏర్పడతాయి.

జాతికి అనుగుణమైన చేష్టలు, జాతికి విరుద్ధమైన చేష్టలు, ఆకాశంలో సంచరించడం, ఆకాశంలో ఎగిరే జీవులు భూమిపై నడవడం, మానవచేష్టలు, పలు విధాలైన కోరికలు, దేవతలు అసురులను జయించడం, సముద్రమథనం, జలధారలతో గృహాలు, హిరణ్యకశిపుని నృసింహస్వామి సంహరించడం, స్వయంగా నడిచే సేవక శిల్పాలు, అసత్యాలు సత్యంగా కన్పించడం యంత్రాలచే చేయవచ్చు.

అయిదు అంతస్థులు నిర్మించి, నేలపై ఉండే బొమ్మ ప్రతిజాముకి పైకి ఎక్కుతూ ఐదో అంతస్థులో శయ్యకు చేరడం, నీటిలో నిప్పు, నిప్పు మధ్య నీరు పైకి ఎగచిమ్మడం, నిశ్వాసంతో ఆకాశం చేరడం, శ్వాస పీలుస్తూ నేలకు రావడం, పాలసముద్రంలో పానుపు, ఒక గోళం సూర్యాదులకు ప్రదక్షిణంగా రాత్రింబవళ్ళు తిరగడం చేయవచ్చు.

ఏనుగుబొమ్మపై పురుషుడు ఓ ఘడియలో ఓ యోజనం చుట్టి రావడం, ఓ దీపంతో ఉన్న బొమ్మ తాలానుగుణంగా, ప్రదక్షిణంగా నృత్యం చేస్తూ దీపపాత్రలో నూనె అయిపోతే నూనె వెయ్యడం, ఎంత నీరు పోసినా తాగే ఏనుగుబొమ్మ, చిలుక మొదలైన పక్షులు తాళానుగుణంగా నృత్యం చేస్తూ మాట్లాడుతూ ఆశ్చర్యం కలిగించడం, బొమ్మ ఏనుగు, బొమ్మ గుర్రం తిరుగుతూ చేష్టలు చేస్తూ, తాలానుగుణంగా నృత్యం చేస్తూ మనస్సుల నాకర్షించడం, దివ్యమైన అశక్యమైన చేష్టలు చేయడం, వేణువు వాయించడం, పాటలు పాడడం చేయవచ్చు. మనుష్యశిల్పం చేతిలో కర్ర ఉంటుంది. ఇంటిద్వారం దగ్గర ఆ బొమ్మ కర్ర ఎత్తి ప్రవేశించే వారిని అడ్డం పెడుతుంది.

కత్తి, ముద్గరం, కుంతం అనే ఆయుధాలు కల మరబొమ్మ రాత్రి తెరిచి ఉన్న ద్వారంలో ప్రవేశించే దొంగలను చంపుతుంది. లక్క, సర్జరసం, మేకకొమ్ముల పొడి, అవిసె కరంజముల (కానుగు) నూనెతో కలిపి పూస్తే గోడలకు వజ్రలేపం చేసినట్లవుతుంది.

**శ్లో. స్తనయోర్యుగేన సృజతీ జలధారే తత్ర క్వాపి కార్యా స్త్రీ**
**ఆనన్దాశ్రులవానివ సలిలకణాన్ పక్ష్మభిః కాచిత్**

ఒక కాంత స్తనముల నుండి జలధార స్రవిస్తున్నట్లు శిల్పం చేయాలి. మరొక కాంత కన్నుల నుండి ఆనందబాష్పాలు విడుచుచున్నట్లు శిల్పించాలి.

ఇలా యంత్రాలతో, జలధారలతో చల్లగా ఉండే ధారాగృహాలు, సుఖసుందర గృహనిర్మాణాల గురించి భోజరాజు అనేకం చెప్పాడు. ఈ యంత్రాల నిర్మాణవిధాలను కొన్ని చెప్పాడు.

ఇంతకంటె లోకంలో చిత్రమేముంటుంది? ఇంతకంటె తుష్టి కౌతుకాన్ని కలిగించేదేముంటుంది? ఇలాంటి వస్తువులతో కూడిన భవనం కంటె కీర్తిని కలిగించేది, కోరిక తీర్చేది ఏది? ఇంతకంటె పుణ్యమయినది, పరితాపాన్ని తొలగించేది ఏముంటుంది? అని ఈ యంత్రాల వల్ల ప్రయోజనాలను భోజరాజు వెల్లడించాడు.

**భరద్వాజ మహర్షి వైమానికశాస్త్రం**

భరద్వాజుడు చరిత్రకందని కాలంలో ఉన్న మహర్షి. ఒక భరద్వాజుడు మూడువందల సంవత్సరాలు వేదాధ్యయనం చేశాడు. వేదంలో, బ్రాహ్మణంలో ఉంది. శ్రీమద్రామాయణంలో ఓ భరద్వాజముని ఉన్నాడు. ఆయన సైన్యసమేతంగా భరతునికి విందు ఇచ్చాడు. ఓ ముని అంతమందికి అంత గొప్ప విందు ఎలా ఇవ్వగలిగాడనేది ఓ గొప్ప వింత. అది తపోబలమని చెప్పారు.

భరద్వాజ మహర్షి పేర వైమానికశాస్త్రం ఉంది. ఇది ఆయన వ్రాసిన యంత్రసర్వస్వమనే ఉద్గ్రంథంలో భాగం. శ్రీమద్రామాయణంలో పుష్పక విమానముంది. పుష్పకం ఒక రకమైన విమానం పేరు. అప్పటికే ఈ వైమానికశాస్త్రం రచించారేమో!

ఈ వైమానికశాస్త్రంలో పలు గ్రంథాలను పేర్కొన్నారు. వానిలో అధికభాగం విజ్ఞానశాస్త్ర గ్రంథాలు.

భరద్వాజుని యంత్రసర్వస్వం, నారాయణుడు వ్రాసిన విమాన చంద్రిక, దుండినాథుడు రచించిన వ్యోమయానార్క ప్రకాశము, శౌనకుని వ్యోమయాన తంత్రము, చక్రాయణుని ఖేటయాన ప్రదీపిక, వాచస్పతియాన బిందువు, గర్గమహర్షి యంత్రకల్పనం, బోధాయనుని ధాతుసర్వస్వం, లల్లుని యంత్ర కల్పతరువు, భరద్వాజుని ఆకాశతంత్రము, శాకటాయనుని లోహశాస్త్రం, ఛాయాపురుషశాస్త్రం, అత్రిముని లోహకల్పం, లల్లుని భస్త్రికాశాస్త్రం, లల్లుని సంధానపటలం, దర్పణ నిర్ణయం, లోహప్రకరణం, దర్పణశాస్త్రం, లోహసర్వస్వం, యంత్ర ప్రకరణం, పటప్రదీపిక, క్షీరపటకల్పం, ఖేటవిలాసం, లోహతత్త్వ ప్రకరణం, దర్పణ ప్రకరణం, ఖేతు సర్వస్వం, ద్రావక ప్రకరణం, ఖేటయంత్రం, లోహరత్నాకరం, మూషకల్పం, భస్త్రికా నిబంధనం, దర్పణకల్పం, లోహాధికరణం, లోహరహస్యం, తైలప్రకరణం, ఖేట సంగ్రహం, ఇవి విమాన నిర్మాణానికి చెందిన గ్రంథాలు. కాని ఇవన్నీ ఇపుడేమైపోయినవో తెలియదు.

ఈ వైమానికశాస్త్రంలో కూర్మకుండం, మండూకకుండం, మూషాకుండం మొదలైన ముప్పై కుండాలను పేర్కొన్నారు.

చంచూపుటమూష, పూర్ణమూష, పద్మముఖమూష మొదలైన ఇరవై రెండు మూషలను పేర్కొన్నారు.

కూర్మభస్త్రిక, శ్రీ ముఖీభస్త్రిక, అంతర్ముఖ భస్త్రిక మొదలైన ఇరవై భస్త్రికలను పేర్కొన్నారు.

గర్భతాపన యంత్రం, పాచక యంత్రం, పాకఘాత యంత్రం, వటగర్భక్రియాయంత్రం, వాతచోదనా యంత్రం, ఊష్మక యంత్రం, నాళస్తంభ యంత్రం, వాతాకర్షణ యంత్రం, పీఠయంత్రం, ధూమోద్గమన యంత్రం, శుండల యంత్రం, భస్త్రికాముఖ యంత్రం, ద్రవాకర్షణ యంత్రం, నిర్యాసపాక యంత్రం, రశ్మ్యాకర్షణనాళయంత్రం, తంత్రీసంధాన చక్రం, కీలిచాలన యంత్రం, ద్రవాహరణ యంత్రం, యంత్రఫేనకర యంత్రం, కుట్టిణీ యంత్రం, అంతర్ముఖ యంత్రం, తాపన యంత్రం, తైలాహరణ యంత్రం అని ఇరవై ఐదు యంత్రాలను పేర్కొన్నారు. ఇవన్నీ యంత్రాలు కనుక పేర్లన్నీ పేర్కొన్నాను. ఈ యంత్రాలన్నీ సంధానం చేసి విమానం చేసేవారని పేర్లనుబట్టి తెలుస్తుంది. తర్వాత వీటి ఉపయోగాలను చెప్పారు.

విమాన నిర్మాణంలో విశ్వక్రియాదర్పణం, శక్త్యాకర్షణదర్పణం, ద్విముఖ దర్పణం మొదలైన ముప్పదిరెండు దర్పణాలనుపయోగించారు.

## విమానం తయారీలో ఉపాంగ యంత్రాలు

పరివేష క్రియాయంత్రం, సంధాన కీలకయంత్రం, అంగోపాంగ సంహారయంత్రం, విస్తృతాంశ యంత్రం, వైరూప్య దర్పణ యంత్రం, పద్మచక్రముఖి, కుంఠిణీశక్తి యంత్రం, పుష్పిణీయంత్రం, పింజులాదర్శ యంత్రం, గుహాగర్భాదర్శ యంత్రం, తమోయంత్రం, పందవాతస్కందనాళ కీలకయంత్రం, విద్యుద్ద్వాదశక యంత్రం, శబ్దముఖ కేంద్రయంత్రం, శబ్దోపసంహార యంత్రం, ప్రాణకుండలినీయంత్రం, శక్త్యుద్గమ యంత్రం, శక్తి ప్రసారణ యంత్రం, పటప్రసారణ యంత్రం, దిశాంపతి యంత్రం, పట్టికాభ్రక యంత్రం, సూర్యశక్త్యపకర్షణ యంత్రం, అపస్మారధూమ ప్రసారణ యంత్రం అని 29 ఉపయంత్రాలను పేర్కొన్నారు.

దీనిలో పేషణి, శృవాంగం, పద్మపత్రపాత్ర, శక్తిపూరుపాత్ర, తైలపాత్ర, కీలములు, శంఖములు, తంత్రులు అనే వస్తువులను వినియోగించారు.

విశ్వక్రియాదర్పణం, శక్త్యాకర్షణ దర్పణం, వైరూప్య దర్పణం, ప్రతిబింబార్క కిరణాకర్షణ దర్పణం, సూర్యశక్త్యాకర్షణ దర్పణం మొదలైన ఇరవై దర్పణాలను చెప్పారు.

సోమకలోహం, సౌండాలికలోహం, మౌర్త్వికలోహం, ఉష్ణం భరలోహం మొదలైన నలభై లోహాలను ప్రస్తావించారు.

యంతృత్వాధికరణం, వేగాధికరణం, స్తంభనాధికరణం, దిఙ్నిర్ణయాధికరణం మొదలైనవి అధికరణాల పేర్లు. ఇవి విమాన విషయాలలో అవసరమైన అనేకాంశాలను తెలుపుతున్నాయి.

ఈ వైమానికశాస్త్రం వ్రాసినవాడు ఋషి అవడంచేత విమాన మధిష్ఠించినవాడు బ్రహ్మపదం పొందుతాడని చమత్కారంగా చెప్పాడు. విమానశబ్దం చేత ప్రణవం చెప్పితే ప్రణవాన్ని ధ్యానించడంతో పరబ్రహ్మను పొందుతాడని భావం. విమానంలో ప్రయాణించి బ్రహ్మలోకాన్ని చేరవచ్చని ప్రకృతార్థం.

ఈ విషయం వ్యాఖ్యాత బోధానందయతి చెప్పారు.

**శ్లో. యద్విమానగతాస్సర్వే యాన్తి బ్రహ్మ పరంపదమ్**

అని భరద్వాజ వాక్యం.

**శ్లో. వాచకః ప్రణవో హ్యత్ర విమాన ఇతి వర్ణితః**

అని వ్యాఖ్యాత వచనం.

**సూ. వేగసామ్యా ద్విమానోండజానామితి**

గ్రద్ధ మొదలైనవి వేగంగా ఎగరడంచే విమానానికి వాటితో పోలిక ఉంది.

**శ్లో. పృథివ్యప్స్వన్తరిక్షేషు ఖగవత్ వేగవత్ స్వయమ్**
**యస్సమర్థో భవే ద్గన్తుం స విమాన ఇతి స్మృతః**

భూమి, నీరు, అంతరిక్షములందు పక్షివలె వేగంగా, స్వయంగా వెళ్ళడానికి సమర్థమయినదని నారాయణుడు నిర్వచించాడు. ఇలా భూమి, నీరు, అంతరిక్షాల్లో వెళ్ళే విమానం పేరు త్రిపుర. దీనిని తర్వాత వివరించారు.

భరద్వాజుడు పూర్వాచార్యులు రచించిన శాస్త్రాలన్నింటిని చూసి సర్వలోకోపకారం కోసం వేదముల సారరూపమైన విమానశాస్త్రాన్ని ఐదువందల సూత్రాలలో వంద అధికరణాలతో ఎనిమిది అధ్యాయాలతో రచించాడు. ఇది రహస్యంగా ఉంది. ఇది లోకాలను అనుసంధానం చేస్తుంది. 'జగతా మతిసంధానకారణమ్' ఇతర లోకాలకు కూడా దీనిలో వెళ్ళవచ్చును అని కవి అభిప్రాయం.

**శ్లో. దేశాద్దేశాన్తరం తద్వద్ ద్వీపాద్ ద్వీపాన్తరం తథా**
**లోకాల్లోకాన్తరఞ్చాపి యోఽమ్బరే గన్తు మర్హతి**
**స విమాన ఇతి ప్రోక్తో ఖేటశాస్త్రవిదాంవరైః 49 శ్లో.**

ఒక దేశాన్నుండి మరొక దేశం, ఒక ద్వీపాన్నుండి మరొక ద్వీపం, ఒక లోకాన్నుండి మరొక లోకం వెళ్ళడానికి సామర్థ్యం కలది విమానమని ఖేటశాస్త్రజ్ఞులు చెప్పారు. విమానాన్ని నడిపే విద్యలో ముప్పది రెండు రహస్యాలున్నాయి.

మాంత్రికం, తాంత్రికం, కృతకం, అంతరాళకం, గూఢం, దృశ్యం, అదృశ్యం, పరోక్షం, అపరోక్షం మొదలైనవా రహస్యాలు.

ఈ విమానం నడిపేవారికి అయిదు మార్గాలు తెలియాలి. 1) రేఖ 2) మండలం 3) కక్ష్య 4) శక్తి 5) కేంద్రం.

పైన పేర్కొన్న అయిదు మార్గాలలో ఏవి ఏ లోకానికి వెళ్ళడానికి ఉపయోగపడతాయో చెప్పారు.

పథంలో ఆవర్తనాలు అయిదున్నాయి. అవి విమానాలను ధ్వంసం చేస్తాయి. రేఖాపథంలో శక్త్యావర్తనం, మండలమార్గంలో వాతావర్తనం, కక్ష్యామార్గంలో కిరణావర్తనం, శక్తిపథంలో శైత్యావర్తనం, కేంద్రమార్గంలో ఘర్షణావర్తనం.

ముప్పది రెండు రహస్యాలను, అయిదు మార్గాలను, ఆవర్తనాలను తెలిసినవాడు ఈ శాస్త్రానికి అధికారి.

విశ్వక్రియాదర్పణ స్థానం మొదలుకొని విమానంలో స్థానాలు ముప్పది యొకటి. అవి విశ్వక్రియాదర్పణ స్థానం, శక్త్యాకర్షణ స్థానం, పరివేష స్థానం మొదలైనవి.

విమానచోదకులు ఋతుభేదాన్ని బట్టి వేర్వేరు వస్త్రాలు ధరించాలి. ఆ వస్త్రాలను తయారుచేసే పద్ధతినిక్కడ చెప్పారు.

విమానచోదకులు తీసికొనదగిన ప్రత్యేకాహారాలను పేర్కొన్నారు. ఋతువులకు చెందిన విషశక్తులను తెలిపి, ప్రత్యేక భోజన కాలాలను పేర్కొన్నారు. ఆహారం లేనప్పుడు బలాన్నిచ్చే గుళికలను తీసుకోవాలని తెలిపారు.

బరువు ఎక్కువలేని ఊష్మపలోహాలను విమాననిర్మాణంలో వాడాలి. శౌనకమహర్షి సౌమ, సౌండాల, మౌర్త్వికములనే లోహాలను విమాన నిర్మాణానికి వినియోగించాలని చెప్పారు. వీటి సమ్మేళనం వల్ల ఊష్మప లోహాలు పదహారు రకాలు అవుతాయి. అవి ఉష్ణంభర, ఉష్ణప, ఉష్ణహన మొదలైనవి.

భూగర్భంలో ఖనిజం పొరలున్నాయి. వాటిలో ఏడవ పొరలో మూడవ పొరలో ఉన్న సౌమ్యజాతులు ముప్పది ఎనిమిది. వాటిలో మూడు ఊష్మపలోహం తయారుచేయడంలో ముఖ్యములు. వాటి పేర్లను, సామర్థ్యాలను కూడ మునులు పేర్కొన్నారు.

ఈ లోహాలను శుద్ధి చేయాలి. శోధించే పద్ధతి సంస్కారదర్పణంలో ఉంది. ఈ లోహాలను కరిగించి, మేళనం చేసి విమాన నిర్మాణానికి కావలసిన లోహాలను తయారు చెయ్యాలి. వీటిని కరిగించడానికి ప్రత్యేకమయిన కుండాలను చెప్పారు. దీనికోసం ప్రత్యేకమయిన భస్త్రికలను తెలిపారు. ఆ భస్త్రికల నిర్మాణం గురించి కూడా వర్ణించారు.

విమాన నిర్మాణంలో వాడే దర్పణాలు ఏడు రకాలు. విశ్వక్రియాదర్పణం, శక్త్యాకర్షణం మొదలైనవి.

విమానయానానికి ఏడు శక్తులవసరం. వాటిలో తుందిలశక్తిచే విమానం ఎగురుతుంది. పంజరాశక్తివల్ల విమానం క్రిందకు దిగుతుంది. ఉష్ణశక్త్యపకర్షణం వల్ల విమానం సూర్యకిరణాలలో ఉష్ణమును గ్రహిస్తుంది. ఇలా అన్ని శక్తులకు వినియోగం ఉంది.

విమానం చిత్ర విచిత్రమయిన నడకలు పన్నెండు రకాలు. వాటిని విద్యుచ్ఛక్తులు కలిగిస్తాయి. చలనం, కంపనం, ఊర్ధ్వం, అధరం, మండలం, వేగం, అనులోమం, తిర్యఞ్చం, పరాఙ్ముఖం, స్తంభనం, చిత్రం ఆ పన్నెండు శక్తులు.

విమానయానానికి ఉపయంత్రాలవసరం. ఇవి ముప్పయి రెండు పనులను నిర్వహిస్తాయి. అవి విశ్వక్రియాదర్శం, శక్త్యాకర్షణ యంత్రం, పరివేషక్రియా యంత్రం మొదలైనవి.

విమానంలో ఉపయోగించే మణులు శిరోమణులు. అవి నూట మూడు. వీటిని విమానానికి పైన అంటే శిరః కేంద్రంలో పెట్టాలి.

విద్యుత్తంత్రీ ముఖాన్నుండి తంత్రులను మూలములో స్థాపించాలి. శక్తిసంధానకీలకాలు ఇరవై ఐదు. వాటిలో పింజుశీకం, క్రీరణకం, డింభకం మొదలైనవి సంధానకీలకాలు. వీటిలో సూర్యాంశుసంధాన కీలకాలున్నాయి.

సూర్యాది గ్రహాలకు చార, అతిచార, వక్ర, అతివక్ర అనే సంచారాలున్నాయి. వీటిచే మేషాది రాశులందు గల శక్తుల సంమథనం జరుగుతుంది. దీనివల్ల ఆకాశమందలి తరంగాల శక్తికి ఉద్రేకం కలుగుతుంది. ఆ రెండింటి సంఘర్షణం వల్ల అగ్నిజ్వాల ప్రవాహం వంటి ప్రభావం ఏర్పడుతుంది. దీనివల్ల విమానం మండే అవకాశం ఉంది. అలా జరుగకుండా అంగోపసంహార యంత్రం వినియోగించాలి. ఆ యంత్రనిర్మాణం చెప్పారు.

విమాననాశనం కోసం ప్రయత్నించే శత్రువులకు శరీరం విరూపంగా చేసే యంత్రం వైరూప్యదర్పణ యంత్రం. పద్మముఖ యంత్రం ఆకాశంలో ప్రచండ వాయువు వల్ల కలిగే ముప్పును తప్పిస్తుంది. కుంటిణీయంత్రం గ్రీష్మకిరణాల వల్ల విమానం భస్మం కాకుండా కాపాడుతుంది. వసంత, గ్రీష్మకాలాలలో విమానంలో వారికి సుఖశైత్యోపచారానికి పుష్పిణీయంత్రం ఉపకరిస్తుంది.

రెండు వాయువుల ఆవర్తంలో సూర్యకిరణాల ప్రసారం వల్ల వజ్రం వంటి సూర్యాతపం కలుగుతుంది. ఆ అపాయం తొలగడానికి పింజుళాదర్శం వాడాలి.

విమానంలో పొగ వ్యాపించినపుడు దానిని బయటకు పంపడానికి నాశపంచకం అవసరం.

విమానం నాశం చెయ్యడానికి శత్రువులు మహాగోళం, అగ్నిగర్భం మొదలైన యంత్రాలను ఉంచుతారు. వాటిని ముందే కనుగొనడానికి గుహాగర్భాదర్శ యంత్రం ఉపయోగిస్తుంది.

ఇలా శత్రువుల వల్ల, వాతావరణం వల్ల కలిగే ప్రమాదాల నుండి తప్పించుకోడానికి ఇంకా యంత్రాలు చెప్పారు. సూర్యకిరణాలలో

ఉన్న విద్యుత్సమూహాలు విడిపోవడం వల్ల ఏర్పడే అజగర శక్తివల్ల విమానం ఆగిపోతుంది. దాన్ని నివారించడానికి విద్యుద్ద్వాదశ యంత్రం అవసరం.

ధూమ విద్యుద్వాత శక్తులను ప్రసరింపజేసి విమానం నడుపుటకు, ప్రేరేపించుటకు, స్తంభింపజేయుటకు, విచిత్రంగా నడపడానికి, అడ్డదిడ్డంగా నడపడానికి ఉపయోగించేది ప్రాణకుండలినీ యంత్రం.

మంచు వల్ల ఏమీ కనబడని స్థితివచ్చి దానిచే ప్రాణహాని కలుగుతుంది. ఆ అపాయం తప్పించడానికి శక్త్యుద్గమన యంత్రాన్ని విమానం నాభికేంద్రంలో స్థాపించాలి.

విమానంపై పిడుగు పడకుండా ఉండడానికి శిరఃకీలక యంత్రం నెలకొల్పాలి.

ఇరవై నాలుగు మైళ్ళ దూరం లోపల పక్షుల వల్ల గాని, మనుష్యులు, యంత్రాల ద్వారా గాని కలిగే శబ్దాలు గ్రహించడానికి శబ్దాకర్షణ యంత్రం నెలకొల్పాలి.

అన్ని దిక్కులకు విమానం వెళ్ళడానికి, అపాయ నివారణానికి, ఉపాయం తెలియడానికి సాంకేతిక జ్ఞానం కొరకు పటప్రావరణ యంత్రం విమాన భుజభాగంలో అమర్చాలి.

ప్రయాణ సమయంలో ఆకాశంలోని గాలుల వల్ల కలిగే అనారోగ్య నివారణానికి దిశాంపతి యంత్రం స్థాపించాలి. గ్రహముల సంధులలో కలిగిన జ్వాలాముఖం నాశం చెయ్యడానికి పట్టికాభ్రకయంత్రం ఉంచాలి.

త్రేతాయుగంలో మంత్ర ప్రభావం, ద్వాపరయుగంలో తంత్ర ప్రభావం, కలియుగంలో కృతకత్వం కలిగిన విమానాలు ఏర్పడ్డాయి. త్రేతాయుగంలో పుష్పకవిమానం మంత్రప్రభావం కలది.

అంతరిక్ష విమాన విషయాలు చెప్పేవి ఆరు శాస్త్రాలున్నాయి. త్రేతాయుగంలో ఇరవై ఐదు రకాల విమానాలున్నాయి. అవి పుష్పకం, అజముఖం, భ్రాజస్వత్తు మొదలైనవి. ద్వాపరయుగంలో తాంత్రిక విమానాలు ఏబదియారు. అవి భైరవం, వటుకం, నందకం మొదలైనవి. కలియుగంలో కృతక విమానాలు ఇరవై అయిదు. శకునం, సుందరం, రుక్మమండలం మొదలైనవి. వీటి నిర్మాణానికి రాజలోహం ప్రశస్తం.

ఈ విమానాలను చతురస్రంగా గాని, వర్తులంగా గాని, డోలాకారంగా గాని నిర్మించాలి. వీటికి మధ్యలో హాటకాస్య లోహంతో నాళస్తంభం ఏర్పరచాలి. ఇక్కడ హాటకాస్య లోహనిర్మాణం చెప్పారు.

వీటికి పీఠం, చక్రాలు, గోపురం, గవాక్షశిఖరం, చతురౌష్మక యంత్రాలు, రెక్కలు, తోక, వాతాకర్షణ యంత్రం, దీపచుల్లి, తైలపాత్ర, వాతనాళం ఉంటాయి. వీటితో శకున విమానం తయారు చెయ్యాలి.

ఇలా కృతక విమానాలను చెప్పి త్రిపుర విమానం గురించి చెప్పారు. దీనికి మూడు ఆవరణాలుంటాయి. కనుక త్రిపురమని దీనికి పేరు. ఇది నేలమీద, నీటిమీద, అంతరిక్షంలోను ప్రయాణం చేయగలదు. దీనిలో ప్రథమభాగం నేలమీద, రెండవ భాగం నీటిపైన మూడవ భాగం అంతరిక్షంలోను ప్రయాణం చేస్తుంది. దీన్ని ఋగ్వేదంలో ఆశ్వినసూక్తంలో పేర్కొన్నారు. ఈ విమానాన్ని త్రినేత్రలోహంతో తయారు చెయ్యాలి. దీనికి శుద్ధి చేసిన అభ్రకంతో ఆవరణం ఏర్పాటు చేయాలి.

**శ్లో. అత్యన్త లఘ్వచ్ఛేద్య మదాహ్యం నాశవర్జితమ్**
**భవేచ్ఛుద్ధాభ్రకం తేన విమానం కారయేద్దృఢమ్**

శుద్ధి చేసిన అభ్రకం మిక్కిలి తేలికగా నరుకబడక, తగులబడక, నాశం కాకుండా ఉంటుంది. దీనితో దృఢమైన విమానం తయారు చెయ్యాలి. దీనికి ప్రథమావరణం కంటె ద్వితీయావరణం చిన్నదిగా ఉండాలి.

భరద్వాజ మహర్షి వ్రాసిన మహాగ్రంథం యంత్రసర్వస్వం. దానిలోని భాగం ఈ వైమానిక ప్రకరణం. దీనినే వైమానిక శాస్త్రమని పిలుస్తున్నారు. యంత్ర సర్వస్వంలో మరెన్ని మహాయంత్రాలున్నాయో! ఇలాంటి మహాగ్రంథాలెన్ని నశించాయో! 1193లో బఖ్తియార్ ఖిల్జీ బీహార్‌లోని నలందా విశ్వవిద్యాలయం నాశం చేసినప్పుడు కోటి పదిలక్షల తాళపత్ర గ్రంథాలు తగులబెట్టాడని చెప్తున్నారు. వాటిలో ఇలాంటి మహాగ్రంథాలెన్ని ఉన్నాయో!

ఈ వైమానిక శాస్త్రం చూసిన ప్రముఖుల అభిప్రాయాలివి. వేద, పురాణాల్లో చెప్తున్న వైజ్ఞానిక విషయాలు ఊహలు మాత్రమే అనే అభిప్రాయం నాకు మొదట్లో ఉండేది. ఈ వైమానిక శాస్త్రం చూసిన పిమ్మట ఆశ్చర్యం, ఆనందం కలుగుతున్నవి. అయితే దీనిపై సమగ్ర పరిశోధన జరగాలి.

**శ్రీ మాధవన్ నాయర్**

చైర్మన్, భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ

"వేదములు విజ్ఞాన భాండాగారాలనే సత్యం ఈ గ్రంథం నిరూపించుచున్నది. మన మహర్షులద్భుత వైజ్ఞానికులనడానికి ఇదే తార్కాణం. నేడున్న సైన్సు పరిధిలో ఈ గ్రంథంపై 100 పిహెచ్.డి.లు చేయవచ్చు.

**శ్రీ స్వతంత్ర కుమార్**

వైస్-ఛాన్సలర్, గురుకుల విశ్వవిద్యాలయం, హరిద్వార్

* * *

# వైమానిక శాస్త్ర పరిచయం

భరద్వాజ మహర్షి రచించిన ఉద్గ్రంథం యంత్రసర్వస్వం. ఇది త్రయీహృదయ సందోహసారరూపం అని వ్యాఖ్యాత చెప్పారు. దానిలో ఒక భాగం విమానశాస్త్రం. దానిలో ప్రతి ప్రకరణంలోను యంత్ర సర్వస్వంలోని ఇతర గ్రంథాలను, ఇతర గ్రంథకర్తల గ్రంథాలను పేర్కొని వాటిద్వారా విమాన నిర్మాణానికి ఉపయోగించే అనేక భాగాలను చేయమని చెబుతారు. అంటే సమగ్ర గ్రంథం కాదన్నమాట. గ్రంథంలో అనేక సంకేతపదాలు, ఇప్పుడు మనకు వాడుకలో లేని వస్తువులు, నిఘంటువులలో లభించనివి ఉండడం వల్ల గురుముఖంగా చదివితే తప్ప ఈ గ్రంథం పూర్తిగా అర్థం కాదు.

కాని శ్రీరాముడు పుష్పకంపై ప్రయాణం చేశాడు. దీనిలో పుష్పకం గురించి ఉంది. వేదంలో నీటిలోను, అంతరిక్షం లోను, నేలపైన నడిచే రథాలున్నాయి. దీనిలో దానికి సుమారుగా సమానంగా ఉండే త్రిపుర విమానముంది. భారతంలో వసుమహారాజు విమానం, భాగవతంలో సౌభ విమానం ఉన్నాయి. త్రేత, ద్వాపర యుగాలలో విమానాల గురించి ఈ గ్రంథంలో కొన్ని వివరాలున్నాయి.

రైటు సోదరులు విమానం నడపడానికి పూర్వమే బొంబాయిలో శివశంకర్ బాపూజీ తలపడే 1895లో విమానం తయారు చేసి ఆకాశంలో ఎగిరేలా చేశాడు. ఈయన సంస్కృతాంగ్ల భాషలలో నిష్ణాతుడు. బాంబాయి జె.జె. స్కూలు ఆఫ్ ఆర్ట్సులో లెక్చరర్.

1913 శివకర్ ప్రాచీన విమాన విద్యేబా శోధ అనే మరాఠీగ్రంథం వ్రాశారు. వారు భారతదేశీయ విజ్ఞానంతో విమానం నిర్మించారు. దీని పేరు మరుత్సఖ. బొంబాయి టౌనుహాలులో దీనిని ప్రదర్శించారు. పాదరసం, సౌరశక్తి ఇంధనాలుగా వినియోగించారు. బొంబాయిలోని చౌపాటి సముద్ర

తీరంలో ప్రయోగించి చూపారు. 1500 అడుగుల ఎత్తు ఎగిరి క్షేమంగా భూమిపైకి దిగింది. సౌరశక్తి వినియోగం ఈ విమానశాస్త్రంలో ఉంది.

బరోడా యువరాజు సాయిజీరావు గైక్వాడ్, న్యాయవేత్త మహదేవ గోవిందరానడే, వాణిజ్యవేత్త లాల్జీ నారాయణజీ మొదలయిన ప్రముఖులు దానిని చూశారు. తరువాత ఈయన మరణించడంతో ఈ ప్రయోగం ఆగిపోయింది.

వీరి వారసులు ఈ విమానాన్ని బ్రిటిష్ కంపెనీకి అమ్మివేశారు. ఈ విషయం లోకమాన్య తిలక్‌గారివల్ల లోకానికి తెలిసింది. 1950లో శిల్పసంస్కార అనే పత్రిక వేదాలలో విమానశాస్త్ర వివరాలను ధారావాహికంగా ప్రచురించింది. 1956లో జనవరి 8వ తేదీన త్రిపుర విమానం రేఖాచిత్రాలను ప్రచురించింది. ఈ విమానం భూమిపైన, గాలిలో కూడా సంచరించగలదని తెలిపింది.

ఈ ఉపోద్ఘాతం ఈ విమానశాస్త్రం ప్రయోజనకరము, మన ప్రాచీన గ్రంథాలలో పేర్కొన్న విమానప్రయాణం సత్యమే.

కాని విదేశీయులు దాడి చేసినపుడు నలందా విశ్వవిద్యాలయంలో అసంఖ్యాకమయిన గ్రంథాలు తగులబెట్టారు. పాశ్చాత్యులు విలువైన అనేక గ్రంథాలు పట్టుకు పోయారు. మనకు గురుశిష్య పరంపరలో ఈ గ్రంథాన్ని అధ్యయనం చేయడం ఎప్పుడో ఆగిపోయింది.

కాబట్టి దీనిలో ఉండే మహావిషయాలను మనం ఉపయోగించేవిగా అర్థం చేసుకోవాలంటే ఆధునిక విమాన నిర్మాణం అధ్యయనం చేసినవారు, సంస్కృత పండితులు కలిసి ఈ గ్రంథం అధ్యయనం చేస్తే ఈ గ్రంథం తెలిపిన అనేక విషయాలు ఇప్పటికి కొత్తగా ఉండేవిగా వెలుగులోకి రావడమే కాక, ప్రాచీన భారతీయుల ప్రతిభ కూడా తెలుస్తుంది. మనకు ఆత్మవిశ్వాసం

కలుగుతుంది. చాలా క్రొత్త విషయాలు బయటపడవచ్చు. అవి ప్రస్తుతం కూడా ఉపయోగపడవచ్చు.

ఈ వైమానిక శాస్త్రం ప్రాచ్యలిఖిత భాండాగారంలో లభించింది. అలాగే దీనిలో ఉదాహరించిన గ్రంథాలు కూడా ప్రాచ్యలిఖిత భాండాగారాలలోను, విదేశాలలోని లైబ్రరీలలోను అన్వేషిస్తే బయటపడవచ్చు. అలా జరిగితే ఈ గ్రంథం ఎక్కువ బోధపడే అవకాశం ఉంది.

**శ్లో. యద్విమానగతాస్సర్వే యాన్తి బ్రహ్మపరం పదం**
**తం నత్వా పరమానందం శ్రుతిమస్తకగోచరమ్**

ప్రణవమనే విమానాన్ని ఎక్కి పయనించినవారు అందరూ బ్రహ్మలోక స్థానాన్ని పొందుతారు. ఉపనిషత్తులందు గోచరించే ఆ పరమానందమూర్తికి నమస్కారం.

ఇది ఈ గ్రంథానికి ప్రార్థన. ఇది వైమానికశాస్త్రం. కాబట్టి ఈ శ్లోకానికి వేరొక అర్థం కూడా ధ్వనిస్తుంది. ఈ విమానశాస్త్రంలో చెప్పబడిన మాంత్రిక విమానం మొదలైనవి ఎక్కినవారు బ్రహ్మలోకం చేరతారు అని. తర్వాత విశ్వమ్భరుడు చెప్పిన "లోకాల్లోకాన్తరఞ్చాపి యోమ్బరే గన్తుమర్హతి" అనే వాక్యం ఈ అభిప్రాయాన్ని బలపరుస్తుంది.

ఇది వేదసారరూపం. అయిదు వందల సూత్రాలు, నూరు అధికరణాలు, ఎనిమిది అధ్యాయాలు కల ఈ గ్రంథం మిక్కిలి గూఢం. జగత్తులను సంధానం చేస్తుంది. శ్రమ లేకుండా ఆకాశయానం చేయడానికి జ్ఞానం కలిగిస్తుంది.

స్వతస్సిద్ధ న్యాయశాస్త్రం, వాల్మీకి గణితం, పరిభాషాచన్ద్రిక, నామార్థ కల్పనమనే గ్రంథాలు, అయిదుసార్లు విచారించి ఆ ప్రమాణానుగుణంగా ఈ వ్యాఖ్యాగ్రంథం రచించానని బోధానన్ద మునీంద్రుడు చెప్పాడు.

నారాయణుడు, శౌనకుడు, గర్గుడు, వాచస్పతి, చాక్రాయణి, ధుంఢినాథుడు విమాన శాస్త్రాలు రాశారు.

విమానచంద్రిక, వ్యోమయానతంత్రం, యానబిందువు, యాన ప్రదీపిక, వ్యోమయానార్క ప్రకాశం పరిశీలించి భరద్వాజుడే వైమానిక శాస్త్రం రచించాడు.

పక్షుల వేగానికి, విమాన వేగానికి పోలిక ఉన్నందు వల్ల వ్యోమయాన యంత్రానికి విమానమనే పేరు వచ్చింది.

భూమియందు, నీటియందు, అంతరిక్షమందు వేగంగా వెళ్ళడానికి పటివలె సమర్థమైనది కనుక దీనికి విమానమని పేరని నారాయణుడు చెప్పాడు.

ఒక దేశాన్నుండి, మరొక దేశానికి, ఈ లోకాన్నుండి మరొక లోకమునకు, ఒక ద్వీపాన్నుండి మరో ద్వీపానికి ఈ విమానం వెళ్ళగలదు.

ఈ మహాగ్రంథానికి బోధానంద యతీంద్రునిది శ్లోకరూపమయిన సంస్కృత వ్యాఖ్య. హిందీలో, ఇంగ్లీషులో చిత్రాలతో వివరణముందని వేద విశ్వవిద్యాలయ కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి చెప్పారు. జ్ఞానసరస్వతి డా॥ ఆమంచి బాలసుధాకర శాస్త్రి దీనికి తెలుగు తాత్పర్యం వ్రాశారు.

32 రహస్యాలు తెలిసిన వాడు విమానం చేయడానికి అధికారి

**విమానరచనే, వ్యోమారోహణే, చాలనే తథా**
**స్తంభనే, గమనే, చిత్రగతి, వేగాదినిర్ణయే**

రహస్యలహరిలో 32 చెప్పారు. మాంత్రికం, తాంత్రికం, కృతకం అంతరాళకం మొదలయినవి గురుముఖంగా తెలుసుకోవాలని చెప్పారు. వీటిలో అంతరాళ రహస్యం – ఆకాశంలో పరిధి, మండలం, శక్తి, సంధి స్థానాల్లో విమానం ప్రవేశించినపుడు రెండు శక్తుల సమ్మర్దంచే విమానం

చూర్ణమైపోతుంది. విమానప్రయాణంలో ఆ సంధి సూచన వచ్చినపుడు ఆ విమానం స్తంభింపజేయాలి అదో రహస్యం.

అదృశ్య రహస్యమంటే సూర్యరథంలోని ముందువెనుక ఉన్న వైణరథ్య, వికరణ శక్తులతో ఆకాశతరంగాలందున్న శక్తిప్రవాహాన్ని ఆకర్షించి వాయుమండలంలో ఉన్న బలహా, వికరణాది ఐదు శక్తులతో నియోజనం చేసి దానిద్వారా తెల్లని మబ్బుల మండలం ఏర్పరచి ఆ ఆవరణంలో విమానాన్ని కన్పించకుండా చేయడం. ఇలాంటి రహస్యాలు 32 చెప్పారు.

విమాన మార్గాలు 1. రేఖామార్గం, 2. మండలమార్గం, 3. కక్ష్యామార్గం, 4. శక్తిమార్గం, 5. కేంద్రమార్గం.

వీటిలో మొదటి నాలుగు భూమండలంలో సంచరించడానికి ఉపయోగిస్తాయి. 2 నుండి 5 వరకు పైలోకాలలో సంచరించడానికి వినియోగిస్తారు.

పైన చెప్పిన రేఖాది మార్గాలలో రెండు శక్తుల కలయిక వలన ఏర్పడే ఆవర్తాలు విమానాలను విధ్వంసం చేస్తాయి. ఈ వినాశం కలుగకుండా విమానాన్ని రక్షించడానికి ఈ ఆవర్తాల గురించి తెలుసుకోవాలి.

విమానానికి అంగాలు 31, విమానంలో ఎక్కడ ఏ అంగం ఉండాలో చెప్పారు. ఉదా : పరివేషస్థానం విమానానికి పైన ఉంటుంది. వైరూప్య దర్పణస్థానం విమానానికి ముందు ఉంటుంది. ఇలా మిగిలిన అంగాలుండవలసిన చోటులు గురించి చెప్పారు.

విమానాన్ని నడిపేవారు ఋతువులనుబట్టి బట్టలు ధరించాలని చెప్పారు.

పట్టు, దూది, నాచు, ఉన్ని, అభ్రకం, తోలు మొదలయిన వాటితో బట్టలు తయారు చేస్తారు. వాటిని 27 రకాలుగా శుద్ధిచేసి అభ్రకజలంతో

కడిగి, నూనెలతో ఉడికించి, ఎండబెట్టి, కొన్ని రసాలతో తడిపి గర్భతాపన యంత్రంతో వేడిచేసి ఈ వస్త్రాలను ధరిస్తారు. ఈ ప్రక్రియ దారం తీయడం దగ్గర నుండి విస్తృతంగా ఉంది.

ఋతువులననుసరించి విమాన చోదకులు ఆహరం తీసుకోవాలి. ఉదా: వసంత గ్రీష్మాలలో గేదెపాలు, పెరుగు, నెయ్యి, వరి, కందులు, గొఱ్ఱెమాంసం ఆహారంగా గ్రహించవచ్చు. ఇలా మిగిలిన ఋతువులకు కూడా వేరే రకాలయిన ఆహారాలు చెప్పారు.

విమానం నడిపేవారు 5 సార్లు ఆహారం తీసుకోవాలి. పగలు 3 సార్లు, రాత్రి రెండు సార్లు ఆహారం తీసుకోవాలి. ఆహారం దొరకనపుడు ఆహారసారాన్ని తీసుకోవాలి. అన్నం మొదలయిన 32 రకాల ఆహారాలున్నాయి. వాటిలో ఆహారసారం కల గుళికలు వీరికి శ్రేష్ఠాలు. వీరికి కొన్ని ఔషధులను ఆహారంగా కూడా చెప్పారు. ఉదా: సోమవల్లి మొదలయినవి.

విమానయాన విషయంలో ప్రతి అంశానికి పలు గ్రంథాలను పేర్కొని వాటిలోవి ఉపయోగించమన్నారు. విమాన లోహాలకు శౌనకసంహిత అనే గ్రంథం ఉదాహరించారు. ఆ గ్రంథాలను సంపాదిస్తే తప్ప విమాన శాస్త్రమునకు సంబంధించిన జ్ఞానము సమగ్రం కాదు.

బరువులేని 6 లోహాలు విమాన నిర్మాణానికి శ్రేష్ఠాలు. సౌమం, శౌండాలం, మౌర్త్వికం అని మూడురకాల లోహాలను పేర్కొన్నారు. వీటిని ఊష్మప లోహాలంటారు. భూగర్భంలో 7వ పొరలో లభించే లోహాలు సౌమాదులు. ఈ లోహాల విషయంలో లోహకల్పమనే గ్రంథంలో వివరంగా లభిస్తుంది. విమాన నిర్మాణానికి కొన్ని ప్రత్యేక లోహాలు తయారు చేసుకోవాలి. వాటిని బీజలోహాలంటారు.

ఆ లోహాలను శుద్ధి చేయాలి. సంస్కార దర్పణమనే గ్రంథం శుద్ధి విధానాన్ని తెలుపుతుంది. గుంజా మొదలయిన అయిదు తైలాలతో లోహాలను శుద్ధి చేయాలి. తరువాత హింగు మొదలయిన కషాయాలతో లోహాలను శుద్ధి చేయాలి. వేర్వేరు లోహాలను వేర్వేరు పదార్థాలతో శుద్ధి చేయాలి. మూడు లోహాలను కలుపుటచే ఊష్మపలోహాలు తయారవుతాయి. మిశ్రమలోహాలు 33 రకాలు తయారు చేయవచ్చును. ఆ విధానం చెప్పారు.

లోహాలను కరిగించడానికి రకరకాల మూషలు 407 ఉన్నాయి. వాటిని 12 వర్గాలుగా చెప్పవచ్చు.

3 రకాల లోహాలను 19-8-10 భాగాలు మేళవిస్తే విశల్యకృత్ ఊష్మపలోహం తయారవుతుంది.

లోహాలను కరిగించి మిశ్రమ లోహాలను తయారు చేయాలి. కరిగించడానికి మూషలు 407 రకాలున్నాయి.

ఉత్తమ, మధ్యమ, అధమ లోహాలను కరిగించడానికి 407 మూషలను ప్రాచీనులు పేర్కొన్నారు.

'మూషాకల్పం' అనే గ్రంథంలో 40 మూషలను చెప్పారు. వాటిలో అంతర్ముఖమనే మూష బీజలోహాలను కరిగించడానికి ప్రశస్తం. తరువాత మూష ఎలా నిర్మాణం చేయాలో చెప్పారు.

పిదప కుండం తయారు చేసే పద్ధతి. కుండములు 532 రకాలు. వాటిలో కూర్మవ్యాసటిక ముఖ్యం. చతురశ్రంగా కాని, వర్తులంగా కాని, తాబేలు ఆకారంగా కాని పది వితస్తుల పరిమాణంలో కుండం తయారు చెయ్యాలి. వితస్తి అంటే పన్నెండు అంగుళాలు. ఆ కుండంలో అగ్నిని మండించడానికి ఎదుట భస్త్రిక (తోలుతిత్తి) ఏర్పరచాలి. దానిని తయారు

చేసే పద్ధతి చెప్పారు. 532 రకాల భస్త్రికలున్నాయి. వాటిలో కూర్మభస్త్రిక బీజలోహాలు కరిగించడానికి ముఖ్యం.

విమాన నిర్మాణంలో వాడే దర్పణాలు 7 విధాలు. వీటి విషయం ముకురకల్పంలో చెప్పారు. విశ్వక్రియ, శక్త్యాకర్షణం, వైరూప్యం మొదలయినవి దర్పణాలు.

విమానం క్రింద ఉన్న ప్రాణులను చూడడానికి విశ్వక్రియాదర్పణ ఉపయోగిస్తుంది. దానిని చేసే పద్ధతి చెప్పారు.

ఆకాశ ప్రయాణంలో విమానంలోని వారికి హాని కలిగించే విషశక్తులను ఆకర్షించి నాశం చేసేది శక్త్యాకర్షణ దర్పణం. శత్రువులను భయపెట్టి మూర్ఛ పొందించి వారికి మరపు కలిగించేది వైరాజిక దర్పణం. శత్రువుల విమానాలను నాశం చేసేవి రౌద్రీదర్పణాలు. దర్పణాలను నిర్మించే పద్ధతి, వాటిని ఉంచే చోటులు అవి చేసే పనులు చెప్పారు.

విమానం విచిత్ర గతులలో సంచరించడానికి సద్యోజాత యంత్రం ఉపకరిస్తుంది. అయిదు గతులున్నాయి.

చలనం, గాలనం, పంజరం, స్ఫోరణం, వక్ర అపసర్పణం అని గతి వైచిత్ర్యాలు.

చిత్రిణీ అనే విద్యుచ్ఛక్తి 17 విధాలు. అది విమానంలో 32 పనులు చేస్తుంది. పంజరశక్తి వలన చాలనాదులు కలుగుతాయి. అది అగ్ని నుండి పుట్టిన విస్ఫులింగాల వలె ఉంటుంది.

విమానాంగములైన ఉపయంత్రాలు 32. ఆ యంత్రాలు చేసే విధానం చెప్పారు.

సూర్యకిరణాలను ఆకర్షించే దర్పణం, విద్యుద్యంత్రం, తీగలు. వీటిలో రుచిరద్రావక మణియందు శక్తిని ప్రసరింపజేయాలి. ఆ శక్తి విశ్వక్రియాదర్పణ

స్థానంలో ప్రవేశింపజేయాలి. ఆయా దేశాల ప్రదేశాలను (రహస్యాలను) గ్రహించి, గణితం ద్వారా నిర్ధారణ చేసుకోవాలి. ఈ యంత్రం సర్వవస్తువులను ప్రకాశింపజేస్తుంది.

దర్పణం ద్వారా విమానానికి కలిగే ప్రమాదాలను తెలుసుకొని వాటిని నివారించాలి.

ఆకాశంలో తరంగ వాయువులలో రౌద్రి అనే తరంగాల నుండి కలిగిన శక్తులు విమానాన్ని నాశం చేస్తాయి. వాటి నాకర్షించి నాశం చేసి, విమానాన్ని రక్షించేది శక్త్యాకర్షణ యంత్రం.

శక్త్యాకర్షణ యంత్రంలో సాంజనికం మొదలయిన మణులను ఉంచాలి. దానివలన శక్తి ఆవిర్భవిస్తుంది.

సూర్యకిరణాలను స్వాధీనము చేసుకొని విమానం తన మార్గం నుండి తప్పకుండా చేసేది పరివేష క్రియాయంత్రం. ఈ యంత్రం 5 శక్తుల ద్వారా విమానానికి గుడి (పరివేషం) కట్టించి సూర్యకిరణ సంబంధం వలన విమానం రేఖామార్గాన్ని తప్పకుండా చేస్తుంది.

ఎనిమిది పాత్రలలో ఎనిమిది రకాల మణులు వేసి శక్త్యాకర్షణ దర్పణాలను నెలకొల్పాలి. తారాస్యం, పవనాస్యం, ధూమాస్యం మొదలయినవి దర్పణాలు.

చర్మం చుట్టిన తీగల ద్వారా విద్యుచ్ఛక్తిని ప్రసరింపజేయాలి.

**శ్లో. చర్మవేష్టిత తంత్రీభిః విద్యుచ్ఛక్తి ప్రసారణమ్.**

కీలకాలు ఏర్పాటు చేయాలి. భ్రామణీకీలకం. కదిలిస్తే అన్ని కేంద్రాల కీలలు చలించాలి. అవి చలించే మార్గాన్ని అనుసరించి శక్తిస్థాపన పాత్రలను దృఢంగా నెలకొల్పాలి. వీటికి కుడివైపున వాత సంయోజన యంత్రం నెలకొల్పాలి. దీనిని తయారుచేసే విధానం చెప్పారు.

ధూమప్రసారణ యంత్రం నెలకొల్పాలి. దానిని తయారుచేసే విధానం చెప్పారు.

క్షీరికావస్త్రాలను తయారుచేసి వాటిని పటగర్భ యంత్రముఖంలో సంయోజనం చేయాలి. క్షీరికాపటాన్ని తయారుచేసే విధానం చెప్పారు. ఈ పటంతో పరివేష క్రియానాళాన్ని కప్పాలి.

కిరణాకర్షణాదర్శనాళం ఏర్పరచాలి. ప్రతిబింబార్క కిరణాకర్షణా దర్శం ఏర్పాటు చేయాలి. దానిని తయారుచేసే విధానం చెప్పారు.

32 రకాల మణులున్నాయి. వాటిని శిరోమణులు అంటారు. వాటిని విమానానికి పైభాగంలో సంయోజనం చేయాలి.

విద్యుద్యంత్ర ముఖాన్నుండి అన్ని తీగలు తీసుకువచ్చి మూలంలో సంయోజనం చేయాలి. వీటిద్వారా శక్త్యపకర్షణం జరుగుతుంది. విద్యుద్యంత్రానికి పైన దృఢమైన కిరణాకర్షణాలను ఏర్పరచాలి.

విమానశక్తిసంధాన కీలకాలను ఏర్పాటు చేయాలి. సూర్యునికి గ్రహాలకు, చార, అతిచార, వక్ర, అతివక్ర సంచారముంది. వీటివలన అగ్నిజ్వాలల వంటి శక్తి ప్రవాహాలేర్పడతాయి. వాటివలన విమానాంగాలకు నష్టం ఏర్పడకుండా అంగోప సంహరయంత్రం ఏర్పరచి ఆ యంత్రం చేసే విధానం చెప్పారు.

ఈ విమానం 300 వేగంతో సంచరించే సమయంలో భూమి, మేఘం, విద్యుత్తు, వారుణశక్తుల కలయిక వలన బుద్ధిమాంద్యం, జ్వరం, తలనెప్పి, దప్పిక, విరేచనాలు మొదలయిన రోగాలు కలుగుతాయి. వాటిని నివారించడానికి విస్తృతాస్యక్రియా యంత్రం విమానంలో నెలకొల్పాలి. ఆ యంత్రం విధానం చెప్పారు.

విమానం నాశం చేయడం కోసం శత్రువులు వస్తారు. వారి శరీరాలకు విరూపత్వం కలిగించేది వైరూప్యాదర్శయంత్రం. దానిని ఏర్పరచే విధానం చెప్పారు.

విమానానికి ప్రతిబంధకమయిన చండవాయువును నివారించడానికి పద్మచక్రముఖ యంత్రం ఏర్పరచాలి. అది ఆ వాయువును పీల్చుకుని వదలివేస్తుంది. ఆ యంత్రం చేసేవిధానం చెప్పారు. ఈ చండవాయువుతోపాటు ఒకప్పుడు పంకం (ధూళి) కూడ వస్తుంది. దానివలన విమానం నడిపేవారికి మాసూరిక వస్తుంది. విమానానికి శిథిలత్వం కలుగుతుంది. కాబట్టి దీనిని నివారించడానికి పద్మచక్రముఖ యంత్రం కావాలి.

దీనిలో భూమిని వహించే కచ్ఛపం మొదలయినవి భూమిలో ఉండే శక్తులుగా సమన్వయించారు. కచ్ఛపం మొదలైనవి భూమిని వహిస్తాయని సంప్రదాయంలో ఉంది.

గ్రీష్మకాలంలో సూర్యకిరణ శక్తుల మేళనంతో మిక్కిలి వేడికల కుళికాశక్తి కలిగి అది విమానాన్ని భస్మం చేయగలదు. దాని నివారణం కోసం కుంటిణీశక్తి యంత్రం ఏర్పరచుకోవాలి.

వసంత గ్రీష్మకాలాల్లో ప్రయాణించువారికి చల్లదనం కోసం పుష్పిణీ యంత్రం ఉపయోగిస్తుంది.

రెండు గాలుల ఆవర్తశక్తుల సంధిలో సూర్యకిరణాల ఘట్టనం వలన ఎండ వజ్రాయుధం వలె హానిని కలిగిస్తుంది. ఆ అపాయం తొలగించడానికి పింజులాదర్శం ఏర్పరచాలి. దీనివలన ఉష్ణతాపం, పిడుగుపాటు, విమానవేగం వలన కలిగే తాపం తొలగుతాయి.

విమానంలో పాకసంబంధమైన కుంపటివలన పొగ వ్యాపించినపుడు అది బయటికి వెళ్ళడానికి నాళపంచకం ఏర్పరచాలి.

శత్రువులు విమానం పడగొట్టడానికి భూమిలో మహాగోళ, అగ్నిగర్భ మొదలయిన అయిదు యంత్రాలనుపయోగిస్తారు. వాటిని గుర్తించడానికి గుహాగర్భాదర్శ యంత్రం ఏర్పరచాలి.

రోహిణీ విషసంబంధ చూర్ణాన్ని ధూమాదులతో క్రకచారిమణి దీపకాంతి విషసమూహంచే శత్రువులు విమాన నాశ ప్రయత్నం చేసినప్పుడు ఆకాశంలో తన విమానం రక్షించుకోవడం కోసం తమోయంత్రం స్థాపించాలి.

వృష్ట్యాది వాతావరణ మండలాలకు పంక్తిరాధసకేంద్రస్థ శక్తి సంపర్కం వల్ల మండలాల మధ్య వాయువులు రెండేర్పడుతాయి. వాటి ఘర్షణ వల్ల విషస్వభావం గల వాయువులు పుడతాయి. వాటి సంబంధం వల్ల విమానానికి నాశం కలుగుతుంది. దానిని వారించడానికి పంచవాత స్కంధనాశ యంత్రం స్థాపించాలి.

ఆకాశంలో 5వ కక్ష్యలో విమానం సంచరించే సమయంలో అక్కడి అగ్నిజ్వాలలచే విమానం భస్మమవుతుంది. దానిని నివారించడానికి రౌద్రాదర్పణం ఏర్పరచాలి.

ఆవహం మొదలయినవి మహావాత మండలాలు. వాటిలో 9వది వాతాయనం. గ్రీష్మ ఋతువులో విమానం నాల్గవ కక్ష్యలో సంచరించే సమయంలో వాతాయన గతివేగం వల్ల విమానానికి వక్రగతి కలుగుతుంది. దీనివల్ల నడిపేవారికి చాలా కష్టం కలుగుతుంది. ఆ అపాయం తొలగించడానికి వాతస్కంధనాళ యంత్రం స్థాపించాలి. దానివలన వాహనం నడిపేవారికి సుఖం కలుగుతుంది.

వర్షర్తువులో మేఘాలలో మెరుపుల కదలికలు ఏర్పడుతాయి. వాటిని విమానంలోని రౌద్ర్యాది దర్పణాలు ఆకర్షిస్తాయి. వాటి కలయికచే అగ్ని ఏర్పడటంతో విమానం భస్మం అవుతుంది. దానిని నివారించడం కోసం విద్యుద్యంత్రం స్థాపించాలి.

ఆకాశంలో ఎనిమిదవ కక్ష్యలో వారుణి, వాతం, అశని వీటి కలయికచే చెవులు పగులునంత శబ్దాలు బయలుదేరుతాయి. అవి వింటే విమానం నడిపేవారు చెవిటివారవుతారు. దానిని నివారించడం కోసం శబ్దోపసంహార యంత్రం స్థాపించాలి.

8వ మండలం మధ్య అనేక ధూమకేతువులున్నాయి. వాటిలో మహాకాలాదులు భయంకరమయినవి. వాటి శక్తిని నిరోధించడానికి విద్యుద్ద్వాదశక యంత్రం నెలకొల్పాలి.

విద్యుత్తు, వాయువు, ధూమశక్తులను చోదనం మొదలయిన పనులలో నియమించే యంత్రం యానప్రాణ కుండలినీయంత్రం. ఇది విమానాన్ని చలింప చేయడం, చోదనం చేయడం, స్తంభింప చేయడం, విచిత్రగమనం కల్గించడం, అడ్డంగా గమనం కలిగించడం చేస్తుంది. అవి నాళాల ద్వారా జరుగుతాయి.

కార్తికమాస పౌర్ణమినాడు గ్రహములందలి, నక్షత్రములందలి 8 శక్తులు ఆకర్షిస్తాయి. ఒక శక్తి చల్లని గాలి రసరూపమయి విమానశక్తిని హరిస్తుంది. శీతరసరూపవాత శక్తి విమానంలోని వారి శక్తిని గ్రహిస్తుంది. నీటితుంపరల వంటి శక్తి విమానాన్ని ఆవరించి ఏమీ కనబడకుండా చేస్తుంది. వీటివల్ల నడుపువారికి, యానానికి హాని కలుగుతుంది. దీని నివారణం కోసం శక్త్యుద్గమ యంత్రం స్థాపించాలి.

విమానాన్ని విచ్ఛేదం చేయడం కోసం శత్రువులు దంభోళి మొదలయిన యంత్రాలు ప్రయోగిస్తారు. ఆ అపాయం తొలగించడం కోసం వక్రప్రసారణ కీలయంత్రం స్థాపించాలి.

అవసరాన్ననుసరించి విమానంలోని విద్యుత్తు ప్రసారం కావడానికి శక్తిపంజర కీలయంత్రం స్థాపించాలి.

**శ్లో. విద్యుత్సంచోదనార్థాయ యానసర్వాఙ్గసంధిషు**
**శక్తిపఞ్జర కీలక నిర్ణయ ఉచ్యతే**

విమానం పైన మేఘాల నుండి పిడుగుపడితే విమానం నశిస్తుంది. దానిని నివారించడం కోసం శిరఃకీలకయంత్రం నెలకొల్పాలి. దానిని శిరోభాగంలో స్థాపించాలి.

విమానానికి ఎనిమిది దిక్కులలో 24 మైళ్ళ దూరంలో మృగాలు, పశువులు, పక్షులు, మనుష్యులు యంత్రాల ద్వారా గాని, గూఢంగా గాని, ప్రకాశంగా కాని ఏ శబ్దాలు చేస్తారో వాటిని గ్రహించడం కోసం శబ్దాకర్షణ యంత్రం స్థాపించాలి. దీనిని వ్యోమయానం భుజస్థానంలో నెలకొల్పాలి.

దిక్కుల భేదాన్ననుసరించి విమానం వెళ్ళడానికి, అపాయం, ఉపాయం, సంకేతం తెలియడానికి పటప్రసారణ యంత్రం విమానం భుజస్థానంలో నెలకొల్పాలి.

ఆకాశగమనం చేసే సమయంలో విమానానికి ఎనిమిది దిక్కులలో గ్రహకిరణాల సంధిస్థానాల్లో ఋతువుల ననుసరించి కౌబేరాలు అనే వాయువులు పుడతాయి. వాటితో విమానం నడిపేవారి చర్మం ఎండిపోవడం, దగ్గు మొదలయినవి కలుగుతాయి. వాటి నివారణం కోసం దిశాంపతి యంత్రం విమానానికి ఎడమభుజం స్థానంలో నెలకొల్పాలి.

గ్రహసంధులలో పుట్టే జ్వాలాముఖం అనే దానిని నాశం చేయడం కోసం పట్టికాభ్రక యంత్రం విమానావరణమధ్యంలో స్థాపించాలి. శరత్కాలం హేమంతకాలం చలి తొలగడం కోసం సూర్యశక్త్యపకర్షణ యంత్రం విమానంపైన ఉంచాలి.

తమ విమానాన్ని నాశం చేయడానికి శత్రువుల విమానావరణ సమర్థమయితే దాన్ని నివారించడం కోసం అపస్మార ధూమప్రసారణ యంత్రం నెలకొల్పాలి.

వారి పరిధి రేఖామండల సంధులలో శక్త్యుద్రేకం కలిగితే ప్రచండమయిన గాలులు, వాటికి సంఘర్షణం కలుగుతుంది. అపుడు అన్నివైపుల వాయుప్రవాహాలేర్పడతాయి. వాటిని నివారించడం కోసం స్తంభన యంత్రం స్థాపించాలి.

విమాన ప్రయాణం చేసేవారు అగ్నిహోత్రం చేయడానికి, వంట చేసుకోవడానికి వైశ్వానరనాళ యంత్రం ఏర్పరచాలి.

కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో ఉంది. వారు సిద్ధులు, సాత్త్వికులు, జ్ఞానులు. వారికి అణిమాది సిద్ధులు ఆకాశగమనం స్వతస్సిద్ధాలు. కావున వారికి విమానాల అవసరం లేదు.

త్రేతాయుగంలో ఒక పాదం ధర్మం తగ్గింది. కావున బుద్ధిమాంద్యం కలిగింది. అణిమాది సిద్ధులు మలినాలయ్యాయి. ఆకాశగమనం, వాయువేగం వారికి పోయాయి.

అపుడు మహాదేవుడు దక్షిణామూర్తియై సనకాదిమునులను నిమిత్తంగా చేసుకొని చాక్షుషదీక్ష ఇచ్చాడు. మంత్రద్రష్టృత్వ సిద్ధికోసం ఈ దీక్ష ఇచ్చారు. వారికి మంత్రానుష్ఠాన కల్పాదులను ఉపదేశించాడు. దయతో వారి నాలింగనం చేసికొని జ్ఞాపకశక్తినిచ్చాడు. వారు భక్తితో శతరుద్రీయ మంత్రాలతో ఆయనను స్తుతించారు. ఆయన ప్రసన్నుడై మంత్రస్వరూప ద్రష్టృత్వం కోసం వాటి రహస్యాలను ప్రబోధనం చేయడం కోసం అనుభూతిని ప్రసాదించారు. “ఇంతవరకు మీరు మునులు. నా ప్రభావం వల్ల మంత్రాలను దర్శించి ఋషులవండి” అని అనుగ్రహించాడు.

ఆ కరుణానిధి ఇలా చెప్పాడు. ‘నా అనుగ్రహం వల్ల అన్ని వేద మంత్రాలను కల్పానుష్ఠానాన్ని పొంది అనుష్ఠానం చేసి బ్రహ్మచర్యంలో నా ఆజ్ఞారూపమయిన వేదమాతను ఏకాక్షరమును ఆరాధించి, మంత్ర రహస్యాలను, నా హృదయాన్ని తెలిసికొని, సర్వవేదార్థ తాత్పర్య రహస్య

జ్ఞానం పొందండి. తరువాత ధర్మశాస్త్ర పురాణేతిహాసాలను, భూత భౌతిక శాస్త్రాలను, వేదతత్వాన్ని అనుసరించి రచించండి. ఈ లోకంలో అందరికీ భుక్తి, ముక్తి కలగడం కోసం రచించండి. ఆకాశగమనం కోసం వ్యోమయానాలను, వాయువేగాదుల కోసం ఘుటికా పాదుకాసిద్ధుల విధానాలు ఏర్పరచండి. ఇలా కల్పశాస్త్రాలు రచించి లోకంలో స్థాపించండి' అని ఆదేశించాడు.

వారు ఆయనను హృదయంలో ధ్యానించి వేదమార్గాన్ని అనుసరించి ధర్మశాస్త్ర పురాణేతిహాసాదులు, భౌతికశాస్త్రాలు, కల్పశాస్త్రాలు, శ్రౌత స్మార్తసూత్రాలు రచించి లోకంలో స్థాపించారు.

వీటిలో అంతరిక్ష విమాన బోధకశాస్త్రాలు ఆరు. వాటిలో యాంత్రికాలు, తాంత్రికాలు, కృతకాలు ఉన్నాయి.

త్రేతాయుగంలో మంత్రప్రభావాధిక్యం వల్ల మాంత్రిక విమానాలు విమానశాస్త్రంతో వర్ణింపబడ్డాయి.

ద్వాపరయుగంలో తంత్రప్రభావాధిక్యం చేత తాంత్రిక విమానాలు ఏర్పరచారు.

కలియుగంలో మంత్రతంత్రాలు అనుష్ఠానం సరిగా లేకపోవడం వల్ల కృతక విమానాలు చెప్పబడ్డాయి.

1. విమాన చంద్రిక, 2. వ్యోమయాన తంత్రం, 3. యంత్ర కల్పం, 4. ఖేటయాన ప్రదీపిక, 5. శౌనకీయం, 6. వ్యోమయానార్క ప్రకాశిక. ఇవి పూర్వకాలంలో ఉన్న వైమానిక శాస్త్రాలు. (లల్లుని వచనాలు, మణిభద్రకారిక).

పుష్పకం మొదలయిన 25 విమానాలు యాంత్రిక విమానాలు. 1. పుష్పకం, 2. అజముఖం, 3. భ్రాజస్వత్, 4. త్రిపురం మొదలైనవి. మాంత్రిక విమానం పుష్పకం శ్రీరాముడు అధిష్ఠించినది.

ఆకారం, గమనం, వేగం మొదలయినవి మాంత్రికాలకు, తాంత్రికాలకు సమానమే. పృథ్వి, స్వర్గం వాటిమధ్యలో ఉన్న సంధులయందున్న శక్తిసమ్మేళన విషయాలు తాంత్రిక విమానాల్లో అధికం.

తాంత్రిక విమానాలు 56 రకాలు. భైరవము, నందకము, వటుకం మొదలయినవి వాటి పేర్లు.

శకునం, సుందరం, రుక్మకం మొదలయినవి 25 కృతక విమానాలు. కృతక విమానాలు రాజలోహంతో చేస్తారు. 83 లోహాలు కలిపితే రాజలోహం ఏర్పడుతుంది.

శకున విమానానికి 28 అంగాలున్నాయి. మొదట పీఠము, నాళ స్తంభము, రంధ్రాలు మూడు చక్రాలు గల కీలకాలు చతురోష్మక యంత్రం, వాతనాళాలు, జలావరణనాళం, తైలపాత్రం, వాతపాచక తంత్రీనాళం, చుల్లి, విద్యుద్యన్త్రం, వాతచోదన యంత్రం, వాతపా యంత్రం, దిక్ప్రదర్శన ధ్వజం, శకున యంత్రం, దాని రెక్కలు 2, విమానం పైకి ఎగురడానికి తోక, విమాన సంచార కారణమైన ఔష్మ్యక యంత్రం, కిరణాకర్షణ మణి ఇవి కృతక విమాన భాగాలు.

**సుందర విమానం –** దానికి అంగాలు పీఠం, ధూమ నాళస్తంభం, వాత ప్రసారణం, విద్యుద్యన్త్రం, చాతుర్ముఖోష్యకం, ధూమోద్గమ యన్త్రాలు 5, భుజ్యులోహక నాళం.

**రుక్మవిమానం –** రుక్మవిమానం కూడా రాజలోహంతోనే చేస్తారు. కాని వంటభేదంచేత దీనికి బంగారురంగు వస్తుంది. కాబట్టి రుక్మ విమానమంటారు. మొదట లోహానికి రుక్మవర్ణం కలిగించి తరువాత విమానం చేయాలి.

**త్రిపురం -** దానికి ఆవరణాలు మూడు. ఈ ఆవరణాన్ని పురమంటారు. ఇది సూర్యకిరణాల నుండి ఏర్పడిన శక్తితో నడుస్తుంది. భూమి, అంతరిక్షం, నీరు వాటిలో తన అవయవాల భేదంచే నడచుటకు శక్తి కలది కనుక దానికి త్రిపురమని పేరు. దీనిలో మొదటి భాగం భూమియందు, రెండవ భాగం నీటిలోపల పైన, మూడవ భాగం అంతరిక్షంలోను సంచరిస్తుంది. దీనిని త్రినేత్ర లోహంతో తయారు చేయాలి.

దీనిలో అభ్రకం శుద్ధి చేసే రీతి చెప్పారు. శుద్ధి చేస్తే అచ్ఛేద్యం, అదాహ్యం, నాశం లేనిది అయిన అభ్రకం తయారవుతుందని చెప్పారు. ఇలా వైమానికశాస్త్రంలో వివిధ విమానాల వివరాలు తెలిపారు.

* * *

# మహావీరుడు - మహావీరం

ఎనిమిదవ శతకంలో ఉన్న మహాకవులలో భవభూతి గణింపదగినవాడు. ఆయన 730 సం॥ ప్రాంతంలో ఉజ్జయినీ కాన్యకుబ్జాన్ని ఏలిన యశోవర్మ ఆస్థానంలో ఉన్న విద్వత్కవి.

భవభూతి విదర్భదేశంలో పద్మావతీపురంలో శ్రోత్రియ కుటుంబంలో జన్మించాడు. వీరి వంశంలో ఐదవ పురుషుడు వాజపేయ యాగం చేశాడు.

వీరి గురువు జ్ఞాననిధి, తైత్తిరీయ శాఖ. భవభూతి వేదవేదాంగవిదుడు. ఈయన రచించినవి మహావీర చరిత్ర, ఉత్తర రామచరిత్ర, మాలతీ మాధవం. మొదటి రెండు నాటకాలకు ఆలంబనం శ్రీరామకథ. శ్రీమద్రామాయణం ఉత్తరకాండ కథ ఉత్తర రామచరిత్రకు మూలం. యుద్ధకాండాంత కథ మహావీర చరిత్రకు ఆధారం. ఈయన వీటిలో మూలకథకు మార్పులు, చేర్పులు చేశాడు.

మహావీర చరిత్రలో వీరరసం ప్రధానం. వీరరస నాటకాలలో మహావీర చరిత్రకు సముచిత స్థానం ఉంది. ఈయన కవిత్వాన్ని సమకాలికులు సరిగా గుర్తించలేదని ఈ కవికి కొంత అసంతృప్తి ఉంది.

**“ఉత్పత్స్యతే మమ తు కోపి సమానధర్మా**
**కాలో హ్యయం నిరవధి ర్విపులా చ పృథ్వీ”**

నాతో సమాన స్వభావం కలవాడెవడో పుడతాడు. ఈ కాలం హద్దులేనిది. భూమి చాలా విస్తారమైనది అని ఈ కవి చెప్పాడు. తన తరువాతి కాలంలో తన కవిత్వ వైశిష్ట్యం గుర్తిస్తారని కవి ఆశ ఈ శ్లోకార్థంలో వెల్లడి అవుతోంది.

తన కవితలో గూఢంగా కొన్ని విశేషాల నీ కవి పొదిగాడని భావించవచ్చు.

**"యద్వేదాధ్యయనం తథోపనిషదాం సాఙ్ఖ్యస్య యోగస్య చ"**

అనే శ్లోకపాదం వల్ల ఇతడు ఉపనిషత్తులతో వేదం, సాఙ్ఖ్యం, యోగం అధ్యయనం చేశాడని తెలుస్తోంది. ఇతడు లోకజ్ఞుడు, ప్రతిభాశాలి అని సాహిత్యవేత్తల అభిప్రాయం.

భవభూతి శ్రీరాముని ఉత్తర చరిత్రకు ఉత్తర రామచరిత్ర అని పేరు పెట్టాడు. ఉత్తర పదానికి ఊర్ధ్వము, జవాబు, ఉత్తమము, దివ్యము మొదలయిన అర్థాలున్నాయి. పూర్వ రామచరిత్రకు పైన అంటే తరువాత ఉన్న చరిత్ర పూర్వరామ చరిత్రలో కనబడు ఇంద్రజిత్తు, ఆంజనేయుడు మొదలగువారి చరిత్రలు ఉత్తరకాండలో ఉన్నాయి. కాబట్టి పూర్వ రామచరిత్రలో సందేహాలను తీర్చేది ఉత్తరకాండ చరిత్ర; పూర్వ చరిత్రలో శ్రీరామునికి తన దివ్యత్వం తెలియదు. అందుకే 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్' అంటాడు. ఉత్తరకాండ చరిత్రకు పూర్వమే బ్రహ్మాదులు దర్శనమిచ్చి సత్యం చెప్పారు కాబట్టి ఉత్తరకాండ చరిత్రలో రామునికి తన దివ్యత్వం తెలుసు. అందుకే నారదుడు, యమధర్మరాజు శ్రీరాముని దగ్గరకు వచ్చి మాట్లాడారు. కనుక ఆ చరిత్ర దివ్యం.

పూర్వ రామచరిత్రకంటె ఉత్తరకాండ చరిత్రలో ఉత్తమ లక్షణాలు కొన్ని ఉన్నాయి. పూర్వకథలో తండ్రిగారి మాటను సత్యం చేయడం కోసం, భార్యతో, సోదరునితో అడవికి వెళ్ళాడు. ఉత్తరకథలో ప్రజలలో అపోహ కలగకుండా ఉండడంకోసం ప్రాణాధిక అయిన భార్యను వీడి జీవితమంతా కఠోరబ్రహ్మచర్యంతో గడిపాడు. ఆ స్థితిలో కూడా ప్రజలను ఆదర్శవంతంగా పాలించి రామరాజ్యమనే ఆదర్శ రాజ్యాన్ని ప్రపంచం ముందుంచాడు.

మరి శ్రీరాముని పూర్వచరిత్రానికి లోకోత్తరమయిన రామనామాన్ని వదలి మహావీరచరితమని పేరెందుకు పెట్టాడు? శ్రీరాముడు మహావీరుడు కనుక మహావీరచరితమని పేరుపెట్టాడని సమర్థించవచ్చు.

కాని కావ్యంలో రసం ధ్వనించాలి తప్ప వాచ్యం కాకూడదనే నియమం ఉంది. పేరులోనే వీరపదం ఉండడం వల్ల రసం వాచ్యమయ్యిందనే ఆక్షేపణము కలుగుతుంది.

మహావీరుడైన రాముని చరిత్రం కాబట్టి ఇది మహావీర చరిత్రము. వీరుని చరిత్రలో వీరరసం ఉంటుంది. అది పరోక్షంగా సూచితమవుతోంది. ఈ పేరుపెట్టడంలో మరో గొప్ప విషయం ధ్వనిస్తోంది.

భవభూతి వేదశాఖ తైత్తిరీయం. ఆ శాఖ ఆరణ్యకంలో ఒక కథ ఉంది. దేవతలు సత్రయాగం చేశారు. దీనివలన వచ్చే కీర్తి వారందరికీ చెందాలని వారు భావించారు. వారు కురుక్షేత్రాన్ని వేదిగా చేసికొన్నారు. ఆ సత్రంలో యజ్ఞపురుషుడైన విష్ణువు యజమానునిగా దీక్షితుడయ్యాడు. విష్ణువు సత్రయాగం చేశాడనే కీర్తి వచ్చింది. ఆయన అక్కడనుండి వెళ్ళిపోయాడు. తమకు కూడా సత్రయాగ కీర్తి కోరిన దేవతలు విష్ణువు వెంటపడ్డారు. అప్పుడు విష్ణువు ఎడమచేతినుండి ధనుస్సు, కుడిచేతి నుండి బాణాలు జన్మించాయి. ధనుర్బాణధరుడైన విష్ణువును దేవతలేమీ చేయలేకపోయారు.

ఆ విష్ణువు ధనుస్సుపై అంచు చిబుకానికి ఆనించి నిలబడ్డాడు. దేవతలాయనపై ప్రతీకారం తీర్చుకోవడానికి చెదపురుగులను ప్రేరేపించారు.

అవి మొదట మేమొక వరం కోరతాము. అది ఇవ్వండి. తరువాత మీకోసం యజ్ఞపురుషుని సాధిస్తాము' అన్నాయి. అవి ఎక్కడ త్రవ్వితే అక్కడ నీరు లభించాలని వాటి వరం. వారావరం ఇచ్చారు.

తరువాత అవి నేలపై విష్ణువు ధనుస్సు ఆనించిన చోటికి వెళ్ళి నారిత్రాటిని తినివేశాయి. ఆ ధనుస్సు తాడు తెగడంచేత పైకి లేచి, యజ్ఞపురుషుని శిరస్సును ఛేదించి పైకి ఎగురవేసింది. ఆ శిరస్సు బాగా పైకి ఎగిరి క్రిందపడింది. ఆ యజ్ఞశిరస్సు యజ్ఞంలో ప్రవర్గ్యమనే భాగం.

ఆ శిరస్సు భూమిపై పడినపుడు 'ఘ్రూం' అనే శబ్దం బయలుదేరింది. కాబట్టి యజ్ఞశిరస్సుకు ఘర్మమని పేరు వచ్చింది.

మహాత్ముడయిన యజ్ఞపురుషుని వీర్యసారమయిన శిరస్సు కనుక దానికి మహావీరమని పేరు.

ఆ యజ్ఞ శరీరాన్ని దేవతలు ప్రాతస్సవనం, మాధ్యందిన సవనం, తృతీయ సవనం అని మూడు భాగాలు చేశారు. అగ్ని ప్రాతస్సవనం, ఇంద్రుడు మాధ్యందిన సవనం, విశ్వేదేవతలు తృతీయ సవనం గ్రహించారు. శిరస్సులేని ఆ యజ్ఞం వల్ల వారి కోరికలు తీరలేదు, వారు స్వర్గాన్ని పొందలేదు.

ఈ కథ అర్థవాదం. అంటే యజ్ఞప్రక్రియ విష్ణురూపం. దానికి ప్రవర్గ్యం శిరస్సు వంటిది. దానిలో మహావీరమనే పాత్ర ప్రధానం. ప్రవర్గ్యంతో యజ్ఞం చేస్తే యజ్ఞఫలం లభిస్తుందని చెప్పడం కోసం ఈ కథ చెప్పారు. ఈ కథ యజ్ఞాన్ని ప్రవర్గ్యను ప్రశంసించడం కోసం బయలుదేరింది.

భవభూతి మహాకవి శ్రీరామ పూర్వచరిత్రకు మహావీర చరిత్రమనే పేరు పెట్టడం ద్వారా "విష్ణువు యజ్ఞరూపుడు, ఆ యజ్ఞంలో మహావీరం శిరస్సు వంటిది. సర్వస్య గాత్రస్య శిరః ప్రధానం' అని ఆర్యోక్తి. శరీరానికంతటికీ శిరస్సు ముఖ్యమని భావం.

వేదవేద్యం యజ్ఞం, ఆ యజ్ఞపురుషుడే దశరథుని ఇంట నలుగురిగా అవతరించాడు. వారే శ్రీరామలక్ష్మణ భరత శత్రుఘ్నులు. వారిలో శ్రీరాముడు మహావీరస్వరూపుడు, ఆయన ప్రధానం" అని బోధిస్తున్నాడని చెప్పవచ్చు.

ఈ విషయాన్ని బలపరిచే కొన్ని మంత్రార్థాలను గమనించాలి. నిప్పులయందు మహావీరాన్ని అభిమంత్రించే సందర్భంలో ఉన్న ఒక మంత్రంలో ఇలా ఉంది. "మహావీరమా! బాణాలను ధనుస్సును చేతులతో ధరిస్తున్నావు. కర్ణ కంఠహస్తాదుల యందు ఆభరణాలను వహించావు. ఈ జగత్తును రక్షిస్తున్నావు. నీకంటె బలమైనది మరొకటి లేదు.

శ్రీరామచంద్రుని చేతిలో ధనుర్బాణాలుండడం, ప్రవర్గ్య మహావీరాలకు మూలమయిన విష్ణువు చేతులనుండే మొదట ధనుర్బాణాలు బయలుదేరడం గమనింపదగిన విషయాలు.

పై మంత్రార్థం మహావీరానికి ప్రశంస. శ్రీరాముని విషయంలో యథాతథంగా అన్వయిస్తుంది. (తై. ఆరణ్యకం-4-5-9)

మహావీరాన్ని అభిమంత్రించే సందర్భంలో ఉన్న మంత్రభావమిది. "ఓ మహావీరమా! నీవు దేవతల మధ్యలో చాలా సుగుణాలతో కూడినదానవు. నీవు సామ్రాజ్యం కలదానవు. ప్రకాశం, దీర్ఘాయువు కలదానవు. శ్రుతాధ్యయన సంపద కలదానవు.

జడమయిన మహావీర మృణ్మయపాత్రకు ఈ లక్షణాలు అన్వయించవు. యజ్ఞంలో దాని ప్రాధాన్యాన్ని సూచించే ప్రశంసా వాక్యాలను చెప్పాలి. శ్రీరామునికి చాలా బాగా అన్వయిస్తాయి. (తై. ఆరణ్యకం 4-6-2)

మహావీరావేక్షణంలో ఒక మంత్రార్థముంది.

"మహావీరం రక్షించేది, వినాశం లేనిది, నానా మార్గాల్లో సంచరించేది, ఒకచోట ఉండేవారు, నానా మార్గాల్లో ఉండేవారు అయిన ప్రజలను నివసింపజేసేది, ఈ మహావీరము అన్ని లోకాలమధ్య మరల మరల వస్తుంది."

ఈ మంత్రార్థాలను భాష్యకారులు మహావీరాన్ని ఆదిత్యునిగా భావించి, దాని కనుగుణంగా వ్యాఖ్యానించారు. శ్రీరామునికీ విశేషణాలు యథాతథంగా వర్తిస్తాయి కనుక ఇక్కడ శ్రమ లేదు. శ్రీరామావతారాలు మరల మరల వస్తాయి కనుక మంత్రంలోని 'ఆ వరీవర్తి' అనే క్రియాపదం శ్రీరామునికి బాగా అన్వయిస్తుంది.

మహావీరావేక్షణంలోనే ఈ వాక్యాలు కూడా ఉన్నాయి. "మహావీరా! జంబూద్వీపాది భూములన్నిటికి పాలకమా! భువనాలను, అంతఃకరణాన్ని, వాక్కులను, తపస్సులను, వేదాన్ని రక్షించేదానా! నిన్ను చూస్తున్నాను."

మహావీర పాత్ర భూమిని రక్షించడం కుదరదు. కనుక దాని విషయంలో ప్రశంస శ్రీరామునికి అన్వయిస్తుంది. శ్రీరాముడు రాక్షసుల బెడద తొలగించడం ద్వారా తపస్వుల తపస్సును, వారి వేదాలను, వారి అంతఃకరణానికి ఏకాగ్రతను, వారు శపించి తమ వాక్ఛక్తిని ఖర్చు చేసుకోకుండా చేసి, వారి వాక్కులను రక్షించాడు కదా!

ఈ సందర్భంలో మహావీరం ప్రజలను పాలించేది అని వాక్యం ఉంది. (తై. ఆరణ్యకం 4-7-4) ఇది శ్రీరామునికి బాగా అన్వయిస్తుందని స్పష్టం. ఇలాంటిదే ఇంకొక వాక్యం కూడా ఉంది.

శ్రీరాముని గురించి 'స హి విష్ణు స్సనాతనః' అని వాల్మీకి మహర్షి చెప్పడం వల్ల మాత్రమే కాదు వేదం వల్ల కూడా శ్రీరాముడు విష్ణు మూర్త్యవతారమని మహావీర చరితమనే పేరు ద్వారా వేదశాస్త్ర పండితుడైన భవభూతి సూచిస్తున్నాడు.

మరి మంత్ర రామాయణంలో శ్రీరామకథ ఉంది కదా! అని అనవచ్చు. కొన్ని ఋగ్వేద మంత్రాలను శ్రీరామకథాపరంగా మంత్ర రామాయణంలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య ఆధునికము. సాయణాచార్యుల వారీమంత్రాలను ఇలా వ్యాఖ్యానించలేదు. సాయణాచార్యుల వారికంటె సుమారు ఆరువందల సంవత్సరాలు ముందున్న భవభూతి తైత్తిరీయశాఖలో శ్రీరాముడు విష్ణువు అవతారమని సూచించబడిందని గుర్తించడం విశేషం. మంత్ర రామాయణ మంత్రాలు ఋగ్వేదంలోనివి. భవభూతి తైత్తిరీయ యాజుషశాఖీయుడు. కనుక భవభూతి 'మహావీర' మంత్రరామాయణంచే గతార్థం కాదు.

ఒక వేదశాస్త్ర పండితుడు కవి అయితే ఆయన రచనలో వేదశాస్త్ర విషయాలు తొంగిచూస్తాయి.

* * *

# హరప్పా అవశేషాలలో శివావతారాలు

భారతదేశంలో హరప్పా వంటి గ్రామాలలో నిర్వహించిన త్రవ్వకాలలో లభించిన అవశేషాలలో శివుని అవతార చిత్రాలు (ముద్రికలు) కొన్ని లభించాయి. ఇవి భారతదేశంలో ఐదువేల సంవత్సరాల వెనుక శివారాధన ఉందనడానికి ఆధారాలు.

హరప్పా అనే పదబంధంలో 'హర' పదం శివునికి పర్యాయనామం. హృ ఇన్ హరణే అనే ధాతువు నుండి హరపదం ఏర్పడింది. హారతి ప్రళయే సర్వమితి హారం – ప్రళయకాలంలో సర్వం హరించువాడు అని ఒక అర్థం. భక్తుల పీడను హరించువాడు అని మరియొక అర్థం.

మొహంజొదారో తవ్వకాలలో పశుపతి దేవుని ముద్రిక దొరికింది. పక్కన పశువులుండడం వల్ల దీనికి పశుపతి అని పేరు పెట్టి ఉంటారు. పశుపతి శివుని పర్యాయపదం (అమరకోశం 1–30). ఈ ముద్రికలో రుద్రుని తలపై పాము, దానికి అయిదు తలలు, దానికి తలపై మణి, మధ్యలో గంగాప్రవాహం పైకి చిమ్ముతున్న స్థితి, రుద్రుని తలపై మరొక పక్క అర్ధచంద్రుడు కనబడుతున్నాడు.

చిత్రంలో కుడివైపున దేవనాగరి ప్రణవం ఉంది. ముద్రికలో ఏనుగు బొమ్మ, మనిషి బొమ్మ, దానికింద ఆయుధం ఉన్నాయి. రుద్రునికి అలంకారాలు, కవచం కనబడుతున్నాయి. దీనికి మూడు తలలు గల పశు పతి దేవుని ముద్రిక అని పేరు పెట్టారు చరిత్రకారులు. కాని మూడు తలలు లేవు. జుట్టులేని ఒకే శిరస్సు ఉంది (తర తరాల భారత చరిత్ర. పుట 21). కొందరు రెండు కొమ్ముల దేవుడు అన్నారు (చరిత్రలో మతాలు, పుట 2). అవి కొమ్ములు కావు. ఒకటి సర్పము, రెండవది అర్ధచంద్రుడు. ఇది వేదం మొదలైన గ్రంథాలలో వర్ణించిన రుద్రరూపమని 'శ్రుతిసౌరభం' గ్రంథంలోనూ, సింధు సంస్కృతి – నమకంలోని 'రుద్రుడు' అనే వ్యాసంలోనూ

నిరూపించడం జరిగింది (వేదపరిషత్ వార్షిక సంచిక 20-02-2003, 64, 65 పుటలు).

ప్రణవానికి పరమున గలవాడు పరమేశ్వరుడని తైత్తిరీయారణ్యకము అనే వేదభాగం చెప్పింది (10 ప్ర. 12 అ. 3 ప.). శివధ్యానాల్లో తలపై చంద్రుడు, గంగ ఉండడం ప్రసిద్ధమే. రుద్రునికి గంగాధరుడని పేరు. గంగని తలపై ధరించినవాడని అర్థం. శివాష్టోత్తర శతనామ స్తోత్రంలో కూడా ఈ నామముంది (అమర- 1-54). భయః అని మరొక పేరు (అమరం 1-35). వీరివల్ల భయపడతారు అని అర్థం. నమకంలో 'ఉగ్రాయ' అనే నామం ఉంది. తీవ్రమైనవాడు అని అర్థం. హరప్పా రుద్రుని చూస్తే భయం కలుగుతుంది.

శివ సహస్రనామ స్తోత్రంలో గజేశ్వర, నరర్షభ అనే నామాలున్నాయి (148 శ్లో.). పశుపతిదేవుని ప్రక్కన ఎడమవైపు ఏనుగునూ, మనుష్యునీ చిత్రించారు. శివ సహస్రనామ స్తోత్రంలో ముండః= తలపై జుట్టు లేనివాడు అనే నామముంది. పశుపతి దేవునికి జుట్టు లేదు. నమకంలో వ్యస్తకేశ నామముంది. దీనికి కూడా అదే అర్థం. నమకంలో తారాయ అనే నామముంది. ప్రణవస్వరూపుడని అర్థం. పశుపతి దేవుని ప్రక్కన ప్రణవముంది.

నమకంలో 'కవచినే' అనే నామముంది. కవచం కలవాడు శివుడు. పశుపతిదేవునికి కవచం ఉంది. నమకంలో 'పశుపతయే' అనే నామం ఉంది. పశుపతిదేవుని ముద్రిక అని పేరులోనే ఉంది కదా!

'ఆయుధినే' అని నమకంలో ఉంది. ఆయుధం కలవాడు అని అర్థం. పశుపతి పక్క బాణాయుధం ఉంది కదా! నమకంలో కూడా ఇషువు కలవాడని తెలిపే నామం ఉంది (కృష్ణయజుర్వేదం 4 అ. 5ప.). రుద్రునికి నందీశ్వరావతారం ఉంది (శివపురాణం శత రుద్ర సం.6 అ.). శివునికి

వృషభావతారం ఉంది (శివపు. శతరుద్ర సం. 23 అ.). హరప్పా అవశేషాలలో వృషభ చిత్రముంది.

రుద్రునికి ద్విజేశ్వరావతారం, ద్విజావతారం ఉన్నాయి (శివపు. శతరుద్ర - 27, 35 అ.). హరప్పా అవశేషాలలో యజ్ఞోపవీతం వలె వస్త్రాన్ని ధరించిన ద్విజ చిత్రం ఉంది. యజ్ఞోపవీతం ఉత్తరీయం వలె ధరించమని వేదంలో ఉంది (తైత్తిరీయ ఆరణ్యకం. 2 ప.).

కొమ్ములుంటాయి. తలపై సర్పముండదు. హరప్పా అవశేషాలలో నందీశ్వరరూపముంది. రుద్రునికి కిరాతేశ్వరావతారముంది. (శివపు. శతరుద్ర. 37 అ.). హరప్పా అవశేషాలలో కిరాత చిత్రముంది.

ఇలా పేరు, వేదం, శివపురాణాల్లో, శివాష్టోత్తర శతనామ స్తోత్రం, శివ సహస్రనామ స్తోత్రం అనే గ్రంథాల ద్వారా పరిశీలిస్తే హరప్పా సంస్కృతిలో శివారాధన ఉందని తెలుస్తోంది. ఆసక్తి కలవారు కోరితే ఈ అవతార కథలను కూడా తెల్పవచ్చు.

* * *

# ఆరాధన - అనుభూతి

హిందువులు విగ్రహారాధన చేస్తారని ఇతర మతాలవారు ఆక్షేపిస్తుంటారు. కొందరు విగ్రహారాధన చేస్తున్నామనుకుంటారు. మరికొందరు విగ్రహారాధన తీవ్రంగా ఖండిస్తుంటారు. ఈ విషయం పరిశీలింపదగింది. రాజకీయ నాయకులు నాలుగు వీధుల మొదట్లో విగ్రహాలు నెలకొల్పడం, వాటికి పాలాభిషేకం చేయటం, పూలదండలు వేయడం.

కానీ దేవతారాధన విగ్రహారాధన కాదు తన హృదయంలో చైతన్యరూపంలో ఉన్న దేవుని / దేవతను శ్వాసద్వారా బయటకు వచ్చినట్లు భావించి, తనయెదుట ఉన్న విగ్రహంలో ఆవహించినట్లు భావించి పూజ చేయాలి. ఇది మనకు శ్రీచక్రార్చనలో స్పష్టంగా కనబడుతుంది. వేదమంత్రం చేతనో, తంత్ర మంత్రం చేతనో దేవతను ఆవహించినట్లు భావించి పూజించడం సామాన్య పూజావిధానంలో కనబడుతుంది. పూజ పూర్తైన పిదప ఉద్వాసన చెబుతారు అంటే సాగనంపడం అన్నమాట. శ్రీచక్రార్చనలోనైతే ఆ దేవత హృదయంలో చేరినట్లు భావన చేస్తారు. విగ్రహం ఆధారం. అర్చన దేవతకే చేస్తున్నారు. ఇంట్లో చేసే పూజకు గుడిలో నిర్వహించే పూజకు తేడా ఉందా అన్న ప్రశ్న కలుగవచ్చు.

ఇంట్లో చేసే పూజలో ఇష్టదేవుని ధ్యానం చేసి, ఆవాహన చేసి పూజిస్తారు. కేవలం దేవతను ఆవాహన చేసి అర్చించడం కంటే పీఠపూజ చేసిన తర్వాత దేవతకు ఆవాహనం, పూజ చేస్తే మనసులో భావన ఎక్కువ నిలబడి ఎక్కువ ఫలం కలుగుతుంది. పీఠపూజ చేసి పరివారముతో కూడా ఇష్టదేవతను పూజిస్తారు.

శివుని పూజించే వారు శివమందిరం దగ్గర ఉన్న ద్వారలక్ష్ములను పూజిస్తారు. తూర్పుద్వారంలో విధాత, చిచ్ఛక్తి మాయ, క్రియాశక్తి దుర్గ

గణపతి క్షేత్రపాలకుడు మధ్యలో వాస్తుపురుషుడు వీరిని పూజించాలి. పశ్చిమ ఉత్తర దక్షిణ ద్వారాలలో ద్వారలక్ష్ములను పూజించాలి. ఆపైన పృథ్విని, చంద్రమండలాధిపతి అయిన రుద్రుణ్ణి, సత్త్వరజస్తమో గుణాలను, ఆత్మను, పరమాత్మను, పీఠశక్తులను పూజించి శివుని ఆవాహన చేస్తారు. శివునికి ముందు బ్రహ్మ విష్ణువులను, దక్షిణంలో స్కంద వినాయకులను, వెనుక శూలాన్ని మహాకాలుని, ఉత్తరంలో ఉమాదేవిని నందికేశ్వరుని, ఆవాహన చేసి తర్వాత పూజ చేస్తారు. ఇలా పరివార దేవతలతో కలిపి ఈశ్వర పూజచేస్తే హృదయంలో ఈశ్వర భావన ఎక్కువగా కలిగి దివ్యానుభూతి కలుగుతుంది. శ్రీ సత్యనారాయణ వ్రతం, శ్రీ చక్రార్చన మొదలైనచోట్ల కూడా పరివార దేవతల ఆవాహన, అర్చన ఉండటం వలన ఎక్కువ సమయం పడుతుంది. శ్రీ చక్రార్చనలో న్యాసాలు ఎక్కువగా ఉంటాయి. రుద్రాభిషేకంలో ముందు మహాన్యాసం ఉంటుంది కదా! ఇది కూడా అటువంటిదే.

వీటివల్ల విశేషానుభూతి కలుగుతుంది. కేశవాది నామాలతో చేసే ఆచమనానికి న్యాసాలు ఉంటాయి. వీటివల్ల ప్రాణాయామం వల్ల మనసు ఏకాగ్రత అవుతుంది. చిత్తైకాగ్రత వల్ల కూడా మంచి అనుభూతి కలుగుతుంది. ప్రధాన దేవతలు మారితే పరివార దేవతలు మారతారు. కొన్ని వ్రతాల పూజావిధానం కూడా మారుతాయి. ఇంటిలో పూజకు దేవాలయంలో పూజకు తేడా ఉంటుందన్న ప్రశ్న కలుగవచ్చు. దేవతా విగ్రహాల ప్రతిష్ఠ సమయంలో అధిదేవతా ప్రత్యధిదేవతాసహితంగా నవగ్రహాలకు, వాస్తుదేవతలకు, 64 యోగినులకు, 49 క్షేత్రపాలకులకు, గణేషునకు, గౌరీ మొదలైన మాతృకాదేవతలకు, బ్రాహ్మి మొదలైన మాతృకలకు, అష్టవసువులకు, ద్వాదశాదిత్యులకు, ఏకాదశ రుద్రులకు, సప్త మరుద్గణాలకు, షష్ట వినాయకులకు ఆవాహనం, పూజ, హోమం చేస్తారు. దేవాలయమంటే సకల దేవతాసహితమైన ప్రధాన దేవుని నివాసస్థానమన్నమాట. ఇదికాక దేవాలయాల ప్రతిష్ఠలో ప్రధాన దేవతా మంత్రాన్ని అత్యధికంగా జపించి ధారపోయడం జరుగుతుంది. శ్రీ అద్దేపల్లి

కృష్ణశాస్త్రి గారు గొప్ప మంత్ర శాస్త్రవేత్త, శాస్త్ర పండితుడు కాబట్టి వీరిచేత అన్నవరంలో శ్రీ వీరవెంకట సత్యనారాయణ ప్రతిష్ఠ గావించారు. వీరు నలభై రోజులు జపమాచరించి ధారపోశారని ప్రసిద్ధి.

ఇంతేకాదు దేవాలయంలో ఆగమాలు సంహితలలో చెప్పిన విశేష ఉత్సవాలు నిర్వహిస్తారు. ఎంత అధికంగా పూజలు నిర్వహిస్తే అంత అధికంగా అనుభూతి కలుగుతుంది. ఈ వివేచనవల్ల హిందువులది విగ్రహారాధన కాదని విగ్రహం ఆధారంగా చేసుకుని వారు దేవతారాధన చేస్తున్నారని తెలుస్తుంది. కేవలం దేవతారాధన కంటే పరివార సహిత ఆరాధన విశేషానుభూతి కలిగిస్తుందని అంతకంటే ప్రతిష్ఠాత్మకం విశేష పూజలు మొదలైనవి ఉన్నందువల్ల దేవాలయంలో మరింత విశేషానుభూతికి అవకాశం ఎక్కువగా ఉందని తెలుస్తుంది. భక్తి ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువగా అనుభూతి లభిస్తుంది. దేవాలయంలో ప్రధానమూర్తి మరియు పరివారసహిత మూర్తులను అర్చించే సంప్రదాయాన్ని అధ్యయనం చేసి భక్తితో పూజించే అర్చకులను మాత్రమే నియోగించవలెను. ఆ సంప్రదాయాలు తెలియనివారిని ఇతర సంప్రదాయాల వారిని పూజలకు నియమిస్తే ప్రతిష్ఠమూర్తుల మరియు పరివారదేవతామూర్తుల పూజలకు లోటు ఏర్పడవచ్చు. దేవాలయంలో విశేషం ఉండటంవలనే అప్పకవి మొదలైన కవిపుంగవుల కలలో దేవతామూర్తులూ కనపడటం, వారు గ్రంథస్తం చేయడం జరిగింది. ఇటువంటి ఆరాధనవల్లనే అతిప్రాచీనమైన హిందూధర్మం ఇప్పటికీ నిలబడి వర్ధిల్లుతోంది. ఈ పరిశీలనలో హిందువులు విగ్రహాలను ఆరాధించారని తెలుస్తోంది. విగ్రహాలయందు దేవతలను ఆవాహన చేసి తాము విశేష అనుభూతులను పొందుతూ ఇతరులకు కూడా ఆ అనుభూతులను కల్గించే విధానాలు హిందూధర్మంలో ఉన్నాయని గ్రహించవలెను.

**ధర్మస్య జయోఽస్తు అధర్మస్య నాశోఽస్తు**
**లోకా స్సమస్తా స్సుఖినో భవంతు**

# మృత్యువు

మృత్యుదేవత బ్రహ్మ గుదస్థానాన్నుండి పుట్టిందనే వాక్యం పెద్దపేగు సరిగా పని చెయ్యకపోవడం అనేక అనారోగ్యాల ద్వారా మృత్యువుకు చేరువ చేస్తుందని కూడా ధ్వనింపజేస్తుంది.

**శ్లో. పాయుర్యమస్య మిత్రస్య పరిమోక్షస్య నారద**
**హింసాయాః నిర్‌ఋతే ర్మృత్యో ర్నిరయస్య గుదం స్మృతమ్ ॥**
**- శ్రీమద్భాగవతం, 2 స్కం, 5 అధ్యాయః**

సృష్టికర్త అయిన బ్రహ్మ పాయ్వింద్రియం యమునికి, మిత్రునకు, విసర్జనకు జననస్థానం. ఆయన గుదము నిర్‌ఋతికి, మృత్యువుకు, నరకమునకు జన్మస్థానం. మలం ప్రేగులో నిలువ ఉన్నందున తామస భావాలు కలుగుతాయని, వాటివల్ల పాపాచరణం, దానివల్ల నరకం కలుగుతాయని, చెడునడత వల్ల మృత్యువు చేరువ అవుతుందనే భావం కూడా వస్తుంది. మృత్యువు సంతానాదికాన్ని ఇలా వర్ణించారు.

**శ్లో. మృత్యోర్వ్యాధిర్జరా శోక తృష్ణా క్రోధాశ్చ జజ్ఞిరే**
**దుఃఖోత్తరాః స్మృతాహ్యేతే సర్వేచాధర్మలక్షణాః**
**నిర్‌ఋతిశ్చ తథాచాన్యా మృత్యోర్భార్యా భవన్మునే**
**అలక్ష్మీర్నామ తస్యాశ్చ మృత్యోః పుత్రాశ్చతుర్దశ**
**అలక్ష్మీ సూచకాహ్యేతే మృత్యోరాదేశకారిణః ॥**

మృత్యువునకు వ్యాధి, ముసలితనం, శోకం, తృష్ణ, క్రోధం, దుఃఖం జన్మించాయి. ఇవన్నీ అధర్మ లక్షణం కలవి.

మృత్యువుకు మరొక భార్య నిర్‌ఋతి. ఆమెకు అలక్ష్మి అని మరో పేరు. ఈ మృత్యువుకు సంతానం పద్నాలుగురు. వీరు అలక్ష్మిని సూచించేవారు, మృత్యువు ఆదేశాన్ని ఆచరిస్తారు.

**శ్లో. వినాశకాలే చ నరాన్ భజన్త్యేతే శ్రుణుష్వతాన్**

వీరు వినాశకాలమందు నరులను సేవింతురు. వీరి గురించి చెప్పెదను వినుము.

**శ్లో. ఇన్ద్రియేషు దశస్వేతే తథా మనసి చ స్థితాః**
**స్వేస్వే నరం స్త్రియం వాపి విషయే యోజయన్తి చ**
**తథేన్ద్రియాణి చాక్రమ్య రాగ లోభాదిభిర్నరాన్**
**యోజయన్తి తథా హానిం యాని ధర్మాదిభిర్ద్విజ**
**అహఙ్కార గతాశ్చాన్యే తథాన్యే బుద్ధిసంస్థితాః**
**వినాశాయ నరస్త్రీణాం యతన్తే మోహసంశ్రయాః**
**ఏవం త్వధర్మేణోత్పన్నా సర్వే చాపి భయఙ్కరాః ॥**

**మార్కండేయ పురాణం దుఃసహానుశాసనం, విష్ణుపురాణం,**
**ప్రథమోంశం, 7 అధ్యాయ**

ఈ మృత్యుకుమారులు 10 ఇంద్రియములందు మనసునందు ఉన్నవారై మనుష్యుని, స్త్రీని తమ తమ విషయాలందు చేర్చుదురు. ఇంద్రియాల నాక్రమించి నరులకు రాగలోభాదులను కలిగిస్తారు.

ధర్మాదులచే వీరు హానిని పొందుతారు. వీరిలో కొందరు అహంకారాన్ని, కొందరు బుద్ధిని మోహాన్ని ఆశ్రయించి నరులకు, స్త్రీలకు వినాశం కలిగించడానికి ప్రయత్నిస్తారు. ఇలా అధర్మంతో కలిగిన వారందరూ మోహాన్ని కల్గిస్తారు. వీరందరూ భయంకరులు.

**మృత్యువును సూచించే అరిష్టాలు**

**అరిష్టాని మహారాజ శ్రుణు వక్ష్యామి తాని తే**
**యేషామాలోకనాత్ మృత్యుం నిజం జానాతి యోగవిత్**
**దేవమార్గం ధ్రువం శుక్రం సోమచ్ఛాయామరున్ధతీమ్**

**యో న పశ్యేన్న జీవేత్సనరః సంవత్సరాత్ పరమ్**
**అరశ్మి బిమ్బం సూర్యస్య వహ్నిఞ్చైవాంశుమాలినమ్**
**దృష్ట్వైకాదశ మాసేభ్యో నరో నోర్ధ్వం స జీవతి**
**వాన్త్యాం మూత్రే పురీషే వా సువర్ణం రజతం యథా**
**ప్రత్యక్షమథవా స్వప్నే జీవితం దశమాసికమ్**
**దృష్ట్వా ప్రేత పిశాచాదీన్ గన్ధర్వ నగరాణి చ**
**సువర్ణ వర్ణాన్ వృక్షాంశ్చ నవమాసాన్ స జీవతి**
**స్థూలః కృశః కృశః స్థూలో యో కస్మాదేవ జాయతే**
**ప్రకృతే చ నివర్తేత తస్యాయుశ్చాష్టమాసికమ్**
**ఖణ్డం యస్య పదం పార్ష్ణ్యోః పాదస్యాగ్రేథవా భవేత్**
**పాంశు కర్దమయోర్మధ్యే సప్తమాసాన్ స జీవతి ॥**

**భావం :** రాజా! అరిష్టములను చెప్పెదను. యోగవేత్త వాటిని చూచుట వల్ల తన మృత్యువును ముందే గుర్తించగలడు. దేవమార్గాన్ని (పాలపుంత) ధ్రువుని, శుక్రుని, చంద్రచ్ఛాయను, అరున్ధతిని చూడలేడో (కనబడవో) అతడు సంవత్సరం తర్వాత జీవించడు.

కిరణాలు లేని సూర్యబింబాన్ని, కిరణాలు గల అగ్నిని చూసిన నరుడు పదకొండు నెలల తర్వాత జీవించడు. వాంతియందు, మూత్రమందు, మలమందు బంగారాన్ని, వెండిని గాని మెళుకువలో గాని, కలలో గాని చూసినవాని జీవితం పది నెలలు.

ప్రేత పిశాచాదులను, గంధర్వ నగరాలను, బంగారు రంగుగల వృక్షాలను చూసినవాడు తొమ్మిది నెలలు జీవిస్తాడు.

లావుగా ఉన్నవాడు సన్నని వానిగాను, సన్నగా ఉన్నవాడు లావుగాను అకస్మాత్తుగా మారితే, అతని స్వభావం మారితే అతనికి ఆయువు ఎనిమిది నెలలు. ధూళి, కొంచెం బురద ఉన్నచోట పాదం ఉంచినప్పుడు ఆ

పాదముద్రలో మడమ దగ్గర, అగ్రభాగమందు ఖండములైనట్లు కనబడితే అతడు ఏడునెలలు జీవిస్తాడు.

**శ్లో. కపోత గృధ్ర కాకో వా వాయసో వాపి మూర్ధని**
**క్రవ్యాదో వా ఖగో లీనః షణ్మాసాయుః ప్రదర్శకః**

పావురం, గ్రద్ద, మాలకాకి, కాకి వాలితే లేదా మాంసం తినే మరే పక్షి అయినా తలపైన దిగితే వారికి ఆరునెలలు ఆయువు అని సూచన.

**శ్లో. హన్యతే కాక పంక్తీభిః పాంశు వర్షైశ్చ వా పునః**
**స్వచ్ఛాయా ఞ్చాన్యథా దృష్ట్వా పఞ్చమాసాన్ స జీవతి ॥**

కాకుల పంక్తితో కొట్టబడినా, ధూళివర్షంతో కొట్టబడినా తన నీడ వేరొక విధంగా కనబడినా అతడైదు నెలలు జీవిస్తాడు.

**శ్లో. అనభ్రే విద్యుతం దృష్ట్వా దక్షిణాం దిశమాశ్రితామ్**
**పయసేంద్ర ధనుర్వాపి జీవితం ద్విత్రిమాసికమ్**

మేఘం లేనిచోట దక్షిణదిక్కున మెరుపును చూసినను నీటిలో ఇంద్రధనువు కనబడినా అతని జీవితం రెండు మూడు నెలలుండును.

**శ్లో. ఘృతే తైలే తథాఽదర్శే తోయే వాచాత్మనస్తనుమ్**
**యః పశ్యే దశిరస్కాం వా మాసాదూర్ధ్వం న జీవతి**

నేతియందు, నువ్వుల నూనెయందు, అద్దమందు, నీటియందు తన శరీర ప్రతిబింబం శిరస్సు లేకుండా కనబడితే అతడు నెలపైన బ్రతకడు.

**శ్లో. యస్య బస్తసమో గన్ధో గాత్రే శవ సమోపి వా**
**తస్యార్ధమాసికం జ్ఞేయం యోగినో నృపజీవితమ్ ॥**

ఎవని శరీరం మేక కంపుగాని, శవం కంపుగాని వస్తుందో 15 రోజులు జీవితకాలం అని తెలియాలి.

**శ్లో. యస్య వై స్నాతమాత్రస్య హృత్పాదమవశుష్యతి**
**పిబతశ్చ జలం శోషో దశాహం సోపి జీవతి ॥**

స్నానం చేసినంతనే హృదయం, పాదం ఎండిపోయినవాడు, నీరు త్రాగుతుంటే (నోరు) ఎండిపోవుచున్నవాడు పదిరోజులు జీవిస్తాడు.

**శ్లో. స్తమ్భితో మారుతో యస్య మర్మస్థానాని కృన్తతి**
**న హృష్యత్యమ్బు సంస్పర్శాత్తస్య మృత్యురుపస్థితః ॥**

గాలి లోపల స్తంభించినదై మర్మస్థానాలను కోయుచున్నవానికి నీటి స్పర్శతో సంతోషం కలుగనివానికి మృత్యువు దగ్గరికి వచ్చెనని తెలియాలి.

**శ్లో. ఋక్షవానరయుగ్మస్థో గాయన్ యో దక్షిణాం దిశమ్**
**స్వప్నే ప్రయాతి తస్యాపి న మృత్యుః కాలమృచ్ఛతి ॥**

ఎలుగుబంట్లు కోతుల జంటయందు ఉండి, పాడుతూ దక్షిణ దిక్కునకు వెళ్ళినట్లు కల వచ్చినవానికి మృత్యువు అచిరకాలములోనే వచ్చును.

**శ్లో. రక్తకృష్ణామ్బరధరా గాయన్తీ హసతీ చయమ్**
**దక్షిణాశాం నయేన్నారీ స్వప్నే సోపి న జీవతి ॥**

ఎరుపు నలుపు వస్త్రం ధరించిన కాంత పాడుతూ నవ్వుతూ దక్షిణదిక్కుకు తీసుకువెళ్ళినట్లు కలలో కనబడినవాడు జీవించడు.

**శ్లో. నగ్నం క్షపణకం స్వప్నే హసమానం ప్రదృశ్య వై**
**ఏణం వా వీక్ష్య వల్గన్తం విద్యాన్మృత్యు ముపస్థితమ్ ॥**

నవ్వుచున్న దిగంబరుని, బౌద్ధ సన్యాసిని, గంతులు వేయు లేడిని కలలో చూసినవానికి మృత్యువు సమీపానికి వచ్చెనని తెలుసుకోవాలి.

**శ్లో. ఆమస్తక తలాద్యస్తు నిమగ్నం పఙ్కసాగరే**
**స్వప్నే పశ్యేత్తథాత్మానం నరః సద్యో మ్రియేత సః ॥**

తాను బురద సముద్రంలో తలపై వరకు కూరుకుపోయినట్లు కలలో చూసినవాడు వెంటనే మరణించును.

**శ్లో. కేశాఙ్గారాం స్తథా భస్మ భుజగం నిర్జలాం మహీమ్**
**దృష్ట్వా స్వప్నే దశాహన్తు మృత్యురేకాదశేహని ॥**

జుట్టు, బొగ్గులు, బూడిద, పాము, నీళ్ళు లేని నేలలను కలలో చూసినవానికి పదిరోజులు ఆయువు, పదకొండవ రోజు మృత్యువు రావచ్చు.

**శ్లో. కరాలై ర్వికటైః కృష్ణైః పురుషైరుద్యతాయుధైః**
**పాషాణైః స్తాడితః స్వప్నే సద్యో మృత్యుం సమాప్నుయాత్ ॥**

భయంకరమైన, వికృతమైన నల్లని పురుషులు ఆయుధములెత్తి రాళ్ళతో కొట్టినట్లు కల వచ్చినవాడు వెంటనే మృత్యువును పొందును.

**శ్లో. సూర్యోదయే యస్య శివాక్రోశన్తో యాన్తి సమ్ముఖమ్**
**విపరీతం పరీతం వా స సద్యో మృత్యు మృచ్ఛతి ॥**

ఎవనికి సూర్యోదయమందు నక్కలు అరచుచు అభిముఖంగా వస్తాయో, ప్రతికూలంగా కాని, చుట్టుకుని గాని అలా చేస్తాయో వాడు వెంటనే మృత్యువును పొందుతాడు.

**శ్లో. యస్య వై భుక్తమాత్రేపి హృదయం పీడ్యతే క్షుధా**
**జాయతే దన్త సంఘర్షః స గతాయు రసంశయః ॥**

అన్నం తిన్నా ఆకలితో హృదయం పీడింపబడినవాడు (తన ప్రయత్నం లేకుండా) దంతములు కొరుకుకున్నవాడు ఆయువు సమాప్తి అయినవాడు. సంశయము లేదు.

**శ్లో. దీపాది గన్ధం నో వేత్తి వమత్యగ్నిం తథా నిశి**
**నాత్మానం పరనేత్రస్థం వీక్షతే న స జీవతి ॥**

దీపాదుల వాసన నెరుగనివాడు, రాత్రి అగ్ని కక్కుతున్నట్లు కనబడినవాడు, ఇతరుల కన్నులలో తన ప్రతిబింబమును చూడలేనివాడు జీవించడు.

**శ్లో. శక్రాయుధ ఞ్చార్ధరాత్రే దివా గ్రహగణం తథా**
**దృష్ట్వామన్వేత సంక్షీణమాత్మ జీవిత మాత్మవాన్ ॥**

అర్ధరాత్రి ఇంద్రధనుస్సును, పగలు గ్రహగణమును చూసినవాడు తన ఆయువు బాగా క్షీణించెనని తలచవలెను.

**శ్లో. నాసికా వక్రతామేతి కర్ణయోర్నబ్రతోన్నతౌ?**
**నేత్రఞ్చ వామం స్రవతి యస్య తస్యాయురుద్గతమ్ ॥**

ముక్కు వంకరగా అగుట, చెవులు ఎత్తుగా అగుట, ఎడమకన్ను ఓడుచుండుట ఏర్పడినవానికి ఆయువు పూర్తి అగును.

**శ్లో. ఆరక్తతామేతి ముఖం జిహ్వా వాపి సితా తథా**
**తదా ప్రాజ్ఞో విజానీయాత్ మృత్యుమాసన్నమాత్మనః ॥**

ముఖము కొంచెమెర్రబడుట, నాలుక తెల్లబడుట అను మార్పులేర్పడినప్పుడు తనకు మృత్యువు సన్నిహితమైందని తెలియవలెను.

**శ్లో. ఉష్ట్రరాసభయానేన యః స్వప్నే దక్షిణాం దిశమ్**
**ప్రయాతి తం విజానీయాత్ సద్యో మృత్యుం నరేశ్వర ॥**

ఒంటె గాడిదలను వాహనంగా చేసుకొని దక్షిణదిక్కుకు వెళ్ళినట్లు కల వచ్చిన వానికి వెంటనే మృత్యువు కలుగునని తెలుసుకోవాలి.

**శ్లో. పిధాయ కర్ణే నిర్ఘోషం న శ్రుణోత్యాత్మసమ్భవమ్**
**నశ్యతే చక్షుషో ర్జ్యోతిః యస్య సోపి న జీవతి**

చెవులు మూసుకొన్నప్పుడు ఆత్మనుండి కలిగిన ధ్వనిని విననివాడు కన్నుల కాంతి నశించినవాడు జీవించడు.

**శ్లో. పతతో యస్య వై గర్తే స్వప్నే ద్వారం పిధీయతే**
**నచోత్తిష్ఠతి యః శ్వభ్రాత్ తదన్తంతస్య జీవితమ్**

గోతిలో పడినప్పుడు ద్వారం మూయబడగా అతడు మరలా ఆ గోతినుండి లేవనట్లు కల వచ్చిన వానికి జీవితం ముగిసినట్లే.

**శ్లో. ఊర్ధ్వా చ దృష్టిః న చ సంప్రతిష్ఠా**
**రక్తా పునః సంపరివర్తమానా**
**ముఖస్య చోష్మా శిశిరా చ నాభిః**
**శంసన్తి పుంసా మపరం శరీరమ్**

ఊర్ధ్వముగా ఉన్న దృష్టి సరిగా అంతటా చూడలేకపోయిన యెడల ఎర్రటి దృష్టి అంతటా తిరుగుచున్న యెడల, ముఖమునందలి వెచ్చదనము చల్లబడిన యెడల, నాభి చల్లగా ఉన్నయెడల వాడికి మరొక శరీరం వచ్చునని చెప్పుదురు.

**శ్లో. స్వప్నేఽగ్నిం ప్రవిశేద్యస్తు న చ నిష్క్రమతే నరః**
**జలప్రవేశాదపి వా తదన్తం తస్య జీవితమ్**

కలలో అగ్నిలో ప్రవేశించినవాడు దానినుండి వెనుకకు రానియెడల లేదా నీటిలో ప్రవేశించి తిరిగిరాని యెడల అదే వాడి జీవితానికి అంతమని చెప్పవచ్చు.

**శ్లో. యశ్చాభిహన్యతే దుష్టైః భూతైః రాత్రావథో దివి**
**స మృత్యుం సప్తరాత్రాన్తాత్ పుమానాప్నోత్యసంశయమ్**

దుష్టభూతములతో పగలు గాని, రాత్రి గాని చంపబడినట్లు కలను పొందినవాడు ఏడు రోజుల్లో మృత్యువును పొందును. సంశయము లేదు.

**శ్లో. స్వవస్త్రమమలం శుక్లం రక్తం పశ్యత్యథోఽసితమ్**
**యః పుమాన్ మృత్యు మాపన్నం తస్యాపి హి వినిర్దిశేత్**

తన స్వచ్ఛమైన తెల్లవస్త్రం ఎర్రగా, నల్లగా కనబడిన వానికి త్వరలో మృత్యువు కలుగునని చెప్పవచ్చు.

**శ్లో. స్వభావ వైపరీత్యన్తు ప్రకృతేశ్చ విపర్యయః**
**కథయన్తి మనుష్యాణాం సమాసన్నౌ యమాన్తకౌ**

స్వభావంలో పూర్తిగా విరుద్ధమైన మార్పు కలిగినను వాత పిత్త శ్లేష్మ ప్రకృతులలో పూర్తి విరుద్ధమైన మార్పు వచ్చినను యముడు మృత్యువు బాగా చేరువకలరని చెప్పుచున్నారు.

**శ్లో. యేషాం వినీత స్సతతం యస్య పూజ్యతమా మతాః**
**తానేవ యో వజానాతి తానేవ చ వినిన్దతి**
**దేవతా నార్చయే ద్విప్రాన్ గురూన్ విప్రాంశ్చ నిన్దతి**
**మాతాపిత్రో రసత్కారం జామాతృాణాం కరోతి యః**
**యోగినాం జ్ఞానవిదుషా మన్యేషాఞ్చ మహాత్మనామ్**
**ప్రాప్తాన్తకాలః పురుషః తద్విజ్ఞేయం విచక్షణైః**

తనకు బాగా పూజింపదగిన వారిపట్ల సదా వినయంతో ప్రవర్తించినవాడు వారిని అవమానించిన యెడల అతనికి మృత్యువు చేరువ అయ్యెనని చెప్పుదురు. దేవతలను పూజింపనివాడు, వృద్ధులను, గురువులను, వేదవిదులను నిందించువాడు, తల్లిదండ్రుల నవమానించువాడు, యోగులను, జ్ఞానులను, పండితులను, ఇతర మహాత్ములను నిందించువాడు మృత్యువును తొందరగా చేరుదురని వివేకులు తెలిసికొనవలెను. యోగి ఈ అరిష్టాలను ఎల్లప్పుడు గమనించాలి. ఈ విషయాల నెరిగినవాడు సంవత్సరాంతంలో రాత్రిగాని, పగలు గాని ఈ అరిష్టములు సూచించిన ఫలము కలుగునని తెలుసుకోవాలి. భయపడువాడు ఈ ఫలాలను గమనించాలి. (తన కర్తవ్యాలను నెరవేర్చుకోవాలి). ఇది మార్కండేయ పురాణంలో అలర్కోపాఖ్యానంలో నలభై మూడవ అధ్యాయం.

**కర్మవిశేషం వల్ల మృత్యువు కలుగు తీరు**

**శ్లో. యేనానృతాని నోక్తాని ప్రీతిభేదః కృతో న చ**
**ఆస్తికః శ్రద్దధానశ్చ ససుఖం మృత్యు మృచ్ఛతి**

అబద్ధాలు చెప్పనివాడు, మిత్రులకు, బంధువులకు ప్రీతి చెడగొట్టనివాడు (నేరములు చెప్పి కుతంత్రములతో కొందరు విరోధాలు కలిగిస్తారు). దేవుని యందు, వేదాది ధార్మిక గ్రంథాలందు విశ్వాసము కలవాడు సుఖంగా (అనాయాసంగా) మరణించును.

**శ్లో. ఆగారదాహినో దాహం క్షుధం చానన్నదాయినః**
**ప్రాప్నువన్తి నరాః కాలే తస్మిన్ మృత్యావుపస్థితే**

ఇల్లు తగులబెట్టినవారికి మరణకాలమున అతిదాహము కలుగును. అన్నదానము చేయనివారికి మరణకాలమున తీవ్రమైన ఆకలి కలుగును.

**శ్లో. దేవబ్రాహ్మణపూజాయాం యే రతాశ్చానసూయవః**
**శ్లక్ష్ణావదాన్యాహ్రీమన్త స్తే నరా స్సుఖమృత్యవః**

దేవతలను, వేదవిదులను పూజించుటయందాసక్తి కలవారు, అసూయ లేనివారు, మృదువయినవారు, దాతలు, తప్పు చేయుటకు సిగ్గుపడువారు, సుఖంగా (శ్రమ లేకుండా) మరణించెదరు.

**శ్లో. యో న కామాన్న సంరమ్భాత్ న ద్వేషాద్ధర్మ ముత్సృజేత్**
**యథోక్తకారీ సౌమ్యశ్చ ససుఖం మృత్యుమృచ్ఛతి**

కామము వల్ల కాని, సంరంభము వల్ల కాని, ద్వేషము వల్ల కాని ధర్మమును వదలనివాడు, శాస్త్రమునందు చెప్పబడినట్లు ఆచరించువాడు, సౌమ్యుడు సుఖమృత్యువును పొందును.

**శ్లో. ప్రాణఘ్నం వేదనాం కష్టాం యే చాన్యే ద్వేషకారిణః**
**మోహాఽజ్ఞానప్రదాతారః ప్రాప్నువన్తి మహద్భయమ్**
**కూటసాక్షే మృషావాదీ యథాఽసదనుశాస్తి వై**

ప్రాణిద్వేషముతోనున్నవారు, మరణకాలమున ప్రాణములను తీయు కష్టమైన బాధను పొందుదురు. ఇతరులకు మోహం, అజ్ఞానం కలిగించువారు మరణకాలమున గొప్ప భయమును పొందుదురు. అబద్ధపు సాక్ష్యం చెప్పువారు, అసత్యములాడువారు, ఇతరులకు చెడుదారిని చూపువారు, మరణకాలమును, గొప్ప భయమును పొందురు.

**శ్లో. శీతం జయన్తీన్ధనదాః తాపం చోదకదాయినః**

ఇంధనములను దానము చేయువాడు మరణవేళ చలిబాధను పొందడు. నీటిని దానం చేసినవాడు మరణ సమయమున తాపమును పొందడు.

* * *

# శ్రీ దయానంద సరస్వతీ స్వామి - ఆయన వ్యాఖ్యాన పద్ధతి

మహాపండితుడు, మహామేధావి, బహుగ్రంథ రచయిత, మహర్షి బిరుదభాజనుడు అయిన శ్రీమద్దయానంద సరస్వతీస్వామి (వి.శ. 1881) 1824లో మౌర్వీరాజ్యం (సౌరాష్ట్ర-గుజరాత్) లో టంకారా గ్రామంలో సంపన్నుల కుటుంబంలో జన్మించారు. ఆయన మొదటి పేరు మూలశంకరుడు. వీరు యజుర్వేద సంహితనధ్యయనం చేశారు.

పరిస్థితుల వల్ల నవయౌవనంలోనే వైరాగ్యం కలిగి ఇల్లు విడిచి మోక్షేచ్ఛతో జ్ఞానార్జనకై అన్వేషించారు. నర్మదాతీరంలో ఉన్న పూర్ణానంద సరస్వతీ స్వామివారి దగ్గర సన్యాసదీక్ష తీసుకున్నారు.

వారు యోగుల సత్సాంగత్యం కోసం రాజపుతానా, మాలవా, రాజస్థాన పర్వతాలందు, అరణ్యములందు సంచరిస్తూ యోగుల దగ్గర యోగాన్ని అభ్యసించారు. హరిద్వారంలో కుంభమేళాకు వచ్చి సాధుసన్యాసుల సత్సంగం చేశారు. చండీపర్వతంపై యోగాభ్యాసం చేశారు. హిమాలయాల్లో వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ అమృతత్వం కలిగించే ఔషధికోసం అన్వేషించారు.

అక్కడనుండి కాశీ చేరి కొన్నాళ్ళు ఉన్నారు. నర్మదా నదీ ఉద్గమ స్థానము నుండి యోగుల నన్వేషిస్తూ సంచారం చేశారు. విక్రమశకం 1912లో మధురలో విరజానందస్వామి శిష్యుడై అనార్ష గ్రంథాలను యమునలో పడవేసి ఆర్షవిద్యాభ్యాసం చేశారు. అధ్యయనం పూర్తయిన తర్వాత గురువుగారి ఆజ్ఞననుసరించి వైదిక ధర్మవ్యాప్తికి మిథ్యాచార నిర్మూలనానికి కృషి చేయబూనారు. మహాపండితులతో శాస్త్రార్థాలు చేశారు. అనేక సంస్థానాల్లో ఉన్నారు. ఆయన భారతదేశంలో పలు ప్రాంతాల్లో

సంచరించి ఆర్యసమాజాలను స్థాపించారు. తన సిద్ధాంతాన్ని బోధించారు. ఋగ్వేదానికి, యజుర్వేదానికి సంస్కృతం లోను, హిందీలోను భాష్యాలు రచించారు. సత్యార్థ ప్రకాశాన్ని ఋగ్వేదాది భాష్య భూమికను, ఇంకా ఎన్నో గ్రంథాలను రచించారు. సంవత్ 1940లో ఆయన విషప్రయోగం వల్ల పరమపదించారు.

యూరోపియన్లు భారతీయ లూథర్ అని అమెరికాలోని ఆండ్ర్యూజెక్సన్ యోగి 'పరమేశ్వర ఆజ్ఞాపాలక పుత్రుడని' దయానంద సరస్వతీస్వామిని ప్రశంసించారు. ఆయనను యుగవిధాత, తత్త్వవేత్త, నవయుగనిర్మాత, ఋషి అని అనుయాయులు గౌరవిస్తారు.

**వేదభాష్య రచన**

శ్రీస్వామి విక్రమశకం 1931లో ఋగ్వేదభాష్యరచన ఆరంభించారు. సంస్కృతంలోను, హిందీలో గూడా ఈ గ్రంథం రచించారు. మంత్రం, పదవిభాగం, భావం, సంస్కృతంలో వ్రాసి క్రింద హిందీలో అర్థం, భావం వ్రాశారు. మునుల, ఋషుల మార్గాన్ని అనుసరించి దీన్ని రచించాను. దీనివల్ల ఆధునిక భాష్యాలు వేదదూషకమైన దోషాలు నశిస్తాయని వీరు చెప్పారు.

ప్రత్యక్షాది ప్రమాణ సిద్ధమైన ఈ భాష్యం సర్వ మనుష్యులకు ఉపకారం కలిగిస్తుందని వీరు భావించారు.

ఈశ్వరుడే సంహితలను రచించాడని శ్రీస్వామి చెప్పారు. 'అత్ర కర్మకాణ్డే దేవతాశబ్దేన వేదమన్త్రాణాం గ్రహణమ్' (ఋగ్వేదాది భాష్య భూమిక 57 పుట.) వేదంలో కర్మకాండ యందు దేవతాశబ్దంతో వేదమంత్రాలు గ్రహించబడతాయి.

వేదంలో వసువులు, రుద్రులు, ఆదిత్యులు ఉన్నారు. కాని వారిని ఉపాసించకూడదు. "కిమేతే ఉపాస్యాస్సన్తీత్యత్రాహ నైవ (పై గ్రంథం, 66

పుట) సర్వ జగత్కర్త, సర్వ శక్తిమంతుడు అయిన పరబ్రహ్మనే ఉపాసించాలి. అంతకంటే వేరైన వారిని ఉపాసించడం అనార్యత్వమే. (పై గ్రంథం, 66 పుట) పరబ్రహ్మకు శరీరం లేదు. (సర్వదా నిశ్శరీరం బ్రహ్మాస్తి (పై గ్రంథం, 60 పుట).

అగ్ని, పృథివి, వాయువు, అంతరిక్షం, ఆదిత్యుడు, దివము, చంద్రుడు, నక్షత్రాలు ఈ ఎనిమిది వసువులు. ప్రాణాపాన వ్యానోదాన సమానాలు, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయాలనే పదిప్రాణాలు, ఆత్మ, ఈ పదకొండుగురు రుద్రులు. (పై గ్రంథం, 65 పుట)

చైత్రం మొదలు ఫాల్గునం వరకు గల పన్నెండు మాసాలు ఆదిత్యులు పన్నెండుమంది.

అశని ఇంద్రుడు, ప్రజాపతి పశువులు, యజ్ఞం. వీరు త్రయస్త్రింశ ద్దేవతలు (పై పుట)

వాక్కే భూలోకం, మనస్సు అంతరిక్ష లోకం, ప్రాణం స్వర్గలోకం, ఇవే మూడులోకాలు.

అన్నం, ప్రాణం, వాయువు వీరు ముగ్గురు దేవతలు. వీరినెవరినీ ఉపాసించకూడదు. సర్వజగత్కర్త, సర్వశక్తిమంతుడు, అందరికీ ఇష్టమయినవాడు, సర్వాధారుడు, సర్వవ్యాపకుడు, సర్వకారణం, అనాది, సచ్చిదానంద స్వరూపుడు, పుట్టుక లేనివాడు, న్యాయకారి మొదలైన విశేషణాలు గల పరబ్రహ్మ మాత్రమే ఉపాసింపదగినవాడు. (పై గ్రంథం, 65, 66 పుటలు)

ఇంతకంటె ఇతరమైన వారిని ఉపాసించిన వారికి అనార్యత్వమే కలుగుతుంది (పై గ్రంథం, 66 పుట) అని వీరి సిద్ధాంతము.

ఇంద్రుడు, వరుణుడు, అగ్ని మొదలైన పదాలతో ఈశ్వరుడే (పరబ్రహ్మయే) వేదంలో స్తుతింపబడుతున్నాడు. (పై గ్రంథం, 70 పుట)

మంత్రసంహితయే వేదం. బ్రాహ్మణాలకు వేదమనే పేరు లేదు. (పై గ్రంథం, పుట 80 పుట)

వీటికి వేదంవలె, స్వతంత్ర ప్రామాణ్యం లేదు. ఇవి ఈశ్వరోక్తాలు కావు. (పై గ్రంథం, 88 పుట)

వేదవ్యాఖ్యానాల వంటివి బ్రాహ్మణాలు, ఇవి మిగిలిన వేదశాఖలు, వేదవ్యాఖ్యానాలు, వేదాంగాలు, ఉపాంగాలు వేదాలకు అనుగుణంగా ఉంటే ప్రమాణాలు (పై గ్రంథం, 88, 289 పుటలు)

సాయణ, రావణ, మహీధరాదులు వేదానికి విరుద్ధమైన భాష్యాలు వ్రాశారు. అవి ప్రమాణాలు కావు. (పై గ్రంథం, 337 పుట)

వేదంలో సర్వ విద్యలు ఉన్నాయి. పృథివ్యాది లోకభ్రమణం, ఆకర్షణానుకర్షణాలు, గణితం, నౌవిమాన విద్యలు, తారావిద్య, వైద్యకం మొదలైన విద్యలన్నీ వేదంలో ఉన్నాయి. కర్మ, ఉపాసన, ముక్తి, విజ్ఞానం ఈ నాలుగు విషయాలు వేదంలో ఉన్నాయి.

వీరు వేదభాష్యంలో కర్మకాండ శబ్దార్థవర్ణన మాత్రంగానే వ్రాశారు. అగ్నిహోత్రాద్యశ్వమేధాన్త కర్మల వర్ణనం విస్తరంగా చేయలేదు. కల్పగ్రంథాలలో అవి ఉన్నాయి. ఇక్కడ కూడ వ్రాస్తే పునరుక్తి, పిష్టపేషణం అనే దోషాలు కలుగుతాయి అని వీరు చెప్పారు. (పై గ్రంథం, 354 పుట)

ఉపాసనకాండకు కూడా ప్రకరణ శబ్దానుసారంగా వ్యాఖ్య చేశారు. విశేషాలు సాంఖ్య వేదాంతశాస్త్రాలలో ఉన్నాయి. కర్మ, ఉపాసన, జ్ఞానం, విజ్ఞానం అనే నాలుగు కాండల విషయాలు వేదవ్యాఖ్యానాల్లో ఉన్నాయి. వాటిని పరిశీలించి వేదవిరుద్ధం కాని వాటిని గ్రహించాలి.

వేదశబ్దాల స్వరం ఉచ్చారణ వేదాజ్ఞాలలో ఉన్నాయి.

ఇక్కడ వేదమంత్రాలకు సంస్కృత ప్రాకృత (హిందీ) భాషల్లో ప్రమాణసహితంగా ప్రతిపదార్థం వ్రాశారు. అవసరమైనప్పుడు వ్యాకరణాది ప్రమాణాలను కూడా వ్రాశారు. సాయణాచార్యభాష్యంలో దోషాలు అనేకం ఉన్నాయి. ఆయా మంత్రాల భాష్యంలో వాటిని ఖండిస్తామని శ్రీ దయానంద సరస్వతీస్వామి చెప్పారు. (పై గ్రంథం, 337 పుట)

సాయణాచార్యులు స్వేచ్ఛగా లోకవృత్తికనుకూలంగా భాష్యాలు వ్రాశారు. ప్రసిద్ధికి తెచ్చారు. వాటివల్ల గొప్ప అనర్థం కలిగింది. వాటివల్ల ఐరోపా ఖండవాసులకు వేదాల విషయంలో భ్రమ కలిగిందని శ్రీస్వామి అభిప్రాయం. (పై గ్రంథం, 355 పుట)

ఋగ్వేదంలో అన్ని పదార్థాల గుణాలు వెల్లడించడం జరిగింది. అవి తెలియనిదే సంస్కారం, ప్రీతి కలుగవు. అవి లేనిదే ప్రవృత్తి ఉండదు కాబట్టి ఋగ్వేదాన్ని మొదటి వేదంగా పరిగణించారు. ఈ వేదంలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, సరస్వతి, అశ్వినులు ఈ శబ్దాలు గల మంత్రాలు క్రమంగా ఉన్నాయి. అగ్నిశబ్దంచే ఈశ్వరుడు, భౌతిక పదార్థాలు గ్రహించబడుతాయి. అగ్ని శిల్పవిద్యలకు మూలం, శిల్పవిద్యలలో భౌతికాగ్నికి వాయువు సహాయకారి, వాయువు మూర్తద్రవ్యాలకు ఆధారం. ఇంద్రశబ్దంచే పరమైశ్వర్య వత్త్వాది గుణాలు వెల్లడి అవుతాయి. శిల్పవిద్యయందు యానచలనాది వ్యవహారమందు జలాగ్ని పృథివీ ప్రకాశాది హేతువులు అశ్వి శబ్దంచే సూచింపబడతాయి. సరస్వతీ శబ్దంచే ఈశ్వరుని అనంత విద్యావత్త్వం, శబ్దార్థరూప సంబంధం, వాగ్వ్యవహారం వెల్లడి అవుతాయి. కాబట్టి ఈ మంత్రాలీక్రమంలో ఉన్నాయి.

వేదారంభంలో అగ్నిశబ్దంచే భౌతికాగ్నితోబాటు ఈశ్వరుడు కూడా చెప్పబడతాడు. ఇలా అల్పాక్షరాలలో అనల్పార్థం ఉంది. (పై గ్రంథం, 163 పుట)

వేదమంత్రాలలో ఉపదేశింపబడిన విద్యల నాయామంత్ర భాష్యాలలో వర్ణించారు.

ఈ సిద్ధాంతాలతో శ్రీమద్దయానంద సరస్వతీ స్వామివారి ఋగ్వేద భాష్యరచన, శుక్ల యజుర్వేద భాష్యరచన సాగాయి.

శుక్ల యజుర్వేదానికి మహీధరుడు వేదానికి దూషణం కలిగించే భాష్యం రాసి వేదదీపమని పేరు పెట్టాడని చెప్పి ఆ భాష్యంలో ఉన్న దోషాలను ఖండిస్తూ శ్రీదయానంద సరస్వతీస్వామి యజుర్వేద భాష్యం వ్రాశారు. దీనిలో హిందీలో ప్రతిపదార్థం, భావార్థం ఉన్నాయి. కామ్యములు, క్రియాకాండ వివరించారు. విక్రమశకం 1934లో ప్రారంభం అయిన ఈ భాష్యం సంవత్ 1939కి సమాప్తమయ్యింది. సంవత్ 1946లో ముద్రితమయ్యింది.

* * *